ఆంధ్రప్రదేశ్

# గిరిజన వైద్యామృతం



TRIBAL CULTURAL RESEARCH AND TRAINING INSTITUTE

Tribal Welfare Department

Government of Andhra Pradesh, Hyderabad.

కదారి మధుసూదన్

సత్యమేవ జయతే

# ఆంధ్రప్రదేశ్

# గిరిజన వైద్యామృతం


**శ్రీ ఓ.యస్.వి.డి. ప్రసాద్**

సంచాలకులు, టి.సి.ఆర్. & టి.ఐ.

**శ్రీ ఆర్. వేదరాజ్**

ఉప సంచాలకులు, టి.సి.ఆర్. & టి.ఐ.



TCR&TI

గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ,

గిరిజన సంక్షేమ శాఖ,

2వ అంతస్తు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనం

మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ - 500 028

# ఆంధ్రప్రదేశ్ గిరిజన వైద్యామృతం

రచయితలు:

**డా॥ అల్లం విజయ భాస్కర్ రెడ్డి,** ఎం.ఎస్సి., బి.ఇడి., సి.సి.ఎ.పి., పిహెచ్.డి.
ఇ.నెం.4-4-143, ఇందిరారెడ్డి నగర్, డాన్‌బోస్కో పోస్ట్,
హైదరాబాద్-500 086, సెల్ : 94407 47620

**కత్తుల రామ్‌రెడ్డి,** బి.ఎస్సి., (గిరిజన వైద్యులు)
సరభవరం గ్రామము, మోహనాపురం పోస్టు, గంగవరం మండల్,
వయా అడ్డతీగల, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 94921 65801

పేజీలు: 280

© గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ,
గిరిజన సంక్షేమ శాఖ,
2వ అంతస్తు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనం
మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ - 500 028

వెల: 250/-

మొదటి ప్రచురణ:

కాపీలు: 1000

ప్రింటర్స్:
ది కొ-ఆపరేటివ్ ప్రెస్ లిమిటెడ్,
5-9-299, సూర్యలోక్ కాంప్లెక్స్,
గన్‌ఫౌండ్రి, హైదరాబాద్ - 500 001

ప్రచురణ:
గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ,
గిరిజన సంక్షేమ శాఖ,
2వ అంతస్తు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనం
మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ - 500 028

# కృతజ్ఞతలు

గిరిజన వైద్యాన్ని ఈ పుస్తక రూపంలో తీసుకొని రావటానికి ఆలోచన చేసి, ప్రోత్సహించి, ఆర్థిక సహాయాన్ని అందచేసిన శ్రీమతి ఎ.శాంతి కుమారి, ఐ.ఎ.యస్., కమీషనరు, గిరిజన సంక్షేమ శాఖ వారికి, శ్రీ చినవీరభద్రుడు, అదనపు సంచాలకుల వారికి, వైద్య వివరాలను సేకరించుటలో తగు సహకారాన్ని అందించి మాకు ఎంతో అమూల్యమైన వైద్యరీతులను వివరించిన వివిధ గిరిజన తెగల వెజ్జులకు; డా॥ కొప్పుల హేమాద్రి గారికి, పుస్తక రచనలో తమ అమూల్యమైన సలహాలు అందించిన ప్రొఫెసర్ రాధాక్రిష్ణయ్య, ప్రొఫెసర్ వై.ఎన్.ఆర్. వర్మ, డా॥ విజయ కుమార్ గార్లకు; డా॥ పి.వి.రాజ్ గారికి, ఎంతో శ్రమతో సమాచార సేకరణ చేసి ఈ పుస్తక రచన చేసిన డా॥ అల్లం విజయ భాస్కర్ రెడ్డిగారికి మరియు శ్రీ కత్తుల రామిరెడ్డి గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఓ.యస్.వి.డి.ప్రసాద్
సంచాలకులు

# విషయ సూచిక


కృతజ్ఞతలు --- i

ముందుమాట --- iv

గిరిజన సంస్కృతి - పరిచయము --- vii

**అధ్యాయం - 1**

**విశిష్ట వ్యాధులు - గిరిజన వైద్య చికిత్స**

1.1 తలకు సంబంధించిన వ్యాధులు 1

1.2 కంటి సమస్యలు / వ్యాధులు 19

1.3 ముక్కుకి సంబంధించిన వ్యాధులు 25

1.4 చెవికి సంబందించిన వ్యాధులు 36

1.5 పంటికి సంబంధించిన వ్యాధులు 45

1.6 నోటికి సంబంధించిన వ్యాధులు 54

1.7 శ్వాసకోశ సంబంధిత వ్యాధులు 58

1.8 గుండె సంబంధిత వ్యాధులు 64

1.9 ఉదర సంబంధిత వ్యాధులు 71

1.10 మూత్రపిండ సంబందిత వ్యాధులు 84

1.11 కాలేయ సంబంధిత వ్యాధులు 92

1.12 చర్మ సంబంధిత వ్యాధులు 98

1.13 జననేంద్రియ సంబంధిత వ్యాధులు 108

1.14 స్త్రీలకు సంబంధించిన వ్యాధులు 112

1.15 ధూప వైద్యం 114

**అధ్యాయం - 2**

**సాధారణ వ్యాధులు - గిరిజన వైద్య చికిత్స**

2.1 సాధారణ జ్వరం 120

2.2 మలేరియా జ్వరం 122

2.3 కుక్క కాటు 126

2.4 పాము కాటు 132

2.5 మొలలు 140

| | | |
|---|---|---|
| 2.6 | ఎముకలు విరుగుట | 141 |
| 2.7 | జ్ఞాపకశక్తి పెంపొందించుటకు | 145 |
| 2.8 | అతిసార వ్యాధి | 148 |
| 2.9 | అధిక ఉష్ణం | 151 |
| 2.10 | కీళ్ళ నొప్పులు | 157 |
| 2.11 | నారి కురుపులు | 161 |
| 2.12 | గోరుజెట్ట | 163 |
| 2.13 | సెప్టిక్ గాయాలు | 166 |
| 2.14 | నులి పురుగులు | 169 |
| 2.15 | మధుమేహం | 173 |
| 2.16 | గవద బిళ్ళలు | 179 |
| 2.17 | బోదకాలు | 183 |

**అధ్యాయం - 3**

**గిరిజన కషాయం, చూర్ణం, లేహ్యం తయారీ విధానం**

| | | |
|---|---|---|
| 3.1 | గిరిజన కషాయం | 188 |
| 3.2 | ముతరాస కషాయం | 191 |
| 3.3 | పాపికొండ చూర్ణము | 194 |
| 3.4 | సంభోగవృద్ధి చూర్ణము | 196 |
| 3.5 | గోనుపల్లి చూర్ణము | 198 |
| 3.6 | చరబవరం వీర్య వృద్ధి చూర్ణము | 200 |
| 3.7 | చోడవరం చూర్ణము | 202 |
| 3.8 | చింతపల్లి లేహ్యం | 204 |
| 3.9 | పైడిపుట్ట లేహ్యం | 206 |
| 3.10 | వేటమామిడి తైలం | 208 |
| 3.11 | మారేడుమిల్లి చలువ కషాయం | 210 |
| 3.12 | పురటాల కషాయం | 211 |

**అనుబంధం - 1**

శాస్త్రీయ నామాల పట్టిక 213

# ముందుమాట

ఈ భూమండంలంపై మొట్టమొదటగా ఆదిమ మానవుడు సరిగ్గా 55 మిలియన్ సంవత్సరాల క్రితం జన్మించాడంటారు. తరువాత ఆదిమ మానవుడు పరిణామం చెందుతూ ఆధునిక మానవుడిగా రూపాంతరం చెంది ఇప్పటికి ఒక లక్ష సంవత్సరాలయిందని చెప్పవచ్చు. కోతుల నుండి మనిషిగా ఆదిమ మానవుడు రూపాంతరం చెందిన నాటినుండి నేటి వరకు కూడా ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ ప్రకృతి మరియు మొక్కలపైనే ఆధారపడి తన మనుగడ సాగిస్తున్నాడు. ముఖ్యంగా ఆదివాసీ తెగకు చెందిన గిరిజనులు తమ యావజ్జీవితం మొత్తం అడవి తల్లి ఒడిలోనే గడుపుతూ వస్తున్నారు. ఆ అడవి తల్లే వారికి సర్వస్వం. ఆటలైనా, అవసరాలైనా ఆ అడవితల్లితోనే. కష్టమైనా, సుఖమైనా వారు ఆ అడవి తల్లినే ఆశ్రయిస్తారు. అడవిలోని ప్రతి చెట్టూ, పుట్ట వారికి స్నేహితులే. ఆకలి వేస్తే అడవిలో దొరికే ఆకులు, అలములు, పండ్లు తింటారు. సంతోష సంబరాలలో ఆ అడవి తల్లినే వారి ఇలవేల్పుగా కొలుస్తారు. ఇంతగా వారి జీవనం అడవితో ముడిపడి ఉంటుంది.

మరి రోగమొస్తే! ఇంకేముంది వారి అడవితల్లి అమృత హస్తాలతో ఒసగిన 'గిరిజన వైద్యామృతం' వారి చేతుల్లోనే ఉంది. గిరిజనులలో నాయకులు, వైద్యులుగా పిలువబడే వెజ్జులు, వయస్సులో పెద్దవారు తమ అనుభవంతో అడవిలో దొరికే అనేక వన మూలికలను శోధించి, సాధించి వైద్యం చేస్తారు. అంతే ఆ రోగం ఇట్టే నయమౌతుంది. ఆధునిక వైద్యంలో లక్షలు ఖర్చు చేసినా నయంకాని కొన్ని మొండి జబ్బులు సైతం వీరిచ్చే చెట్టుమందులకు చిటికెలో నయం కావలసిందే. ఎంతపెద్ద రోగమైనా గిరిజన వైద్యానికి లొంగవలసిందే. మన దేశంలో మరీ ప్రత్యేకంగా మన రాష్ట్రంలో ఉన్న గిరిజనులు రోగ నివారణ కోసం పూర్తిగా అడవులలో దొరికే వనమూలికలపైనే ఆధారపడుతూ ఉంటారు. ఈ వైద్య విజ్ఞానం తరతరాలుగా

ఒకరినుండి మరొకరికి అందించబడుతూ వస్తుంది. ఎంతోమంది గిరిజనేతరులు సైతం వైద్యం కోసం గిరిజన ప్రాంతాలకు ఇప్పటికీ వెళుతుంటారు.

మన భారత దేశంలో సుమారుగా 4,70,000 వృక్ష జాతులు ఉన్నాయి. ఇందులో 52,000 వరకు వృక్ష జాతులు ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యాయి. వీటిలో ఎన్నో మొక్కలు ఏదో ఒక రకంగా వైద్యంలో ఉపయోగకరంగా ఉంటాయి. సుమారుగా 8,000లకు పైగా వృక్ష జాతులను మన భారత దేశంలో గిరిజన వైద్యంలో ఉపయోగిస్తూ ఉన్నారు. అలాగే గ్రామీణ వైద్యంలో 5,000 రకాల వృక్ష జాతులను, యునానీ వైద్యంలో 700 రకాల వృక్ష జాతులను, ఆయుర్వేద వైద్యంలో 800 రకాల వృక్ష జాతులను, ఆధునిక వైద్యంలో కేవలం 30 రకాల వృక్ష జాతులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. దీనిని బట్టి గిరిజనులకు తెలిసిన మందు మొక్కల ఉపయోగాలు మరెవరికీ తెలియవనే చెప్పవచ్చు.

ఇంగ్లీషు మందుల వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్, ఈ గిరిజన వైద్యంలో లేకపోవడం, ఫలితాలు ఇంగ్లీషు వైద్యం కన్నా మిన్నగా ఉండటం, వైద్యానికి అయ్యే ఖర్చు ఇంగ్లీషు వైద్యంతో పోలిస్తే చాలా తక్కువగా ఉండటం, వ్యాధి నిర్ధారణ, నివారణ ఖచ్చితంగా చేయగలగటం, శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి తద్వారా ఆరోగ్యాన్ని పెంపొందింప చేయటం వంటి అనేక విశిష్టతలు ఈ గిరిజన వైద్యంలో ఉండటం మూలంగా రోజురోజుకీ ఈ వైద్యం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ కనిపిస్తూ ఉంది.

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (W.H.O.) వారు కూడా ప్రపంచ వ్యాప్తంగా ఈ గిరిజన వైద్యంపై పరిశోధనల కోసం వివిధ సంస్థలను ప్రోత్సహిస్తూ ఆర్థిక సహాయ సహకారాలు అందచేస్తూ ఉన్నారు. ఇకపోతే మన భారత దేశంలో బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (B.S.I.), సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ (C.C.R.U.M.), నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (N.B.R.I.), నేషనల్ బోర్డ్

ఆఫ్ ప్లాంట్, జెనెటిక్ రీసెర్చ్ (N.B.P.G.R.), బీర్బల్ సహాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పేలియోబోటనీ (B.S.I.P.), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ (C.I.M.A.P.) వంటి ప్రముఖ సంస్థలు, ఇంకా ఎన్నో విశ్వవిద్యాలయాలు గిరిజన వైద్యం మీద పరిశోధనలు చేస్తూ ఉన్నారు. ఈ గిరిజన వైద్యానికి ఇంత ప్రాముఖ్యం రావటానికి తరతరాలుగా గిరిజనులు తమపై తాము ప్రయోగాలు చేసుకొని ఫలితాలు వచ్చిన తరువాత ఇతరులకు చేయటం మూలంగానే. ప్రకృతిలో మమేకమై కొన్ని జంతువులు మొక్కలను ఉపయోగించుకొని గాయాల నుండి, ఇతర వ్యాధులనుండి ఎలా ఉపశమనం పొందుతున్నాయో గమనించి ఆ మూలికల విలువను ప్రపంచానికి చాటటం మూలంగానే నేడు ప్రపంచ దృష్టిని గిరిజన వైద్యం ఆకర్షించగలిగింది.

నాగరికత అభివృద్ధి చెందిన కొద్దీ మానవుడు ప్రకృతికి దూరంగా పోతున్నాడు. దీని మూలంగా మనోవ్యాధులు, హృద్రోగాలు, నాడీ సంబంధ, ఇంకా అనేక రుగ్మతల బారిన పడుతూ ఉన్నాడు. కృత్రిమంగా జీవిస్తూ, ఉరుకుల పరుగుల ఈ దైనందిన జీవితంలో అలసి సొలసి ఉన్న ఆధునిక మానవునికి గిరిజన వైద్యం నిజంగా ఒక సంజీవని అని చెప్పాలి. అతి తక్కువ ఖర్చుతో సులభమైన చికిత్సా విధానంతో, ఖచ్చితమైన ఫలితాలతో ఉన్న గిరిజన వైద్యం నిజంగా అమృత తుల్యమే. ఈ గిరిజన వైద్యామృతాన్ని అందరికీ అందించాలనే సదుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో పుస్తక రూపంలో మీ ముందుకు తెస్తున్నారు. ఆదరించండి.

**"సర్వేజనా సుఖినో భవంతు"**

**డా॥పి.వి.రాజ**

అదనపు సంచాలకులు (రిటైర్డ్),
ఆయుష్ విభాగము, హైదరాబాద్

# గిరిజన సంస్కృతి - పరిచయం

గిరిజనులు అనగా అనాదిగా ఒకే ప్రాంతంలో నివసిస్తూ వారి నాగరికతను తరతరాలుగా కొనసాగించే చిన్న చిన్న కుటుంబాలు అని అర్థం. వీరి నాగరికత ప్రత్యేకంగా ఉంటుంది. వీరు భౌగోళికంగా కూడా ఇతర ప్రాంత ప్రజలతో సంబంధాలు లేకుండా వేరుపడి ఉంటారు. ఆధునిక మానవులతో కలవటానికి ఎంత మాత్రము ఇష్టపడరు. సిగ్గు, భయం చేత వీరు ఇతర ప్రాంత ప్రజలతో దూరంగా ఉంటారు. అన్నింటిలోనూ చాలా వెనుకబడి ఉంటారు. తమ పూర్వీకులు ఏవైతే ఆచార వ్యవహారాలు ఆచరించారో వాటినే అనుసరిస్తూ ఎక్కువగా అడవులలోనూ, కొండవాలు ప్రాంతాలలోనూ లేక పూర్తిగా ఎత్తైన కొండలపైనే తమ జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారు.

మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారుగా 35 రకాలైన ఆదివాసీ జాతులు నివసిస్తున్నారు. వీరిలో కొన్ని జాతుల వారు కొండలపైన, మరికొంతమంది మైదాన ప్రాంతాలలో, మరికొంతమంది గ్రామాలలోనే దూరంగా వేరుపడి జీవనం కొనసాగిస్తూ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఈ 35 జాతులను షెడ్యూల్డు తెగలుగా గుర్తించి వారి అభ్యున్నతి కోసం పాటుపడుతూ ఉన్నది.

ఈ ఆదివాసీలంతా ఇప్పటికీ ఆర్థికంగా, నాగరికంగా ఎంతో వెనుకబడి ఉన్నారు. వీరి వివాహ వ్యవస్థ ఒక్కో తెగలో ఒక్కో రకంగా ఉంటుంది. కొన్ని తెగలలో యుక్త వయస్సులో ఉన్న యువకులు తమకు నచ్చిన యువతిని తీసుకొనిపోయి వివాహం చేసుకుంటారు. మరి కొన్ని తెగలలో పెద్దలు మాట్లాడి

వివాహాలు కుదురుస్తూ ఉంటారు. వీరికి వివాహం అత్యంత వేడుక సమయం. ఈ సమయంలో అధికంగా మద్యం సేవించి, మాంసాహారాన్ని ఎక్కువ ఇష్టంగా తింటారు.

వీరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, నూకాలమ్మ, పోలేరమ్మ, భూమిదేవి, గంగమ్మ దేవత, పెద్ద దేముడు, శంకు దేముడు, నంది దేముడు, కర్రరాజు, పోతరాజు, జాకర దేవత, బోడు దేవత, నిశాని దేవత మరియు భూమి, కొండ, నీరు, నిప్పు, గాలి వంటి వాటిని తమ ఇలవేల్పులుగా పూజిస్తూ ఉంటారు. వేటకు వెళ్ళేముందు, తరువాత వేటలో పెద్ద జంతువు ఏదైనా దొరికినట్లయితే వీరు గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి అందరూ కలసి దానిని పంచుకొని తింటారు.

ఆదివాసులు పండుగలు కూడా ఎంతో వైభవంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. గ్రామంలో లేక గూడెంలో ఉన్న వారందరూ పెద్ద, చిన్న, ఆడ, మగ భేదం లేకుండా అందరూ గ్రామం మధ్యలో ఉన్న గ్రామదేవత మందిరానికి చేరుకుంటారు. ఆదివాసులు ఎక్కువగా గిలియాబ్ పోర్బు, పొదుజ, గొట్నకోయ, ఆంప్లీషువ, బందపాన్బుర, నందిపురబ్, వాల్పుడ, బలిదేవత వంటి పండగలను జరుపుకుంటారు. ఈ సమయంలో ఒక్కో గిరిజన తెగ, వారి సంప్రదాయ నృత్యాన్ని చేస్తూ కొమ్ము బూరలు, డప్పులు, వెదురు బొంగులతో శబ్దాలు చేస్తూ రాత్రి పొద్దుపోయేవరకు ఆనందంగా చిందులు వేస్తారు. తరువాత ఆ ప్రదేశంలోనే కటిక నేలపై ఆదమరచి ప్రకృతి ఒడిలో హాయిగా నిద్రపోతారు.

ఇక వ్యవసాయ సంగతికి వస్తే కొన్ని తెగలవారు స్థిర నివాసం ఏర్పరచుకొని మైదాన ప్రాంతాలలో వ్యవసాయం చేస్తూ జొన్నలు, రాగులు, కొర్రలు పండిస్తూ ఉంటే మరికొంతమంది ఇప్పటికీ పోడు వ్యవసాయాన్ని ఆచరిస్తూ ఉన్నారు. పోడు

వ్యవసాయం అంటే అడవిలో కొంత ప్రదేశాన్ని నరికి తగులబెట్టేస్తారు. తరువాత ఆ ప్రదేశాన్ని చదను చేసి అందులో జొన్న, కొర్రలు వంటి గింజలు చల్లుతారు. వర్షాలు పడగానే అవి మొలకెత్తుతాయి. ఫలసాయం అందగానే వారు ఆ ప్రదేశాన్ని విడిచి మరొక ప్రదేశానికి పోయి మరలా అడవిని నరికి వ్యవసాయం చేస్తూ ఉంటారు. రాళ్ళు తేలి వ్యవసాయానికి పనికి రాకుండాపోయిన ప్రతిసారీ వీరు ప్రదేశాన్ని మారుస్తూ ఉంటారు. దీనివల్ల ఎంతో విలువైన అడవి సంపద నాశనం అవుతుంది.

కొంతమంది గిరిజనులు అడవులలో దొరికే వివిధ ఫలాలు, తేనె, కుంకుడుకాయలు, అడ్డాకులు, ఇప్పపువ్వు వంటి వాటిని సంతలలో అమ్ముతూ ఉంటారు. ఈ సంతలను 'షాండి' అని ప్రత్యేకమైన పేరుతో పిలుస్తూ ఉంటారు. కొంతమంది వెజ్జులు, మహిళలు ఎంతో విలువైన వనమూలికలను అడవులనుండి సేకరించి ఈ షాండీలలో అమ్ముతూ ఉంటారు. ఎంతో మంది గ్రామ ప్రాంతాలవారు ఈ సంతలకు వెళ్ళి అమూల్యమైన వనమూలికలను కొని తెచ్చుకుంటూ ఉంటారు.

**డా॥ అల్లం విజయభాస్కర్ రెడ్డి,**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ బాటనీ,
పి.జి. కాలేజ్ ఆఫ్ సైన్స్, సైఫాబాద్, హైదరాబాద్-500 004

మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో నిర్వహించే ముఖ్యమైన షాండీల వివరాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వటం జరిగింది.

| జిల్లా పేరు | డివిజన్ పేరు | షాండీ జరుగు ప్రదేశం | షాండీ జరుగు రోజు | దొరుకు మూలికలు |
|---|---|---|---|---|
| తూర్పు గోదావరి | రంపచోడవరం | మారేడుమిల్లి | శనివారం | కరక, ముసిడి, తిప్పతీగ, తేనె, తపసి |
| తూర్పు గోదావరి | రంపచోడవరం | అడ్డతీగల | మంగళ వారం | తేనె, ఉసిరి,కుంకుడు తపసిజిగురు, కరక |
| తూర్పు గోదావరి | రంపచోడవరం | రంపచోడవరం | ఆదివారం | కరక, తేనె, ఉసిరి, తపసిజిగురు |
| విశాఖపట్నం | పాడేరు | చింతపల్లి | శుక్రవారం | పిప్పలి, అల్లం, పసుపు, కాఫీ, మిరియాలు |
| విశాఖపట్నం | పాడేరు | జి. మాడుగుల | మంగళ వారం | పిప్పలి, అల్లం, పసుపు, కాఫీ, మిరియాలు, కంద, వెల్లుల్లి |
| విశాఖపట్నం | పాడేరు | పెదబయలు | శుక్రవారం | పాలదుంపలు, అల్లం, పసుపు, కంద |

## అధ్యాయం-1

# 1.1 తలకు సంబంధించిన వ్యాధులు

## తల చుండ్రు

**వ్యాధి లక్షణాలు :** తల వెంట్రుకలకు కావలసిన నూనె పదార్థాలు తలలో ఉన్న గ్రంథులు స్రవించనప్పుడు తల చర్మం పొడి బారిపోతుంది. దీని మూలంగా తలలో చర్మం చిట్లిపోయి మృతకణాలు తెల్లటి చుండ్రు రూపంలో వెంట్రుకల మధ్య కనిపిస్తూ ఉంటాయి. ఎక్కువగా దురద, వెంట్రుకలు ఊడిపోవుట వంటివి జరుగుతుంటాయి.

**మొక్కపేరు :** కోడి మురుసు, గజ్జాకు



**శాస్త్రీయనామం :** పెటలిడియం బార్లీరియాయిడిస్ (PETALIDIUM BARLERIOIDES)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** రాతి నేలల్లో, రాళ్ళ మధ్య భాగంలో పెరుగుతుంది. పత్రాలు చాలా నునుపైన నూగుని కలిగి ఉండి మెత్తగా ఉంటాయి

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చగా ఉన్న ఆకులను గుప్పెడు తీసుకొని కొద్దిగా పసుపు చేర్చి మెత్తగా దంచాలి. దీనిని వెంట్రుక కుదుళ్ళకు పట్టించి పది నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇలా వారానికొక్కసారి రెండు నెలలు చేసినట్లయితే తల చుండ్రు పోయి వెంట్రుకలు రాలడం తగ్గిపోతుంది.

**గమనిక :** కొద్దిమందికి ఈ ఆకులవల్ల దురద వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి మొదట కొద్ది మొత్తంలో వాడి చూసి సమస్యలు లేనట్లయితే ఉపయోగించవచ్చు.

**మొక్కపేరు :** నక్క పెంటిక గడ్డ



**శాస్త్రీయనామం :** లెపిడగాథిస్ క్రిస్టేటా (LEPIDAGATHIS CRYSTATA)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా బంజరు భూముల్లో పెరుగుతుంది. మొక్క గడ్డలు గడ్డలుగా ఉంటూ ముండ్లను కలిగి తెల్లటి లేక లేత గులాబి వంటి పూలను పూస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క యొక్క అన్ని భాగాలు.

**తయారి/చికిత్సా విధానం :** మొక్క అన్ని భాగాలను ఎండించి చూర్ణం చేయాలి. ఈ చూర్ణాన్ని కొబ్బరినూనెలో కలిపి వారం రోజులపాటు తలకు పట్టించినట్లయితే చుండ్రు బారినుండి త్వరిత విముక్తి కలుగుతుంది.

మొక్క సమూలం పచ్చిగా ఉన్నది తీసుకొని మెత్తగా నూరి కొద్దిగా నువ్వుల నూనె చేర్చి తలకు బాగా పట్టించి గంట తరువాత గోరువెచ్చని నీటితో స్నానం చేసినట్లయితే చుండ్రు తొలిగిపోతుంది.

**మొక్కపేరు :** గోరింట, మైదాకు చెట్టు



**శాస్త్రీయనామం :** లాసనియా ఇనర్మిస్ (LAWSONIA INERMIS)

**కుటుంబం :** లైథ్రేసి (LYTHRACEAE)

**దొరుకు ప్రదేశం:** ఈ మొక్కను అన్ని గ్రామాలలో ప్రజలు పెరట్లో పెంచుకుంటారు. ఈ ఆకులను మెత్తగా నూరి చేతులపై పెట్టుకున్నట్లయితే చేతులు ఎర్రగా పండుతాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** 100 గ్రాముల ఆకులను మెత్తగా నూరి తల వెంట్రుకల కుదుళ్ళకు బాగా పట్టించి, ఒక గంటసేపు అలాగే ఉంచుకొని తరువాత గోరువెచ్చని ఆముదాన్ని తల వెంట్రుకలకు పట్టించాలి. ఒక గంట తరువాత వేడి నీటితో తలస్నానం చేసినట్లయితే చుండ్రు తగ్గిపోయి వెంట్రుకలు నిగనిగలాడుతాయి.

**గమనిక :** వెంట్రుకలు కొద్దిగా ఎరుపు రంగులోకి మారిపోతాయి. ఇలా ఇష్టం లేనివారు వేరే చికిత్సను ఉపయోగించవచ్చు.

**మొక్కపేరు :** మందార



**శాస్త్రీయనామం :** హైబిస్కస్ రోజాసైనెన్సిస్ (HIBISCUS ROSASINENSIS)

**కుటుంబం :** మాల్వేసి (MALVACEAE)

**దొరుకు ప్రదేశం:** ఈ మొక్కను అందమైన పూవుల కోసం ఇండ్లలో పెంచుతూ ఉంటారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, పూలు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలను కోడిగుడ్డు సొనతో కలిపి మెత్తగా నూరి తలకు పట్టించాలి. ఒక అర్ధగంట తరువాత స్నానం చేసినట్లయితే చుండ్రునుండి తక్షణ విముక్తి కలుగుతుంది.

మందార పూలను 150 గ్రాములు తీసుకొని అరలీటరు కొబ్బరి నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తరువాత కొబ్బరి నూనెను పరిశుభ్రమైన గుడ్డ ద్వారా వడపోయాలి. ఈ నూనెను నెల రోజులపాటు తల వెంట్రుకల కుదుళ్ళకు పట్టించినట్లయితే చుండ్రు పూర్తిగా తగ్గిపోయి, వెంట్రుకలు బాగా దట్టంగా పెరుగుతాయి.

**మొక్కపేరు :** నీటిగొబ్బి, ముండ్ల గొబ్బి



**శాస్త్రీయనామం :** హైగ్రోఫిల్లా ఆరిక్యులేటా (HYGROPHILLA AURICULATA)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఆంధ్రప్రదేశ్ అంతటా వరి పొలాల గట్ల వెంట, నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో పెరుగుతుంది. పొడవైన సూదుల వంటి ముండ్లను కలిగి ఉండి నీలం వర్ణంలో పువ్వులు పూస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** మొక్క యొక్క ఆకులను గోరువెచ్చని నీటిలో అరగంట నానబెట్టాలి. తరువాత ఆ ఆకులను తీసి కొబ్బరి నూనెలో వేసి బాగా ఉడికించాలి. ఈ నూనెను వడపోసి వారం రోజుల పాటు తలకు రాసి మర్ధన చేసినట్లయితే చుండ్రునుంచి శాశ్వత విముక్తి కలుగుతుంది. ఈ నూనెను కాళ్ల నొప్పులకు కూడా ఉపయోగించవచ్చు.

**మొక్కపేరు :** సిగర, తెల్ల దిరిసెన, చిన్న దిరిసెన



**శాస్త్రీయనామం :** అల్బిజియా అమార (ALBIZIA AMARA)

**కుటుంబం :** మైమోసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** అటవీ ప్రాంతాలలో, బంజరు భూములలో పెరుగుతుంది. కాయలు దిరిసెన చెట్టు కాయల మాదిరిగా ఉండి కొద్దిగా చిన్న పరిమాణంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, బెరడు

**తయారి/చికిత్సా విధానం :** వంద గ్రాముల ఆకులు, మూడు వందల గ్రాముల బెరడు పచ్చిగా ఉన్నప్పుడు తీసుకొని మెత్తగా నూరుకోవాలి. దీనికి రెండు చెంచాల నువ్వుల నూనె కలిపి లేపనంగా తయారు చేసుకొని వెంట్రుక కుదుళ్ళకు బాగా పట్టించాలి. అరగంట తరువాత ఆకులు, బెరడు వేసి మరిగించిన నీటితో తల స్నానం చేయాలి. ఇలా వారానికి రెండు మూడు సార్లు మూడు వారాలు చేసినట్లయితే చుండ్రు సమస్య తొలిగిపోయి వెంట్రుకలు ఒత్తుగా పెరుగుతాయి. మూడు సంవత్సరాలు పైబడిన వారినుండి ఎవరికైనా పై చికిత్స చేయవచ్చు.

## తలలో పేలు

**వ్యాధి లక్షణాలు :** తలలో పేలు ఉండటం స్త్రీలకు సాధారణమైన విషయం. ఇవి ఎక్కువగా ఉన్నప్పుడు చిన్నపిల్లలు, స్త్రీలు తలలో విపరీతమైన దురదతో బాధ పడుతుంటారు. పేలు రక్తాన్ని పీల్చటం వలన చిన్న పిల్లల్లో రక్తహీనత కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

**మొక్కపేరు :** సీతాఫలం



**శాస్త్రీయనామం :** అనోనా స్క్వామోసా (ANNONA SQUAMOSA)

**కుటుంబం :** అనోనేసి (ANNONACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది నీరు ఎక్కువగా దొరకని ప్రదేశాలలో కొండలు, గుట్టల వెంబడి పెరుగుతుంది. ఫలాల కోసం ఇండ్లల్లో కూడా పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు.

**తయారి/చికిత్సా విధానం :** 200 గ్రాముల సీతాఫలం విత్తనాలను బాగా మెత్తగా దంచి నువ్వుల నూనెలో ఉడకబెట్టి మూడు రోజుల పాటు తలకు రాసినట్లయితే పేలన్నీ గుడ్లతో సహా చనిపోతాయి. నూనె రాసిన గంట తరువాత స్నానం చేయాలి. తలపై గాయలు ఉన్నవారు ఉపయోగించకూడదు.

**మొక్కపేరు :** విషముష్టి, ముష్టి



**శాస్త్రీయనామం :** స్ట్రిక్నాస్ నక్స్–ఒమిక (STRYCHNOS NUX-VOMICA)

**కుటుంబం :** లొగానియేసి (LOGANIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అడవులలో పెరుగుతుంది. దీని విత్తనాలు చాలా విషపూరితం.

**ఉపయోగపడు భాగాలు :** పండ్ల గుజ్జు, విత్తనాలు.

**తయారి/చికిత్సా విధానం :** పండులోపల ఉన్న గుజ్జుని తల వెంట్రుకలకు బాగా పట్టించి ఒక అరగంట తరువాత భరించగల్గినంత వేడి నీటితో స్నానం చేసినట్లయితే పేల సమస్య మటుమాయమౌతుంది.

విత్తనాలను మెత్తగా నూరి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని (50 గ్రాములు) అర లీటరు కొబ్బరి నూనెలో కలిపి నెలకు ఒకసారి వాడినట్లయితే పేల సమస్య దూరం అవుతుంది. అయితే ఈ నూనె రాసిన అరగంట తరువాత తప్పకుండా తలస్నానం చేయాలి. విత్తనాలు చాల విషపూరితం కాబట్టి పది సంవత్సరాలలోపు పిల్లలకు, తలపై గాయాలు ఉన్నవాళ్ళకు ఉపయోగించకూడదు.

**మొక్కపేరు :** కలబంద, కలమంద



**శాస్త్రీయనామం :** అలో బార్బడెన్సిస్ (ALOE BARBEDENSIS)

**కుటుంబం :** లిలియేసి (LILIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో ముఖ్యంగా రాతినేలల్లో పెరుగుతుంది. నీటి ఎద్దడి బాగా తట్టుకోగల మొక్క. దీని పత్రాలలోపల నీరు జిగటు రూపంలో నిలువ ఉంటుంది. ఈ మొక్కను వివిధ రకాలైన సౌందర్య సాధనాల తయారీలో అధికంగా ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలలో జిగట రూపంలో ఉన్న నీటిని తీసుకొని తలకు బాగా పట్టించాలి. ఒక అరగంట తరువాత కోడిగుడ్డు సొనను కూడా బాగా పట్టించి తల స్నానం చేయాలి. ఈ విధంగా వారానికి రెండుసార్లు చేసినట్లయితే పేల సమస్య తగ్గిపోతుంది. దీనితో వెంట్రుకలు రాలటం కూడా ఆగిపోతుంది.

**మొక్కపేరు :** నల్ల ఉమ్మెత్త



**శాస్త్రీయనామం :** దతూర మెటెల్ (DATURA METEL)

**కుటుంబం :** సొలనేసి (SOLANACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. కాండ భాగాలు ముదురు నలుపు రంగులో ఉంటాయి. పూలు ఊదా రంగులో ఉంటాయి. దీని విత్తనాలు విషపూరితంగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** ఉమ్మెత్త ఆకులు, విత్తనాలు 200 గ్రాములు తీసుకొని నీడలో ఎండనివ్వాలి. తరువాత వాటిని మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడిని కొద్దిగా నువ్వుల నూనెలో కలిపి తలకు పట్టించినట్లయితే తలలో ఉన్న పేల సమస్య తగ్గిపోతుంది. పది సంవత్సరాలలోపు పిల్లలకు వాడకూడదు. గాయాలు ఉన్న వాళ్ళు కూడా ఉపయోగించకూడదు.

## పార్శ్వనొప్పి

**వ్యాధి లక్షణాలు :** తలలో ఒకవైపు వచ్చే విపరీతమైన నొప్పిని పార్శ్వనొప్పి అంటారు. కొంతమందికి కుడివైపు కానీ, మరికొంత మందికి ఎడమవైపు కానీ లేక మార్చి మార్చి కానీ వస్తుంది. తల వంచినప్పుడు బరువుగా అనిపిస్తూ నొప్పి తీవ్రత ఎక్కువ అవుతుంది.

**మొక్కపేరు :** తులసి



**శాస్త్రీయనామం :** ఆసిమం టెన్యుయిఫ్లోరమ్ (OCIMUM TENUIFLORUM)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్కను చాలా పవిత్రంగా భావిస్తారు. దీనిని ఇండ్లలోనూ, దేవాలయాలలోనూ పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు.

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు పచ్చి ఆకులను నీటిలో బాగా మరిగించి ఆవిరి పీల్చినట్లయితే పార్శ్వనొప్పి నుండి వెంటనే ఉపశమనం కలుగుతుంది. ఆకులను బాగా నలిపి రసం తీసి నొప్పి ఉన్న వైపు రాసి మర్ధన చేసినట్లయితే పార్శ్వనొప్పినుండి మంచి ఉపశమనం కలుగుతుంది.

**మొక్కపేరు :** పులిచేరు



**శాస్త్రీయనామం :** ఫిల్లాంథస్ రెటిక్యులేటస్ (PHYLLANTHUS RETICULATUS)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం:** బంజరు భూములు, అటవీ ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతుంది. తేమ ప్రదేశాలలో బాగా ఏపుగా పెరుగుతుంది. కాండ భాగాలతో బుట్టలు, తడికలు అల్లుతుంటారు. కాయలు నల్లగా ఉండి చిదిమినప్పుడు నీలి రంగు ద్రవం వస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క ఆకులను గుప్పెడు తీసుకొని మెత్తగా నూరుకోవాలి. దీని పార్శ్వనొప్పి ఉన్నవైపు పట్టులా వేయాలి. ఈ పట్టును ఒక గంట సేపు ఉంచినట్లయితే పార్శ్వనొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. త్వరిత ఉపశమనం కొరకు రెండు చుక్కల ఆకుల రసాన్ని పార్శ్వనొప్పి ఉన్న వైపు ముక్కు రంధ్రంలో వేసుకోవాలి.

**మొక్కపేరు :** బోడతరం



**శాస్త్రీయనామం :** స్ఫీరాంథస్ ఇండికస్ (SPHAERANTHUS INDICUS)

**కుటుంబం :** ఆస్టరేసి (ASTERACEAE)

**దొరుకు ప్రదేశం:** చలక భూములలో ఎక్కువగా పెరుగుతుంది. పుష్ప భాగాలు వంగ పండు రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** మొక్కను సమూలంగా తీసుకొని నీటితో శుభ్రం చేసి రసం పిండాలి. ఈ రసాన్ని రెండు నుంచి మూడు చుక్కలు పార్శ్వనొప్పి ఉన్న వైపు ముక్కు రంధ్రంలో వేసినట్లయితే వెంటనే పార్శ్వనొప్పి తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** నీలగిరి



**శాస్త్రీయనామం :** యూకలిప్టస్ గ్లోబ్యులస్ (EUCALYPTUS GLOBULUS)

**కుటుంబం :** మిర్టేసి (MYRTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్కను సాంఘిక వనాలలో పెంచుతున్నారు. కాగితం పరిశ్రమకోసం సాగు భూములలో కూడా పెంచుతున్నారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** 4-5 పచ్చిగా ఉన్న ఆకులను బాగా నలిపి వాసన పీల్చినట్లయితే పార్శ్వనొప్పి తగ్గుతుంది. పత్రాలను బాగా మరిగించి పసుపు వేసి ఆవిరిపట్టినట్లయితే నొప్పి మటుమాయమౌతుంది. ఎడమవైపున నొప్పి ఉన్నట్లయితే కుడివైపు నాసికా రంధ్రంతో ఆవిరి ఎక్కువగా పీల్చాలి. అలాగే కుడివైపు నొప్పి ఉన్నట్లయితే ఎడమ నాసికా రంధ్రంతో పీల్చాలి. తగ్గిపోయేంతవరకు ప్రతిరోజూ వాడాలి. రోజూ ఉదయం, సాయంత్రం ఒక మోతాదులోనే ఆవిరిని పీల్చాలి.

**మొక్కపేరు :** తుమ్మికూర, తుమ్మిపువ్వు, గండుతుమ్మి



**శాస్త్రీయనామం :** ల్యూకాస్ ఆస్పెరా (LEUCAS ASPERA)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది అన్ని ప్రాంతాల్లో, బంజరు భూముల్లో విరివిగా దొరుకుతుంది. దీని ఆకులను కూరగా కూడా వండుకొని తింటారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క ఆకులు పచ్చివి 50 గ్రాములు తీసుకొని రసం తీయాలి. ఈ రసాన్ని పార్శ్వనొప్పి ఉన్న వైపున రాసి బాగా మర్ధన చేయాలి. రెండు చుక్కల రసాన్ని పార్శ్వనొప్పి ఉన్నవైపు ముక్కు రంధ్రంలో వేసినట్లయితే ఇంకా త్వరగా పార్శ్వనొప్పి తగ్గిపోతుంది. ఉదయం, సాయంత్రం 2 రోజులు వాడాలి.

**పథ్యం :** చలువ చేసే పదార్థాలు రెండు రోజులు తినకూడదు.

# తలనొప్పి

**మొక్కపేరు :** ఆముదం



**శాస్త్రీయనామం :** రిసినస్ కమ్యూనిస్ (RICINUS COMMUNIS)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** దీనిని ఎక్కువగా చలక మెట్ట భూముల్లో సాగుచేస్తుంటారు. బంజరు భూములలో కూడా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** తలపైన కొద్దిగా వేడిచేసిన ఆముదం ఆకులను పెట్టి గుడ్డతో గట్టిగా కట్టినట్లయితే తలనొప్పి తగ్గిపోతుంది. విత్తనం లోపల ఉన్న పప్పు తీసుకొని కొద్దిగా నీరు చేర్చి మెత్తగా నూరుకోవాలి. ఈ ముద్దను రెండు కణతలపైన, నుదిటిపైన రాసినట్లయితే 5 నిమిషాలలో తలనొప్పి తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** కరక్కాయ చెట్టు



**శాస్త్రీయనామం :** టర్మినేలియ చబుల (TERMINALIA CHEBULA)

**కుటుంబం :** కంబ్రిటేసి (COMBRETACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అడవులలో దొరుకుతుంది. ఆయుర్వేదంలో ఈ మొక్క ఫలాన్ని త్రిఫలాలలో ఒకటిగా పిలుస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు

**తయారి/చికిత్సా విధానం :** బాగా ఎండిన కరక్కాయను తీసుకొని ఇసుకరాయిపై కొంచెం నీరు పోసి రుద్దితే గంధం వస్తుంది. దీనిని నుదుటిపై మందమైన పట్టులా వేస్తే తలనొప్పినుండి మంచి ఉపశమనం కలుగుతుంది.

**మొక్కపేరు :** దుండిగ, ఎర్రలంకాముదం, సీమనేపాలం, ఎరుపునేపాలం



**శాస్త్రీయనామం :** జట్రోప గాసిపిఫోలియ (JATROPA GOSSYPIFOLIA)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది బంజరు భూముల్లో పెరుగుతుంది. ఈ మొక్క విత్తనాల నుండి వచ్చే నూనెను బయోడీజిల్‌గా ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** మొక్కనుండి కారే ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** మొక్క కాండంపై గాటుపెట్టినా, పత్రాలను త్రుంచిన నీటివంటి ద్రవం వస్తుంది. దీనిని నుదుటిపై పలుచగా రాస్తే తలనొప్పినుంచి ఉపశమనం కలుగుతుంది. రసాన్ని నుదిటిపై రాసిన తరువాత తడి చేసిన బట్టను నుదిటిపై కప్పి ఉంచాలి. ఇలా ఒక పది నిమిషాలు ఉంచినట్లయితే తలనొప్పి తగ్గిపోతుంది. ఎక్కువసేపు చర్మానికి మందు ఉంచకూడదు.

# 1.2 కంటి సమస్యలు/వ్యాధులు

## కండ్ల కలకలు

**వ్యాధి లక్షణాలు :** ఇది ఎక్కువగా వైరస్ వలన వస్తుంది. కంటిలో వైరస్ చేరి కండ్లు ఎర్రగా వాచిపోయి పూసులు తోడుతుంటాయి. ఇది ఒకరినుండి మరొకరికి సులభంగా వ్యాపిస్తోంది. కండ్లు దురదగా ఉంటాయి.

**మొక్కపేరు :** రెడ్డివారి చనుబాల మొక్క, పాలాకు, పచ్చబొట్టుకూర



**శాస్త్రీయనామం :** యుఫర్బియ హిర్ట (EUPHORBIA HIRTA)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది అన్ని రకాల నేలల్లో పెరిగే చిన్నపాటి గుల్మము

**ఉపయోగపడు భాగాలు :** మొక్కనుంచి వచ్చే పాలవంటి ద్రవం

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క పాలు 3 చుక్కలు రెండు కళ్ళల్లో రెండు రోజులు ఉదయం పూట వేయాలి. పది నిమిషాల తరువాత శుభ్రమైన గోరువెచ్చని నీటితో కండ్లను శుభ్రపరచుకోవాలి.

**మొక్కపేరు :** పిచ్చి కుసుమ, బలరాకాసి



**శాస్త్రీయనామం :** ఆర్జిమోన్ మెక్సికాన (ARGEMONE MEXICANA)

**కుటుంబం :** పపావరేసి (PAPAVERACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది పొలాల గట్ల వెంబడి, బంజరు భూములలోనూ పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండంనుండి స్రవించే పాలవంటి ద్రవం.

**తయారీ/చికిత్సా విధానం :** ఈ మొక్క లేతకాండం తుంచినట్లయితే పసుపు రంగు పాలు వస్తాయి. ఈ పాలను మూడు చుక్కలు చొప్పున రెండు కండ్లలో రెండు రోజుల పాటు ఉదయం వేయాలి. పది నిమిషాల తరువాత పరిశుభ్రమైన గోరువెచ్చని నీటికి కొద్దిగా ఉప్పు చేర్చి కండ్లను శుభ్రంగా కడుగుకోవాలి. పిల్లలకు వాడేటప్పుడు గులాబీ నీళ్ళలో ఈ పాల చుక్కలు వేసి అటు తరువాత ఈ చుక్కలను కంటిలో వేయవలెను. రెండు చుక్కలకు మించి వాడకూడదు.

**మొక్కపేరు :** పొడపత్రి, పుట్టబధ్ర



**శాస్త్రీయనామం :** జిమ్నెమా సిల్వెస్టర్ (GYMNEMA SYLVESTRE)

**కుటుంబం :** అస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది ఆంధ్రప్రదేశ్ అంతటా పెరిగే తీగ జాతి మొక్క

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చి ఆకుల రసం తీసి కంటిలో రెండు చుక్కలు వేయాలి. ఇలా రెండురోజులు వేసినట్లయితే కండ్లకలక ఇట్టే తగ్గిపోతుంది. పిల్లలకు ఒక చుక్క చొప్పున తగ్గిపోయేవరకువాడాలి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ఇది ఎక్కువగా వైరస్‌వలన వచ్చే అంటువ్యాధి కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన నీటిలో ఒక చెంచా ఉప్పు వేసి ప్రతి రోజూ ఉదయం కండ్లను శుభ్రపరచుకోవాలి. ఈ వ్యాధి సోకిన వారికి దూరంగా ఉంటూ శుభ్రమైన గుడ్డతో కండ్లను తుడుచుకుంటూ ఉండాలి. ఇలా చేసినట్లయితే ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చు.

## రేచీకటి

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి సోకిన వారికి చీకటి పడగానే కండ్లు కనిపించటం తగ్గిపోతుంది. ఇది ఎక్కువగా విటమిన్ 'ఏ' లోపం మూలంగా వస్తుంది. అశ్రద్ధ చేస్తే కంటి చూపు పూర్తిగా తగ్గిపోతుంది. క్రింద పేర్కొన్న మొక్కలు గిరిజన వైద్యంలో రేచీకటి చికిత్సలో ఉపయోగిస్తున్నారు.

**మొక్కపేరు :** కామాక్షి, కామంచి



**శాస్త్రీయనామం:** సొలానమ్ నైగ్రమ్ (SOLANUM NIGRUM)

**కుటుంబం :** సొలనేసి (SOLANACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క రోడ్ల వెంబడి, పొలం గట్ల వెంబడి పెరుగుతుంది. కాయలు ఆకుపచ్చ – ఎరుపు రంగులో ఉండి పండిన తరువాత నల్లగా, గుత్తులుగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, ఫలాలు

**తయారి/చికిత్సా విధానం :** కామంచి చెట్టు ఆకులను కూర వండుకుని తిన్నట్లయితే ప్రాథమిక దశలో రేచీకటి తగ్గిపోయి కండ్లు మంచిగా కనిపిస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు మూడు నుంచి నాలుగు నెలల పాటు తినాలి. ఫలాలు రోజుకు పది చొప్పున నెల రోజులపాటు తింటే మంచి గుణం కనిపిస్తుంది.

**పథ్యం :** మాంసం తినకూడదు.

**మొక్కపేరు :** సర్పగంధి



**శాస్త్రీయనామం :** రావుల్ఫియ సర్పెంటైన (RAUVOLFIA SERPENTINA)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది అన్ని అటవీ ప్రాంతాలలో విరివిగా లభ్యమవుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చి ఆకులను బాగా నలిపితే వచ్చే రసాన్ని రెండు చుక్కలు ఒక పూట రెండు కండ్లల్లో వేసినట్లయితే మసకలు పోయి చూపు బాగా కనిపిస్తుంది. 3 సెంటీమీటర్ల వేరు తీసుకొని అన్నంతోపాటుగా రోజు మార్చి రోజు 15 రోజులు తిన్నట్లయితే రేచీకటి పూర్తిగా తగ్గిపోతుంది. పిల్లలకు కడుపులోకి ఈ మందు ఇవ్వకూడదు.

**గమనిక :** అవసరాన్ని బట్టి మరొక పూటకూడా ఈ మందును కండ్లల్లో వాడవచ్చు.

**మొక్కపేరు :** చిల్ల గింజ, ఇడుప, ఇందుప



**శాస్త్రీయనామం:** స్ట్రిక్‌నాస్ పొటాటోరం (STRYCHNOS POTATORUM)

**కుటుంబం :** లొగానియేసి (LOGANIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఎక్కువగా అడవి ప్రాంతాలలో దొరుకుతుంది. దీని గింజలను నీటిని శుభ్రం చేయడానికి ఉపయోగిస్తారు

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** ఎండిన విత్తనాలను ఇసుకరాయి మీద అరగదీసినట్లయితే గంధం వస్తుంది. దీనికి రెండు చుక్కల తేనె కలిపి కాటుకలా పెట్టుకున్నట్లయితే ప్రాథమిక దశలో రేచీకటిని అరికట్టవచ్చు.

**జాగ్రత్తలు :** పది సంవత్సరాలలోపు పిల్లలకు ఈ చికిత్స చేయకూడదు.

**వ్యాధి నివారణ చర్యలు :** విటమిన్ 'ఎ' ఎక్కువగా ఉన్న కారెట్, బొప్పాయి, టమాట, పాలు వంటివి మరియు ఆకుకూరలు ఎక్కువగా తినటం మూలంగా వ్యాధి బారిన పడకుండా చూసుకోవచ్చు.

# 1.3 ముక్కుకి సంబంధించిన వ్యాధులు

## ముక్కునుండి రక్తం కారటం

**వ్యాధి లక్షణాలు:** శరీరంలో అధిక ఉష్ణం ఉన్న సమయంలో ముఖ్యంగా వేసవిలో అప్పుడప్పుడు ముక్కునుండి రక్తం కారుతుంది. ఎప్పుడైనా ముక్కుపై దెబ్బ తగిలినా రక్తం వస్తుంది. తక్షణ ఉపశమనం కోసం ఈ క్రింది మొక్కలను ఉపయోగిస్తారు.

**మొక్కపేరు:** ఉల్లి






(ALLIUM CEPA)

CEAE)

ప్రాంతాలలో పండిస్తూ ఉంటారు. రసభరితమైన
స్తారు.

రిత పత్రపీఠాలు

క్కునుండి ఎప్పుడైనా రక్తస్రావం కనిపించినట్లయితే
సి వాసన చూపితే రక్తస్రావం ఆగిపోతుంది.

కూడదు. మసాలా వంటకాలు పూర్తిగా తగ్గించాలి.

**మొక్కపేరు :** జిబిలికి, చీపురు పండ్ల చెట్టు



**శాస్త్రీయనామం :** గ్రివియ హిర్సుట (GREWIA HIRSUTA)

**కుటుంబం :** టిలియేసి (TILIACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. బంజరు భూములలో కూడా సాధారణంగా కనిపిస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ముక్కునుండి రక్తస్రావం అవుతున్నప్పుడు పచ్చిగా ఉన్న ఆకులను బాగా నలిపి వాసన చూస్తే రక్తస్రావం ఆగిపోతుంది.

**మొక్కపేరు :** దానిమ్మ



**శాస్త్రీయనామం :** ప్యునికా గ్రనేటమ్ (PUNICA GRANATUM)

**కుటుంబం :** ప్యునికేసి (PUNICACEAE)

**దొరుకు ప్రదేశం:** దీనిని ఎక్కువగా తోటల్లో, ఇంటి పెరటిలో పండ్ల కోసం పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ముక్కునుండి రక్తస్రావం అవుతున్నప్పుడు పచ్చిగా ఉన్న ఆకులను బాగా నలిపి వాసన చూసినట్లయితే రక్తస్రావం ఆగిపోతుంది.

**మొక్కపేరు :** తుమ్మికూర



**శాస్త్రీయనామం :** ల్యూకాస్ అస్పెర (LEUCAS ASPERA)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం :** చవుడు, బంజరు భూములు, నల్ల రేగడి నేలల్లో ఎక్కువగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలు బాగా నలిపగా వచ్చిన రసాన్ని రక్తం కారే ముక్కు రంధ్రంలోనికి రెండు మూడు చుక్కలు వేసినట్లయితే వెంటనే రక్తస్రావం ఆగిపోతుంది.

## వాసన కోల్పోవటం

**వ్యాధి లక్షణాలు :** మనలో చాలా మంది ఘాటైన వాసనలు తప్ప మామూలు వాసనలు గ్రహించలేరు. ముక్కులోపల నాడులు దెబ్బతినటం, మాంసం ముద్దలు పెరగటం వలన కూడా నాసన గ్రహించే శక్తి కోల్పోతారు.

**మొక్కపేరు :** బూసి, పుస్కి



**శాస్త్రీయనామం :** స్లైఖిర ఓలియోస (SCHLEICHERA OLEOSA)

**కుటుంబం :** సాపిండేసి (SAPINDACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. లేత పత్రాలు ఎరుపు రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు.

**తయారి/చికిత్సా విధానం :** 200 గ్రాముల చెట్టు బెరడు తీసుకొని మెత్తగా దంచి అర లీటరు నీటిలో వేసి బాగా వేడి చేయాలి. ఆవిర్లు వస్తునప్పుడు ఒక నాసికా రంధ్రాన్ని మూసి మరొక నాసికారంధ్రంతో ఆవిరి పీల్చి వదిలి వేయాలి. ఈ విధంగా మార్చి మార్చి చేసినట్లయితే పోయిన వాసన గ్రహించే శక్తి తిరిగి వస్తుంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక వారం రోజులు చేసినట్లయితే ఫలితం మంచిగా ఉంటుంది.

**గమనిక :** ఆవిరిని తగు మోతాదులో లోనికి పీల్చవలెను. లేని ఎడల శ్వాసకు ఇబ్బంది కలుగును. ఆవిరి కండ్లకు తగలకూడదు.

**మొక్కపేరు :** మొక్కెం



**శాస్త్రీయనామం :** ష్రెబెర స్వెటినాయిడిస్ (SCHREBERA SWETENIOIDES)

**కుటుంబం :** ఓలియేసి (OLEACEAE)

**దొరుకు ప్రదేశం:** ఇది అడవులలో ఎక్కువగా పెరుగుతుంది. తూర్పు గోదావరి జిల్లా, నల్లమల ప్రాంతాలలో ఎక్కువగా లభ్యమవుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పువ్వులు

**తయారి/చికిత్సా విధానం :** ఒక గుప్పెడు పువ్వులను వారం రోజులపాటు రోజుకు ఐదు నిమిషాలు వాసన చూసినట్లయితే పోయిన ఘ్రాణ శక్తి తిరిగి వస్తుంది. సూక్ష్మమైన వాసనలు కూడా గ్రహించగల శక్తి ముక్కుకు వస్తుంది.

## జలుబు

వ్యాధి లక్షణాలు : ఇది ఎక్కువగా వైరస్‌వలన వస్తుంది. తుమ్మినప్పుడు, చీదినప్పుడు ఒకరినుండి మరొకరికి వ్యాపిస్తుంది. ముక్కునుండి నీరు లేక పచ్చటి ద్రవం కారుతుంటుంది. తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కూడా ఉంటాయి.

మొక్కపేరు : బండారు



శాస్త్రీయనామం : అడీనా కార్డిఫోలియ (ADINA CORDIFOLIA)

కుటుంబం : రూబియేసి (RUBIACEAE)

దొరుకు ప్రదేశం : ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. దీని పత్రాలు పెద్దవిగా హృదయాకారంలో ఉంటాయి.

ఉపయోగపడు భాగాలు : చెట్టు బెరడు.

తయారి/చికిత్సా విధానం : 200 గ్రాముల చెట్టు బెరడు పచ్చిది తీసుకొని ఒక లీటరు నీటిలో వేసి బాగా వేడిచేయాలి. ఆవిరి బాగా వస్తున్నప్పుడు ఈ ఆవిరిని ముక్కుతో బాగా పీల్చినట్లయితే వెంటనే జలుబు, తలనొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది.

గమనిక : కండ్లకు ఆవిరి తగలనీయకూడదు.

**మొక్కపేరు :** మారేడు, బిల్వం



**శాస్త్రీయనామం :** ఏగిల్ మార్మిలాస్ (AEGLE MARMELOS)

**కుటుంబం :** రూటేసి (RUTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అడవులోనూ, దేవాలయాలలోనూ పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు వేర్లను, పత్రాలను బాగా దంచి ఒక లీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. నిండా దుప్పటి కప్పుకొని ఈ ఆవిరిని బాగా పీల్చినట్లయితే జలుబు, తలనొప్పి త్వరగా తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** కారునిమ్మ, అడవినిమ్మ, ఎఱ్ఱమునుకుడు



**శాస్త్రీయనామం :** అటలాంటియా మోనోఫిల్లా (ATALANTIA MONOPHYLLA)

**కుటుంబం :** రూటేసి (RUTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు, కాయలు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు పువ్వులు, 5 వరకు పచ్చి కాయలు రసం తీసుకొని ఒక లీటరు నీటిలో వేసి బాగా మరిగించి వచ్చిన ఆవిరిని పీల్చినట్లయితే జలుబు నుండి త్వరిత విముక్తి కల్గుతుంది.

**మొక్కపేరు :** బలుసు, బలిసి



**శాస్త్రీయనామం :** కాంథియం పర్విఫ్లోరమ్ (CANTHIUM PARVIFLORUM)

**కుటుంబం :** రూబియేసి (RUBIACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని రకాల అడవులలో, బీడు మరియు బంజరు భూములలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాయలు

**తయారి/చికిత్సా విధానం :** జలుబు చేసి ముక్కునుండి ద్రవాలు ఎక్కువగా కారుతున్నప్పుడు పండిన కాయలను 3-4 తిన్నట్లయితే జలుబు త్వరగా తగ్గిపోతుంది. రోజులో ఒకసారి ఉదయం కానీ సాయంత్రం కానీ తినవచ్చు.

**మొక్కపేరు :** గేసరి, తొర్రివెలగ, వెయ్యి కండ్ల ఆకు



**శాస్త్రీయనామం :** హెస్పరతూజ క్రెన్యులేట (HESPERETHUSA CRENULATA)

**కుటుంబం :** రూటేసి (RUTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. దీని పత్రాలు అతుకులు అతుకులుగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** జలుబు, తలనొప్పి ఉన్నప్పుడు కొన్ని ఆకులను చేతితో బాగా నలిపి వాసన చూసినట్లయితే ముక్కు కారటం తగ్గిపోయి తలనొప్పినుండి ఉపశమనం కలుగుతుంది. ముక్కుదిబ్బడకు కూడా ఈ పత్రాలు మంచిగా పనిచేస్తాయి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** జలుబు ఎక్కువగా వర్షాకాలంలోనూ, శీతాకాలంలోనూ, చల్లటి వాతావరణం ఉన్నప్పుడు ఒకరినుండి మరొకరికి సులభంగా వ్యాపించే వైరస్ వ్యాధి. ఈ వ్యాధి సోకిన వారు దగ్గినప్పుడు చేతి రుమాలు అడ్డుపెట్టుకోవటం వల్ల ఇతరులకు ఈ వ్యాధి వ్యాపించకుండా నివారించవచ్చు. ఈ వ్యాధి సోకిన వారికి దూరంగా ఉండటం నోటికి, ముక్కుకు రుమాలు అడ్డుపెట్టుకోవటం, వేడి నీటితో స్నానం చేయటం వల్ల వర్షాకాలం, శీతాకాలాలలో ఈ జలుబు రాకుండా చూసుకోవచ్చు.

# 1.4 చెవికి సంబంధించిన వ్యాధులు

## చెవి పోటు

**వ్యాధి లక్షణాలు :** చెవిలోని కర్ణభేరి ప్రాంతంలో విపరీతమైన నొప్పి ఉంటుంది. తల తిరుగుతున్నట్లుగా కూడా ఉంటుంది. ఈ నొప్పి ఆగి ఆగి వస్తుంది.

**మొక్కపేరు :** జ్యోతిష్మతి, కొండపల్లేరు



**శాస్త్రీయనామం :** సెలాస్ట్రస్ పానిక్యులేట (SELASTRUS PANICULATA)

**కుటుంబం :** సెలాస్ట్రేసి (CELASTRACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవి, బంజరు భూములలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** ఒక సెంటిమీటరు పచ్చి వేరు తీసుకొని మెత్తగా దంచాలి. దీనిని 200 మి.లీ. కొబ్బరి నూనెలో కలిపి కొంచెం వేడి చేయాలి. తరువాత ఈ నూనెను రెండు చుక్కలు నొప్పి ఉన్న చెవిలో వేసినట్లయితే బాధనుండి విముక్తి కలుగుతుంది. రెండు నుంచి మూడు రోజులు వాడినాకూడా చెవిపోటు తగ్గకపోతే డాక్టరుని సంప్రదించాలి.

**మొక్కపేరు :** తెల్ల చంబ, తందు, తమ్మ, అడవి తెల్లకారు చంబ



**శాస్త్రీయనామం :** కనవాలియ వైరోజ (CANVALIA VIROSA)

**కుటుంబం :** ఫాబేసి (FABACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ తీగ మొక్క ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. మరొక రకాన్ని కూరల కోసం ఇండ్లల్లో పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు.

**తయారి/చికిత్సా విధానం :** ఎండిన విత్తనాలను మెత్తగా పొడిచేయాలి. రెండు చెంచాల పొడిలో తగినంత ఆముదం కలిపి చెవితమ్మె చుట్టూ పట్టుగా వేయాలి. ఆముదాన్ని గోరువెచ్చగా చేసి రెండు చుక్కలు నొప్పి ఉన్న చెవిలో వేయాలి. రాత్రిపూట పట్టు వేసి ప్రొద్దున శుభ్రమైన నీటితో కడిగివేయాలి.

**మొక్కపేరు :** ఆదొండ, అడవి ఆదొండ



**శాస్త్రీయనామం :** కపారిస్ జైలానిక (CAPPARIS ZEYLANICA)

**కుటుంబం :** కపారిడేసి (CAPPARIDACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలోను డొంకలలోను తీగలా పెరిగే మొక్క, కాండంపై చిన్న చిన్న ముండ్లు ఉంటాయి. కాయలను చట్నీ తయారీలో ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలను గుప్పెడు తీసుకొని తగినంత నీటిని చేర్చి మెత్తగా నూరి నొప్పి ఉన్న చెవి చుట్టూ పట్టుగా వేసినట్లయితే నొప్పి తగ్గిపోతుంది. రాత్రిపూట వేసి ప్రొద్దున కడిగివేయాలి.

**మొక్కపేరు :** నల్లతీగ, పాలతీగ



**శాస్త్రీయనామం :** ఇక్నొకార్పస్ ఫ్రుటిసెన్స్ (ICHNOCARPUS FRUTESCENS)

**కుటుంబం :** అపొసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని అడవులలో పెరుగుతుంది. పత్రాలు తుంచితే పాలు వస్తాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు తుంచినప్పుడు వెలువడే పాలవంటి ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** మొక్కనుండి వచ్చే పాలవంటి ద్రవాన్ని కొంచెం తీసుకొని నొప్పి ఉన్న చెవి వెనుక భాగంలో రాయాలి. 5 లేక 6 చుక్కలు ఒక గ్లాసు గోరు వెచ్చని వేడి నీటిలో కలిపి చెవి లోపల పోసి శుభ్రం చేసినా కూడా చెవి నొప్పి తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** దిష్టితీగ, జుట్టుపాకు, దుష్టపుతీగ



**శాస్త్రీయనామం :** పెర్గ్యులేరియ డేమియ (PERGULARIA DAEMIA)

**కుటుంబం :** అస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు బీడు భూములలో ఎక్కువగా పెరిగే తీగ మొక్క. ఆకులు హృదయాకారంలో ఉండి, పూలు తెల్లగా గుత్తులు గుత్తులుగా పూస్తాయి. కాయలు సన్నగా పొడవుగా ఉండి ముండ్లను కల్గి ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, పాలవంటి ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** ఆకులను తెంచినప్పుడు కారే పాలను దీని ఆకుపై రాసి ఆ ఆకుని చుట్టలా చుట్టి చెవిలో కొద్దిసేపు సుమారుగా 3-4 నిమిషాలు పెట్టుకోవాలి. వెంటనే చెవినొప్పి తగ్గి పోతుంది. చెవిలో పెట్టేముందు ఈ ఆకులను ఉప్పువేసిన గోరు వెచ్చని నీటితో బాగా శుభ్రపరచాలి.

**మొక్కపేరు :** కుక్క పొగాకు



**శాస్త్రీయనామం :** బ్లూమియా ఎరియాంత (BLUMEA ERIANTHA)

**కుటుంబం :** ఆస్టరేసి (ASTARACEAE)

**దొరుకు ప్రదేశం :** పొలాల గట్ల వెంబడి, బంజరు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. ఆకులు ఘాటైన వాసన కలిగి ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చి ఆకులను గుప్పెడు తీసుకొని ఉప్పు కలిపిన నీటిలో గంట సేపు ఉంచాలి. తరువాత ఆ ఆకులను కొద్ది ఆముదములో బాగా ఉడికించి వడపోయాలి. ఈ ఆముదాన్ని 2 లేక 3 చుక్కలు చెవిలో వేసినచో చెవిపోటు తగ్గిపోతుంది. చెవి లోపల ఉన్న క్రిములు కూడా చనిపోతాయి.

**గమనిక :** చిన్న పిల్లలకు కేవలము 2 చుక్కలు మాత్రమే వేయాలి.

# చెవినుండి చీముకారుట

**వ్యాధి లక్షణాలు :** చెవిలో ఏదైనా గుచ్చుకున్నప్పుడు కాని, లేక సరైన శుభ్రత లేకపోవటం వల్ల బాక్టీరియా, ఫంగస్ చేరి చీము కారుతుంటుంది. కొన్నిసార్లు ముక్కు సమస్యల వల్ల కూడా చెవిలో చీముకారుతుంది. చెవి నుండి కారే చీము తగ్గటానికి ఈ క్రింద పేర్కొన్న మొక్కలు ఉపయోగిస్తారు.

**మొక్కపేరు :** మంచి తులసి



**శాస్త్రీయనామం :** ఆసిమం టెన్యుయిఫ్లోరం (OCIMUM TENUIFLORUM)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం :** దీనిని ఇండ్లలోనూ, దేవాలయాలలోనూ పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు తులసి ఆకులను తగినన్ని గోరువెచ్చని నీటిలో వేసి తరువాత బాగా నలిపి రసం తీయాలి. ఈ రసాన్ని 3-4 చుక్కలు చెవిలో వేసినట్లయితే చీము కారటం తగ్గిపోతుంది. ఈ విధంగా ప్రతిరోజూ రెండు పూటలు ఒక వారంపాటు చేయవలసి ఉంటుంది.

**మొక్కపేరు :** కుక్క తులసి, భూ తులసి



**శాస్త్రీయనామం :** ఆసిమం కానం (OCIMUM CANUM)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా బంజరు భూములలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** ఎండిన విత్తనాలను దోరగా వేయించి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో పత్రాలు పిండగా వచ్చిన రసం తగినంత కలిపి నాలుగు గంటలు ఉంచాలి. తరువాత ఈ రసం వడపోసి చెవిలో రెండు చుక్కలు వేస్తే చీము కారటం తగ్గిపోతుంది. ఇలా రెండు మూడు రోజులు వాడాలి.

**వ్యాధి నివారణ చర్యలు :** చెవిలో పెన్నులు, పెన్సిల్లు, ఏదైనా వస్తువులు పెట్టి గుబిలి తీయకూడదు. చెవులను ప్రతి రోజూ నీటితో కడుగుకుంటూ శుభ్రం చేసుకున్నట్లయితే ఎటువంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.

**మొక్కపేరు :** దిరిశెన చెట్టు



**శాస్త్రీయనామం :** అల్బిజియ లెబెక్ (ALBIZIA LEBBECK)

**కుటుంబం :** మైమొసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్ అంతటా అన్ని నేలల్లో, అడవులలో పెరుగుతుంది. దారి ప్రక్కల నీడకోసం పెంచుతారు. ఇది చాలా పెద్దవృక్షం.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** దిరిశెన చెట్టు ఆకులు గుప్పెడు తీసుకొని కషాయం చేసి చెవిలోపోసి శుభ్రంచేస్తే నొప్పితగ్గి చీము కారటం తగ్గిపోతుంది. ఇలా తగ్గేంతవరకు చేయవలసి ఉంటుంది.

# 1.5 పంటికి సంబంధించిన వ్యాధులు

## పంటినొప్పి, పిప్పిపళ్ళు

**వ్యాధి లక్షణాలు :** పన్నులోపల క్రిములు చేరి పంటి లోపల ఉన్న దవ్వ ప్రాంతాన్ని తినివేయటం మూలంగా పిప్పి పళ్ళు ఏర్పడతాయి. కొన్నిసార్లు పండ్లు బాగా అరిగిపోయి నాడులు బయటకు కనిపించే సమయంలో కూడా పన్నుపోటు అధికంగా ఉంటుంది. అతి చల్లటి, వేడి వస్తువులు తీసుకొన్నప్పుడు పంటి బాధ అధికం అవుతుంది. పంటినొప్పి, పిప్పిపళ్ళు సమస్యకు ఈ క్రింద పేర్కొన్న మొక్కలు బాగా ఉపయోగపడతాయి.

**మొక్కపేరు :** ఉత్తరేణి



**శాస్త్రీయనామం :** అఖిరాంధస్ ఆస్పెర (ACHYRANTHUS ASPERA)

**కుటుంబం :** అఖిరాంథేసి (ACHYRANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులు, బంజరు భూములు, సాగుభూములలో ఎక్కువగా పెరుగు తుంది. వీటి ఫలాలు ముండ్లను కలిగి ఉండి వస్త్రాలకు అంటుకునే స్వభావం ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం, వేరు

**తయారీ/చికిత్సా విధానం :** పంటినొప్పి ఉన్నవారు ఉదయాన్నే ఉత్తరేణి మొక్క కాండంతో పండ్లు తోముకున్నట్లయితే పంటినొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది.

ఉత్తరేణి వేరు 2 సెంటీమీటరు తీసుకొని బాగా నమిలినట్లయితే పంటిలోపల చేరిన క్రిములు చనిపోయి పిప్పిపళ్ళ బాధ తొలిగిపోతుంది.

**మొక్కపేరు :** పిండికూర, తెలగపిండి, కొండపిండి.



**శాస్త్రీయనామం :** ఎర్వా లానేట (AERVA LANATA)

**కుటుంబం :** అమరాంథేసి (AMARANTHACEAE)

**దొరుకు ప్రదేశం:** సాగు భూములు, అటవీ భూములలో ఇది ఎక్కువగా పెరుగుతుంది. సంక్రాంతి పండుగకు గొబ్బెమ్మలు తయారు చేసి ఈ మొక్కను వాటిలో ఉంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** వేరు

**తయారి/చికిత్సా విధానం :** రెండు సెంటిమీటర్ల వేరు తీసుకొని ఉప్పునీటిలో గంటసేపు నాన బెట్టాలి. తరువాత ఆ వేరుని బాగా నమిలి అదే నీటితో పుక్కలించి ఉమ్మేయాలి.

ఈ విధంగా ప్రతిరోజు ఉదయం రెండువారాల పాటు చేసినట్లయితే పంటినొప్పి, పిప్పిపళ్ళు సమస్యపోయి పంటికి బాగా దృఢత్వం వస్తుంది.

**మొక్కపేరు :** అంబటికూర, అటిక మామిడి



**శాస్త్రీయనామం :** బోయర్‌హావియ డిఫ్యూజ (BOERHAVIA DIFFUSA)

**కుటుంబం :** నిక్టాజినేసి (NYCTAGINACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు భూములు, సాగుభూములు, రోడ్లవెంట పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేరు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క వేరు 5 సెంటీమీటర్లు తీసుకొని కొంచెం ఉప్పు చేర్చి దంచాలి. ఈ మిశ్రమాన్ని అర లీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. తరువాత ఈ నీటితో బాగా పుక్కిలించినట్లయితే పండ్ల మధ్య ఉన్న క్రిములు చనిపోయి దంతక్షయం బారినుండి రక్షణ పొందవచ్చు.

**మొక్కపేరు :** కారు ఉలవకాడ



**శాస్త్రీయనామం :** క్లిటోరియ టర్నేషియ (CLITORIA TERNATEA)

**కుటుంబం :** ఫాబేసి (FABACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులు, బంజరు భూములు, ఉద్యానవనాలలో పెరుగుతుంది. పుష్పాలు శంఖంవలె ఉండి తెలుపు లేదా నీలం రంగులో ఉంటాయి. కాయలు చిక్కుడు కాయలు మాదిరిగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు.

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు పుష్పాలు తీసుకొని తగినన్ని వేడి నీటిలో మరిగించి ఆ నీటిని పుక్కిలించినచో పంటిబాధ తొలిగిపోతుంది. ఇలా రెండు మూడు రోజులు ఉదయం సాయంత్రం పూట పుక్కలించాలి.

**మొక్కపేరు :** వేప



**శాస్త్రీయనామం :** అజాడిరక్ట ఇండిక (AZADIRACHTA INDICA)

**కుటుంబం :** మీలియేసి (MELIACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. క్రిమి కీటకాలను నాశనం చేయుటలో వేపకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. వేప చెట్టులోని అన్ని భాగాలు కూడా క్రిమి సంహారంలో ఉపయోగపడుతాయి.

**ఉపయోగపడు భాగాలు :** కొమ్మ భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** చిన్న చిన్న వేప పుల్లలతో ఉదయాన్నే కొన్ని రోజులు దంతధావన చేసుకున్నట్లయితే పంటి సమస్యలు అన్నీ దూరం అవుతాయి.

**మొక్కపేరు :** ఆడమొర్న్రిక, చేకొండి, ఉత్తరాశి చెట్టు



**శాస్త్రీయనామం :** కడబ ఫ్రూటికోజ (CADABA FRUTICOSA)

**కుటుంబం :** కప్పారిడేసి (CAPPARIDACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, బంజరు భూములు మరియు అటవి ప్రాంతాలలో పెరుగుతుంది. కాయలు పండి పగిలినప్పుడు లోపల విత్తనాలు కాషాయరంగులో కనిపిస్తుంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** విత్తనాలను బాగా ఎండించి పొడి చేసుకోవాలి. ఒక చెంచా పొడిని ప్రతిరోజూ కొద్దిగా ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటిలో కలిపి పుక్కిలించాలి. ఇలా వారంరోజులు చేసినట్లయితే పిప్పి పళ్ళు, చిగుళ్ళ వెంట రక్తం కారటం వంటి సమస్యలు తగ్గిపోతాయి.

**మొక్కపేరు :** తంగేడు



**శాస్త్రీయనామం :** కేసియ ఆరిక్యులేట (CASSIA AURICULATA)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, బంజరు భూములు మరియు అటవి ప్రాంతాలలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం, పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** తంగేడు పుల్లను ఉప్పు నీటిలో అరగంట సేపు ఉంచి దానితో పళ్ళు తోముకున్నట్లయితే పిప్పి పళ్ళ సమస్య తొలిగిపోతుంది. పంటిపై ఉన్న గార కూడా వదిలిపోతుంది.

పుష్పాలను మెత్తగా నూరి చిగుళ్ళపై పట్టులా వేసినట్లయితే రక్తం కారటం, చిగుళ్ళ వాపులు తగ్గిపోతాయి.

**మొక్కపేరు :** నల్లతుమ్మ





**శాస్త్రీయనామం :** అకేసియ నిలోటిక (ACACIA NILOTICA)

**కుటుంబం :** మైమొసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**మొక్కపేరు :** మర్రి





**శాస్త్రీయనామం :** ఫైకస్ బెంగాలెన్సిస్ (FICUS BENGHALENSIS)

**కుటుంబం :** మోరేసి (MORACEAE)

**దొరుకు ప్రదేశం :** దీనిని నీడ కోసం రోడ్లకు ఇరువైపులా పెంచుతుంటారు

**ఉపయోగపడు భాగాలు :** ఊడ వేర్లు

**మొక్కపేరు :** జామ



**శాస్త్రీయనామం :** సిడియం గుజావ (PSIDIUM GUGAVA)

**కుటుంబం :** మిర్టేసి (MYRTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఫలాల కోసం ఇండ్లలోను, తోటలలోను పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న నల్లతుమ్మ చెక్క బెరడు, మర్రి ఊడవేర్లు చిగుర్లు, జామ ఆకులు తీసుకొని మెత్తగా దంచి ఎండించాలి. ఎండిన తరువాత చూర్ణం చేసి ఆ చూర్ణంతో దంత దావనం చేసినట్లయితే పంటి సమస్యలు దూరం అవుతాయి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** సరైన విధంగా దంతధావన చేసుకోక పోవటం, తీపి పదార్థాలు, మాంసం తిన్న తరువాత నోటిని శుభ్రంగా కడుగుకోక పోవడం వల్ల పంటి సమస్యలు ఏర్పడతాయి. కనుక రోజూ ఉదయం, రాత్రి నిద్రపోయే ముందు దంతధావన చేసుకోవాలి. తీపి, మాంసం పదార్థాలు తిన్న వెంటనే ఉప్పు కలిపిన నీటితో పుక్కిలించి వేయాలి. దీనివల్ల పంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు.

# 1.6 నోటికి సంబంధించిన వ్యాధులు

## నోటి దుర్వాసన

**వ్యాధి లక్షణాలు :** సరైన విధంగా దంతధావన చేసుకోకపోవటం, తీపి, మాంసం పదార్థాలు తిన్నవెంటనే నోటిని శుభ్ర పరచుకోకపోవటం, పొగత్రాగటం, గుట్కాలు తినటం, కిళ్ళీలు ఎక్కువగా నమలటం వలన నోటిలో క్రిములు అధికంగా చేరి నోరు దుర్వాసన వస్తుంది. క్రింద పేర్కొన్న మొక్కలతో నోటి దుర్వాసన దూరం చేసుకోవచ్చు.

**మొక్కపేరు :** పచ్చ చామంతి, బొడిమె చామంతి.



**శాస్త్రీయనామం :** స్పైలాంథస్ ఎక్మెల్ల (SPILANTHES ACMELLA)

**కుటుంబం :** ఆస్టరేసి (ASTERACEAE)

**దొరుకు ప్రదేశం :** చవుడు నేలలు, బీడు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. పుష్పాలు పసుపుపచ్చ రంగులో చిన్నగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క లేత పుష్పాలు రెండు మూడు తీసుకొని బాగా నమిలి మింగాలి. నములుతున్నప్పుడు నోరంతా తిమ్మిరిగా ఉంటుంది. తిమ్మిరి ఐదు పది నిమిషాలలో తగ్గిపోతుంది. ఈ విధంగా ఒక వారం రోజులు రోజుకు ఒకసారి చేసినట్లయితే నోటి దుర్వాసన దూరం అవుతుంది.

# నోటి పుండ్లు

**వ్యాధి లక్షణాలు :** శరీరంలో అధిక ఉష్ణం ఉన్నప్పుడు కానీ, జ్వర తీవ్రత అధికంగా ఉన్నప్పుడు కానీ నోటిలోపల తెల్లటి పొక్కులు వస్తాయి. ఏది తినాలన్నా విపరీతమైన మంట వస్తుంది. దవడ క్రింద లింఫ్ గ్రంధులు వాచిపోయి నొప్పిగా ఉంటాయి. ఈ క్రింది మొక్కలతో నోటి పొక్కులను త్వరగా మానిపోయేలా చేయవచ్చు.

**మొక్కపేరు :** ఎర్రబేను తీగ, సురటి చెక్క, సురుగుడు తీగ, ఎర్ర తీగ



**శాస్త్రీయనామం :** వెంటిలాగో కాలిక్యులేట (VENTILAGO CALYCULATA)

**కుటుంబం :** రామ్నేసి (RHAMNACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. తూర్పు గోదావరి, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలలో దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు పత్రాలు తీసుకొని అవసరమైనంత ఉప్పువేసి బాగా దంచి గ్లాసు నీటిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని పుక్కిలించినట్లయితే వెంటనే నోటి పొక్కుల బాధనుండి ఉపశమనం కలుగుతుంది. ఇలా రెండురోజులు చేసినట్లయితే పొక్కులు వెంటనే మానిపోతాయి.

**మొక్కపేరు :** రేగు, రేని, రేగి



**శాస్త్రీయనామం :** జిజిఫస్ మారిషానా (ZIZYPHUS MAURITIANA)

**కుటుంబం :** రామ్నేసి (RHAMNACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులు, బంజరు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. దీని పుష్పాలు తియ్యగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు.

**తయారి/చికిత్సా విధానం :** 150 గ్రాముల చెట్టు బెరడు మెత్తగా దంచి రాత్రంతా పావు లీటరు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటికి తగినంత ఉప్పు కలిపి పుక్కిలించినట్లయితే నోటి పొక్కులు రెండు రోజుల్లో తగ్గిపోతాయి.

**మొక్కపేరు :** పెద్ద బర్నిక



**శాస్త్రీయనామం :** లానియ కోరమండలిక (LANNEA COROMANDELICA)

**కుటుంబం :** అనకార్డియేసి (ANACARDIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. లేత ఆకులను అన్నంతోపాటు తింటారు.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** కొద్దిగా చెట్టు బెరడు తీసుకొని పది నిమిషాలు నీటిలో నానబెట్టి ఆ ముక్కని నోటిలో ఐదు నిమిషాలు ఉంచు కొన్నట్లయితే నోటి పొక్కులు తగ్గిపోతాయి. నోటి పొక్కులు తగ్గేవరకు రోజుకు ఒక సారి వాడాలి.

# 1.7 శ్వాసకోశ సంబంధిత వ్యాధులు

## ఉబ్బసం

**వ్యాధి లక్షణాలు :** ఇది శ్వాసకోశ సంబంధమైన వ్యాధి. ఇది ఎక్కువగా ఉన్నప్పుడు రోగి శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బంది పడతాడు. విపరీతమైన దగ్గు. దగ్గుతున్నప్పుడు కొన్నిసార్లు శ్వాసించటం కూడా కష్టమౌతుంది.

**మొక్కపేరు :** అడ్డసరం



**శాస్త్రీయనామం :** జస్టిసియ అడతొడ (JUSTICIA ADHATODA)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో దొరికే చిన్న పొద

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** అడ్డసరం ఆకులు మొదటి రోజు ఎండలో ఆ తరువాత నీడలో ఎండబెట్టి, దంచి చూర్ణం చేసి పెట్టుకోవాలి. అర చెంచా చూర్ణానికి చెంచా తేనె కలిపి 40 రోజుల పాటు ఉదయాన్నే పరగడుపున తీసుకున్నట్లయితే ఉబ్బస వ్యాధి నయం అవుతుంది.

**మొక్కపేరు :** పరిమి చెట్టు



**శాస్త్రీయనామం :** జిజిపస్ ఈనొప్లియ (ZIZYPHUS OENOPLIA)

**కుటుంబం :** రామ్నేసి (RHAMNACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది సాధారణంగా డొంకల వెంబడి, బంజరు భూములలో పెరిగే మొక్క.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు.

**తయారి/చికిత్సా విధానం :** ఈ చెట్టు బెరడు ఎండించి చూర్ణం చేసుకోవాలి. ప్రతిరోజు ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో వరుసగా రెండు పూటలు చొప్పున 40 రోజులు వాడాలి. ఉబ్బసం వ్యాధి అధికంగా ఉన్నవారు రెండు చెంచాల వరకు చూర్ణాన్ని ఉపయోగించవచ్చు.

**పథ్యం :** పులుపు తగ్గించి ఆహారం సేవించవలెను. దుంప కూరలు తినకూడదు.

**మొక్కపేరు :** మారేడు



**శాస్త్రీయనామం :** ఏగిల్ మార్మిలాస్ (AEGLE MARMELOS)

**కుటుంబం :** రూటేసి (RUTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో పెరుగుతుంది. దీనిని ఎక్కువగా ఆలయాల్లో పెంచుతుంటారు. శివపూజలో ఎక్కువగా ఈ మొక్క పత్రాలను ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** ఆవసరమున్నన్ని మారేడు ఆకులను నీడలో ఎండబెట్టి చూర్ణం చేసి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చూర్ణాన్ని ఒక చెంచా తేనెలో కలిపి తీసుకోవాలి. ఈ విధంగా ఒక నెలరోజులు వాడినట్లయితే ఉబ్బస వ్యాధినుండి ఉపశమనం పొందవచ్చు.

**పథ్యం :** కల్లు, సారాయి వాడకూడదు. దుంప కూరలు తినకూడదు.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ఇది ఎక్కువగా వంశపారంపర్యంగా వస్తుంది. కొన్నిరకాల మొక్కల పరాగరేణువులు, పెంపుడు జంతువుల వెంట్రుకలు కూడా ఈ వ్యాధిని కలిగించవచ్చు. పరిశుభ్రమైన పరిసరాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు చేతులు, కాళ్ళు సబ్బుతో కడుగుకోవటం మూలంగా ఈ వ్యాధి రాకుండా చేసుకోవచ్చు. 'వయ్యారిభామ' అనే మొక్క పరాగరేణువులు ఎక్కువగా ఈ వ్యాధిని కలుగచేస్తుంటాయి. ఇంటి పరిసరాల చుట్టూ ఈ మొక్క కనిపించినట్లయితే దానిని సమూలంగా పెరకి కాల్చివేయాలి.

# ఆయాసం

**వ్యాధి లక్షణాలు :** ఇది కూడా శ్వాసకోశ సంబంధమైన వ్యాధి. ఈ వ్యాధిగ్రస్తులు శ్వాస పీలుస్తున్నప్పుడు, దగ్గుతున్నప్పుడు విపరీతమైన ఆయాసానికి లోనవుతుంటారు.

**మొక్కపేరు :** కరక్కాయ చెట్టు



**శాస్త్రీయనామం :** టర్మినేలియ చబులా (TERMINALIA CHEBULA)

**కుటుంబం :** కంబ్రిటేసి (COMBRETACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అడవుల్లో సహజంగా పెరిగే వృక్షం. ఈ ఫలాన్ని ఆయుర్వేదంలో త్రిఫలాల్లో ఒకటిగా ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** ఈ చెట్టు బెరడు అవసరమున్నంత తీసుకొని ఎండలో ఎండబెట్టి, చూర్ణం చేసి పెట్టుకోవాలి. ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో కలిపి రోజుకు రెండుపూటలా 15 రోజులు తీసుకోవాలి. ఇలా చేసినట్లయితే ఆయాసంనుండి ఉపశమనం పొందవచ్చు.

**పథ్యం :** చల్లని నీరు త్రాగకూడదు.

**మొక్కపేరు :** ఇప్ప చెట్టు



**శాస్త్రీయనామం :** మధూక లాంగిఫోలియ రకం. లాటిఫోలియ

(MADHUCA LONGIFOLIA VAR. LATIFOLIA)

**కుటుంబం :** సపోటేసి (SAPOTACEAE)

**దొరుకు ప్రదేశం:** అన్ని ప్రాంతాల అడవులలో ఏపుగా పెరిగే వృక్షం. దీని పుష్పాలు తీయటి వాసన కల్గి ఉంటాయి. ఈ పుష్పాలతో గిరిజనులు ఇప్పసారా తయారు చేస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** పుష్పాలను ఎండలో బాగా ఆరబెట్టి మెత్తగా నూరి చెంచాడు చొప్పున తేనెలో కలిపి ప్రతిరోజు ఉదయం పరగడుపున, రాత్రి నిద్రపోయేముందు రెండు సార్లు 15 రోజులు వాడినట్లయితే ఆయాసంలో మంచి ఉపశమనం లభిస్తుంది. ఈ చూర్ణము గాజు సీసాలో నిలువ ఉంచుకోవచ్చు. సీసా మూతి గాలి దూరకుండా బిగించవలెను. ఎక్కువ రోజులు నిలువ చేయరాదు.

**మొక్కపేరు :** తిరుమాను చెట్టు



**శాస్త్రీయనామం :** అనగిస్సస్ లాటిఫోలియ (ANOGEISSUS LATIFOLIA)

**కుటుంబం :** కం(బ్రిటేసి (COMBRETACEAE)

**దొరుకు (ప్రదేశం :** అన్ని అడవులలో పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** ఒక చెంచా చెట్టు బెరడు చూర్ణాన్ని గ్లాసుడు గోరువెచ్చని నీళ్ళతో కలిపి 10 రోజుల పాటు రెండు పూటలా తీసుకోవాలి. ఆయాసం ఎక్కువగా ఉంటే రెండు చెంచాలపొడి తీసుకున్నట్లయితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. చూర్ణమును ఎక్కువ రోజులు నిలువ చేయరాదు.

**వ్యాధి రాకుండా ముందు జా(గ్రత్త చర్యలు :** అతి చల్లని వాతావరణం, ఎక్కువ రోజులు దగ్గు, జలుబు ఉండకుండా చూసుకొన్నట్లయితే ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు.

# 1.8 గుండె సంబంధిత వ్యాధులు

## గుండె నొప్పి, దడ

**వ్యాధి లక్షణాలు :** గుండెనొప్పి వచ్చేముందు ఛాతీలో నొప్పిగా ఉంటుంది. గుండె పోటు ఎక్కువయ్యే కొద్దీ మనిషి స్పృహ కోల్పోయి చనిపోతాడు.

**మొక్కపేరు :** బుట్టతీగ



**శాస్త్రీయనామం :** కార్డియోస్పెర్మం హలికకాబమ్ (CARDIOSPERMUM HALICACABUM)

**కుటుంబం :** సాపిండేసి (SAPINDACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు భూములు, అటవీ ప్రాంతాలలో ఎక్కువగా పెరిగే తీగ మొక్క.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, ఎండిన కాయలు

**తయారి/చికిత్సా విధానం :** గుండె నొప్పి మొదలవగానే రెండు మూడు పత్రాలు తీసుకొని బాగా నమిలి మింగాలి. కాయలను బాగా దంచి గుండె పై భాగంలో మామూలుగా రుద్దాలి. దీని వల్ల గుండెపోటు తగ్గే అవకాశం ఉంది.

**పథ్యం :** శాఖాహారము తీసుకోవాలి. కల్లు, సారాయి మానివేయాలి.

**వ్యాధి రాకుండా నివారణ చర్యలు :** గుండె నొప్పి సాధారణంగా రక్త నాళాల్లో క్రొవ్వు పదార్థాలు పేరుకొనిపోయి మూసుకొని పోవటం వల్ల వస్తుంది. కనుక సాధ్యమైనంత వరకు క్రొవ్వు పదార్థాలు తగ్గించాలి. ప్రతి రోజు వ్యాయామం చేయటంవల్ల కూడా ఈ సమస్య రాకుండా చూసుకోవచ్చు.

## గుండె బలానికి

గుండె బలాన్ని పెంచుకోవటానికి గిరిజన వైద్యంలో మంచి ఔషధులు ఉన్నాయి. మన ప్రాంతంలో గిరిజనులు అద్భుతమైన ఔషధాన్ని తయారు చేస్తున్నారు. దీనికోసం ఈ క్రింది మొక్కలను ఉపయోగిస్తున్నారు. 1)సుగంధిపాల (2) నేలతాడిగడ్డలు (3) పిల్లిపీచతేగలు

**1)మొక్కపేరు :** సుగంధిపాల, మాదంగడ్డ



**శాస్త్రీయనామం :** హెమిడిస్మస్ ఇండికస్ (HEMIDESMUS INDICUS)

**కుటుంబం :** ఆస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని ప్రదేశాలలో పెరిగే తీగ. మొక్క వేరు సుగంధ భరితంగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేరు

**మొక్కపేరు :** నేల తాటి గడ్డలు



**శాస్త్రీయనామం :** కర్కులిగో ఆర్కియాయిడిస్ (CURCULIGO ORCHIOIDES)

**కుటుంబం :** హైపోక్సిడేసి (HYPOXIDACEAE)

**దొరుకు ప్రదేశం :** పొలం గట్ల వెంబడి, బంజరు భూములలో బాగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** దుంప వేరు.

**మొక్కపేరు :** పిల్లిపీచ తేగలు



**శాస్త్రీయనామం :** ఆస్పరాగస్ రెసిమోసస్ (ASPARAGUS RACEMOSUS)

**కుటుంబం :** ఆస్పరాగేసి (ASPARAGACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులు, బంజరు భూములలో ఎక్కువగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేరు దుంప.

**తయారి/చికిత్సా విధానం :** 500 గ్రాముల సుగంధిపాల వేర్ల చూర్ణం, 200 గ్రాముల నేలతాడిగడ్డ చూర్ణం, 300 గ్రాములు పిల్లిపీచతేగ చూర్ణం ఒక లీటరు తేనెలో కలిపి నెలరోజులు ఊర బెట్టాలి. నెల రోజుల తరువాత ఈ టానిక్‌ని ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం రెండు స్పూన్ల చొప్పున 45 రోజులు తీసుకోవాలి. ఇది గుండె దడను తగ్గించడమేకాక మనిషిని మంచి ఉల్లాసంగా ఉంచి అలసటను దూరం చేస్తుంది. ఈ టానిక్‌పై మంచి పరిశోధనలు చేసినట్లయితే విలువైన విషయాలు ఎన్నో తెలిసే అవకాశం ఉంటుంది.

**పథ్యం :** కల్లు, సారాయి, మాంసాహారము, ఉష్ణ పదార్థాలు తినకూడదు.

**మొక్కపేరు :** అగ్నిశిఖ



**శాస్త్రీయనామం :** గ్లోరియోజ సుపర్బ (GLORIOSA SUPERBA)

**కుటుంబం :** లిలియేసి (LILIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క దట్టమైన అడవుల్లో నీటి ఊటలు దగ్గర పెరుగుతుంది. దీని దుంపలు 'వి' ఆకారంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** దుంప

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క దుంపలను నీళ్ళలో రెండు గంటలు ఉడకబెట్టి ఆరిన తరువాత చూర్ణం చేసి ఆవు పాలతో రెండు ఆవగింజల మోతాదులో కలిపి త్రాగితే రక్తనాళాలు శుభ్రపడి గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటాయి.

**మొక్కపేరు :** రక్త చందనం



**శాస్త్రీయనామం :** టీరోకార్పస్ సాంటలినస్ (PTEROCARPUS SANTALINUS)

**కుటుంబం :** ఫాబేసి (FABACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క నల్లమల అడవులలో మాత్రమే పెరుగుతుంది. దీని కలపతో విలువైన గృహోపకరణాలు తయారు చేస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క ఎండిన బెరడు 200 గ్రాములు తీసుకొని ఒక లీటరు నీటిలో బాగా మరిగించాలి. ఒక గ్లాసు మరిగిన కషాయానికి కొద్దిగా పటికబెల్లం చేర్చి అర గ్లాసు చొప్పున రెండు పూటలు తీసుకున్నట్లయితే గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ మందును మూడు నాలుగు రోజులు వాడాలి. పథ్యం పాటించాలి.

**మొక్కపేరు :** వెల్లుల్లి



**శాస్త్రీయనామం :** అలియం సటైవం (ALLIUM SATIVUM)

**కుటుంబం :** అలియేసి (ALLIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని పచారి కొట్లల్లో దొరుకుతుంది. దీనిని అన్ని ప్రాంతాలలో వాణిజ్య పంటగా పండిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క పత్ర పీఠాలు

**తయారి/చికిత్సా విధానం :** వెల్లుల్లి రేకలను ఒక పది తీసుకొని కావలసినంత తేనెలో 45 రోజులు ఊరబెట్టాలి. తరువాత ప్రతిరోజూ ఉదయాన్నే పరగడపున 2 రేకలు చొప్పున నెలరోజులు తీసుకున్నట్లయితే గుండె జబ్బులు పూర్తిగా దూరమవుతాయి. పథ్యం పాటించాలి.

# 1.9 ఉదర సంబంధిత వ్యాధులు

## పేగుపూత

**వ్యాధి లక్షణాలు :** పేగుపూతను అల్సర్ అంటారు. కడుపులో ఈ పుండ్లు ఏర్పడినప్పుడు విపరీతమైన మంట, ఆకలి మందగించటం, వాంతులు వంటి లక్షణాలు కన్పిస్తాయి. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవటం మూలంగా పేగుల లోపల గోడమాదిరిగా ఉన్న జిగురుపొర జీర్ణ రసాల ప్రభావానికి కరిగిపోయి ఈ పుండ్లు ఏర్పడతాయి. మానసిక ఆందోళనలు కూడా ఈ వ్యాధికి దోహదం చేస్తాయి.

**మొక్కపేరు :** గాడిదగడపాకు



**శాస్త్రీయనామం :** అరిస్టలోఖియ బ్రాక్టియేలేట (ARISTOLOCHIA BRACTEOLATA)

**కుటుంబం :** అరిస్టలోఖియేసి (ARISTOLOCHIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బంజరు భూములలో, చవుడు నేలలో బాగా పెరిగే చిన్నపాటి గుల్మము.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** గాడిదగడపాకు అవసరమున్నన్ని ఆకులు ఎండబెట్టి చూర్ణం చేసి ప్రతిరోజూ గ్లాసు మజ్జిగతో 2 చెంచాలు చొప్పున మూడు పూటలు త్రాగాలి. ఇలా పది రోజులు తీసుకొన్నట్లయితే పేగుపూత తగ్గిపోతుంది.

**పత్యం :** తీపి, పులుపు, కారం పూర్తిగా తగ్గించాలి. ఉష్ణ పదార్థాలు తీసుకోకూడదు.

మొక్కపేరు : పాలపీడ మొక్క



శాస్త్రీయనామం : రావుల్ఫియ టెట్రాఫిల్లా (RAUVOLFIA TETRAPHILLA)

కుటుంబం : అస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

దొరుకు ప్రదేశం : ఇది రోడ్లప్రక్క పొదల్లోను, అడవులల్లోను దొరికే మొక్క

ఉపయోగపడు భాగాలు : వేర్లు

తయారి/చికిత్సా విధానం : శుభ్రపరచిన వేర్లు దంచి ఎండబెట్టి చూర్ణం చేసుకోవాలి. ఈ పొడితో బఠాని గింజ సైజు మాత్రలు చేసుకొని రోజుకు రెండు చొప్పున 30 రోజులు తీసుకోవాలి

పథ్యం : ఉప్పు, కారం లేకుండా అన్నం తినాలి.

**మొక్కపేరు :** నేలమ్రరి, బొమ్మల మ్రరి



**శాస్త్రీయనామం :** క్లిరొడెన్డ్రం సెర్రేటం (CLERODENDRUM SERRATUM)

**కుటుంబం :** వర్బినేసి (VERBENACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అడవులలో దొరుకుతుంది. అధిక సేకరణ మూలంగా ఈ మొక్క క్రమంగా అంతరించిపోతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారీ/చికిత్సా విధానం :** ఈ మొక్క వేర్లు త్రవ్వి బాగా ఆరబెట్టాలి. ఆరిన తరువాత శుభ్రపరచి దంచి ఆ చూర్ణాన్ని గ్లాసు మజ్జిగలో 2 స్పూన్ల చొప్పున కలిపి ఉదయం, సాయంత్రం త్రాగించినట్లయితే కడుపులో పుండ్లు తగ్గిపోతాయి.

**పత్యం :** కారం ఎక్కువగా తినరాదు. పులుసులు తగ్గించాలి. వీలైనంతవరకు చప్పటి కూరలు తినాలి. మజ్జిగ ఎక్కువగా వాడాలి. నూనె పదార్థాలు, మాంసాహారాలు తినరాదు.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ప్రతిరోజూ సరైన సమయంలో భోజనం చేయటం, ఎక్కువగా నీరు త్రాగటం, మానసిక ప్రశాంతత, తక్కువగా మాంసాహారం, మసాలాలు తీసుకోవటం మూలంగా పేగుపూత రాకుండా చూసుకోవచ్చు.

# అజీర్తి

**వ్యాధి లక్షణాలు :** తీసుకున్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవటం, కడుపు ఉబ్బరంగా ఉండటం, పులిత్రేన్పులు రావటం, ఆకలి మందగించటం కూడా ఈ వ్యాధి లక్షణాలే.

**మొక్కపేరు :** నల్లేరు



**శాస్త్రీయనామం :** సిస్సస్ క్వాడ్రాంగ్యులారిస్ (CISSUS QUADRANGULARIS)

**కుటుంబం :** వైటేసి (VITACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఆంధ్రప్రదేశ్ అంతటా ముఖ్యంగా తక్కువ వర్షపాత ప్రాంతాలలో పెరుగుతుంది. నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం, చిగుర్లు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క లేత చిగుర్లు, లేత కాండాన్ని తగినంత అల్లం, చింతపండు కలిపి పచ్చడిగా చేసి భోజనంలో రోజుకు రెండు పూటలు వరుసగా మూడు రోజులు తీసుకోవాలి.

**మొక్కపేరు :** అడవి కొత్తిమీర



**శాస్త్రీయనామం :** పింపినెల్ల తిరుపతెన్సిస్ (PIMPINELLA TIRUPATIENSIS)

**కుటుంబం :** ఎపియేసి (APIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతాలలో చల్లని నీడ ప్రదేశాలలో పెరిగే అరుదైన మొక్క.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ప్రతి రోజు పిడికెడు ఆకులు కూరలలో వేసుకొని తిన్నట్లయితే అజీర్తి పూర్తిగా పోయి మంచి ఆకలితో రోగి చలాకీగా మారిపోతాడు. ఈ విధంగా అజీర్తి తగ్గిపోయేంతవరకు ఈ ఆకులను ఉపయోగించవచ్చు.

మొక్కపేరు : అల్లం (శొంఠి)



శాస్త్రీయనామం : జింజిబర్ అఫిసినేల్ (ZINGIBER OFFICINALE)

కుటుంబం : జింజిబరేసి (ZINGIBERACEAE)

దొరుకు ప్రదేశం : అల్లం కొమ్ము ఉడకబెట్టి ఎండబెట్టినట్లయితే శొంఠి తయారవుతుంది. అల్లం ఆంధ్రప్రదేశ్ అంతటా పండిస్తుంటారు.

ఉపయోగపడు భాగాలు : కాండం (కొమ్ము)

తయారి/చికిత్సా విధానం : శొంఠిపొడి 25 గ్రాములు తీసుకొని లీటరు నీటిలో పోసి పావు లీటరు అయ్యేవరకు మరిగించాలి. చల్లారిన తరువాత ఈ నీటిని ఉదయం పరగడపున, తరువాత రెండుసార్లు భోజనానికి ముందు వంద మిల్లీలీటర్ల చొప్పున త్రాగినట్లయితే మంచి ఫలితం కనిపిస్తుంది.

పథ్యం : సులభంగా అరిగే ఆహారమే తీసుకోవాలి.

**మొక్కపేరు :** మిరియాలు





**శాస్త్రీయనామం :** పైపర్ నైగ్రమ్ (PIPER NIGRUM)

**కుటుంబం :** పైపరేసి (PIPERACEAE)

**దొరుకు ప్రదేశం :** మిరియాలను విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల అడవుల్లో గిరిజనులు పండిస్తుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** మిరియాలు దంచి పొడిచేసి వేడిపాలలో పావు చెంచాడుకు తక్కువ కలిపి త్రాగాలి. ఇలా కొన్ని రోజులు వాడాలి. ఎక్కువ రోజులు వాడినట్లయితే వేడి చేస్తుంది.

**మొక్కపేరు :** బిల్లుడు



**శాస్త్రీయనామం :** క్లోరొజైలాన్ స్విటీనియా (CHLOROXYLON SWIETENIA)

**కుటుంబం :** ఫ్లిండర్షియేసి (FLINDERSIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అటవీ ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతుంది. దీని బెరడు మెత్తగా ఉంటుంది. కాండాన్ని వ్యవసాయ పనిముట్ల తయారీలో ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న చెట్టు బెరడుని బాగా దంచి బఠానీ సైజు మాత్రలు చేసుకొని ఉదయం రెండు, సాయంత్రం రెండు చొప్పున మూడు రోజులు తిన్నాక తీసుకొన్నట్లయితే అజీర్తి బాధ తొలిగిపోతుంది.

**మొక్కపేరు :** జాజుకి, ధాతకీ



**శాస్త్రీయనామం :** వుడ్‌ఫర్డియా ఫ్రూటికొజా (WOODFORDIA FRUTICOSA)

**కుటుంబం :** లైథ్రేసి (LYTHRACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అటవీ ప్రాంతాలలో బాగా పెరుగుతుంది. పుష్పాలు ఎరుపు రంగులో ఎంతో అందంగా ఉంటాయి. మార్చి నుండి జూన్ వరకు పుష్పాలు లభ్యమౌతాయి.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు పుష్పాలు పచ్చివి తీసుకొని అర లీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఈ కషాయాన్ని వడపోసి అరకప్పు చొప్పున రెండు పూటలు మూడు రోజులు తీసుకున్నట్లయితే జీర్ణ శక్తి బాగా వృద్ధి చెందుతుంది.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ప్రతిరోజు ఒకే సమయంలో ఆహారం తీసుకోవటం, నూనె, పదార్థాలు తగ్గించటం, మసాలాలు, మాంసాహారం తగ్గించటం, ఎక్కువగా నీటిని తీసుకోవటం మూలంగా అజీర్తి రాకుండ చూసుకోవచ్చు.

## కడుపు ఉబ్బరం / గ్యాస్ట్రిక్ ట్రబుల్

**వ్యాధి లక్షణాలు :** గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఎక్కువగా మనోవ్యధ చెందుతున్న వారిలోనూ, సమయానికి ఆహారం తీసుకోని వారిలోనూ, నిద్రలేమివల్ల ఎక్కువగా వస్తుంది. దీని వలన కడుపులో వాయువు ఎక్కువగా చేరి పొట్ట ఉబ్బరంగానూ, నిండినట్లుగానూ ఉంటుంది. ఆకలి మందగించడం, మల విసర్జనలో ఆపానవాయువు ఎక్కువగా విడుదల కావటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కరక్కాయ, ఉసిరి, తాని, బూచి మొక్కలను ఈ వ్యాధిలో ఉపయోగిస్తారు.

**1)మొక్కపేరు :** కరక్కాయ



**శాస్త్రీయనామం :** టర్మినేలియ చబులా (TERMINALIA CHEBULA)

**కుటుంబం :** కంబ్రిటేసి (COMBRETACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని అడవులలో పెరుగుతుంది.

**2)మొక్కపేరు :** ఉసిరి



**శాస్త్రీయనామం :** ఫిల్లాంథస్ ఎంబ్లిక (PHILLANTHUS EMBLICA)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని ప్రాంతాలలో, అన్ని అడవులలో పెరుగుతుంది.

**3)మొక్కపేరు :** తాని, విభీతకి



**శాస్త్రీయనామం :** టర్మినేలియ బెల్లరిక (TERMINALIA BELLIRICA)

**కుటుంబం :** కంబ్రిటేసి (COMBRETACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని జిల్లా అడవులలో పెరుగుతుంది.

**4)మొక్కపేరు :** బూచి



**శాస్త్రీయనామం :** స్లైఖిర ఓలియోజ (SCHLEICHERA OLEOSA)

**కుటుంబం :** సాపిండేసి (SAPINDACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ చెట్టు అడవులలో పెరుగుతుంది. లేత ఆకులు ఎరుపు రంగులో ఉంటాయి.

**తయారి/చికిత్సా విధానం :** కరక్కాయ, ఉసిరికాయ, తానికాయల మిశ్రమాన్ని ఆయుర్వేదంలో "త్రిఫలాచూర్ణం" అంటారు. ఈ త్రిఫల చూర్ణం 100 గ్రాములు మరియు బూచి చెట్టు బెరడు 50 గ్రాములు 1 లీటరు నీటిలో వేసి అది అర లీటరు అయ్యేంతవరకు బాగా మరిగించాలి. ఈ కషాయాన్ని వడపోసి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అరకప్పు చొప్పున 40 రోజులు వాడాలి.

**పాలపీడ చెట్టు, కొండపల్లేరు, చీమనేరేడు వంటి మొక్కల మిశ్రమాన్ని కూడా కడుపు ఉబ్బరానికి ఉపయోగిస్తారు.**

**1.మొక్కపేరు :** పాలపీడ



**శాస్త్రీయనామం :** రావుల్ఫియ టెట్రాఫిల్లా (RAUVOLFIA TETRAPHYLLA)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** దట్టమైన అడవి ప్రాంతాలైన ఖమ్మం, అదిలాబాద్, శ్రీకాకుళం వంటి జిల్లాలలో పెరుగుతుంది.

**2.మొక్కపేరు :** కొండ పల్లేరు



**శాస్త్రీయనామం :** సెలాస్ట్రస్ పానిక్యులేట (CELASTRUS PANICULATA)

**కుటుంబం :** సెలాస్ట్రేసి (CELASTRACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా బంజరు భూములలో, అటవీ భూములలో పెరుగుతుంది.

**3.మొక్కపేరు :** సీమ నేరేడు



**శాస్త్రీయనామం :** సైజీజియం క్యుమిని (SYZYGIUM CUMINI)

**కుటుంబం :** మిర్టేసి (MYRTACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని నేలల్లోనూ, అన్ని ప్రాంతాలలోనూ పెరుగుతుంది.

**తయారి/చికిత్సా విధానం :** పాలపీడ, కొండపల్లేరు, చీమ నేరేడు చెట్ల వేరు బెరడు 40 గ్రాములు చొప్పున తీసుకొని బాగా ఎండించి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణానికి కొద్దిగా నీటిని చేర్చి శనగగింజ సైజు మాత్రలు చేసుకొని రోజుకు ఒకటి చొప్పున రెండు పూటలు, 20 రోజులు తీసుకోవాలి. దీనితో కడుపు ఉబ్బరం నుంచి మంచి ఉపశమనం పొందవచ్చు.

**పథ్యం :** తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తీసుకోవాలి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** మనోవ్యాధిగ్రస్తులు ఎక్కువగా ప్రశాంతంగా, ఉల్లాసంగా ఉండేటట్లు చూసుకోవాలి. సరియైన సమయంలో రోజు భోజనం చేయాలి. వృద్ధులలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారు తేలికగా జీర్ణం అయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి. కాఫీ, టీల వాడకం తగ్గించాలి. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకున్నట్లయితే ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు.

# 1.10 మూత్రపిండ సంబంధిత వ్యాధులు

## మూత్రం సరిగా జారీ అగుటకు

మొక్కపేరు : నేల తంగేడు



శాస్త్రీయనామం : సెన్నా ఇటాలిక (CENNA ITALICA)

కుటుంబం : సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

దొరుకు ప్రదేశం : ఇది రాతి నేలల్లో పెరిగే చిన్నపాటి గుల్మం. దీని ఆకులతో చేసిన చట్నీ తిన్నట్లయితే విరేచనం సాఫీగా అవుతుంది.

ఉపయోగపడు భాగాలు : వేర్లు

తయారి/చికిత్సా విధానం : నేల తంగేడు వేరు సరిపడినంత ముక్క తీసుకొని బాగా ఎండించి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ఒక చెంచాడు చొప్పున రోజుకి ఒక పూట రెండు నుంచి మూడు రోజులు ఒక గ్లాసు నీటితో తాగినట్లయితే మూత్రం సరిగా జారీ అవుతుంది.

**మొక్కపేరు :** కొండరేల, కొండతంగేడు



**శాస్త్రీయనామం :** జైలియా జైలొకార్ప (XYLIA XYLOCARPA)

**కుటుంబం :** మైమోసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** తూర్పుగోదావరి, విశాఖపట్నం అటవీ ప్రాంతాలలో ఎక్కువగా దొరుకుతుంది. కాయలు వెడల్పుగా ఇటుకరంగులో ఉంటాయి. దీని కలప చాల ధృడంగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**తయారి/చికిత్సా విధానం :** 50 గ్రాముల పచ్చి బెరడు తీసుకొని మెత్తగా దంచాలి. దీనిని అరలీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. దాదాపు సగంపైగా నీరు ఆవిరి అయిన తరువాత దించి వడపోసి రెండు స్పూనుల చొప్పున రెండు పూటలు మూడు రోజులు తీసుకున్నట్లయితే మూత్రము సులభంగా జారీ అవుతుంది.

**మొక్కపేరు :** రేల



**శాస్త్రీయనామం :** కేసియ ఫిస్టుల (CASSIA FISTULA)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా రోడ్ల వెంబడి, అటవీ భూములలోనూ పెరుగుతుంది. పుష్పాలు మార్చి, ఏప్రిల్ మాసాలలో దొరుకుతాయి.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** పుష్పాలు ఎండించి నిలువ చేసుకోవచ్చు. ఈ ఎండిన పుష్పాలను 5 గ్రాముల (ఒక చెంచాడు) చొప్పున గ్లాసు నీటిలో కలిపి అర గ్లాసు అయ్యేంతవరకు మరిగించి రోజుకి మూడు పూటలా రెండు రోజులు త్రాగినట్లయితే మూత్ర సమస్య ఇట్టే తీరిపోతుంది.

**మొక్కపేరు :** పల్లేరు



**శాస్త్రీయనామం :** ట్రిబ్యులస్ టెరిస్ట్రిస్ (TRIBULUS TERRESTRIS)

**కుటుంబం :** జైగోఫిల్లేసి (ZYGOPHYLLACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, బీడు భూములలో పెరుగుతుంది. ఫలాలు ముండ్లను కలిగి ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న ఫలాలను 50 గ్రాములు తీసుకొని అరలీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఈ కషాయాన్ని వడపోసి ప్రతిరోజూ ఉదయం ఒక గ్లాసు త్రాగినట్లయితే మూత్రసమస్యలు దూరమవుతాయి. ఇలా 3 నుండి 4 రోజులు తీసుకోవాలి.

**మొక్కపేరు :** వెలుతురు చెట్టు



**శాస్త్రీయనామం :** డైక్రోస్టాఖిస్ సైనేరియ (DICHROSTACHYS CINEREA)

**కుటుంబం :** మైమోజేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, బీడు భూములలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** 50 గ్రాముల పచ్చి వేర్లు తీసుకొని దంచి కషాయం తయారు చేసుకోవాలి. ఈ కషాయాన్ని ఉదయం, సాయంత్రం అరకప్పు చొప్పున రెండు రోజులు త్రాగినట్లయితే మూత్రంలో మంట తగ్గిపోతుంది. ఎక్కువ నీరు త్రాగవలెను.

## మూత్రపిండంలో రాళ్ళు

**వ్యాధి లక్షణాలు :** కిడ్నీలో రాళ్ళు చేరినప్పుడు మూత్రం పోసేటప్పుడు విపరీతమైన నొప్పి రావటం, నడుము వెనుక భాగంలో సూదితో గుచ్చుతున్నట్లుగా నొప్పి రావటం వంటి లక్షణాలు ఉంటాయి. కిడ్నీలో ఉన్న రాయి పరిమాణాన్ని బట్టి కూడా ఈ నొప్పి ఆధారపడి ఉంటుంది. కిడ్నీలో రాళ్ళు తొలగించటానికి గిరిజన వైద్యంలో చక్కటి చికిత్సలు ఉన్నాయి.

**మొక్కపేరు :** కొండపిండికూర, పిండాకు



**శాస్త్రీయనామం :** ఎర్వా లానేటా (AERVA LANATA)

**కుటుంబం :** అమరాంథేసి (AMARANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క అన్ని బంజరు భూముల్లో, రోడ్ల వెంబడి, పొలం గట్ల వెంబడి పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** కొండపిండి ఆకులను కూరగా చేసుకొని తిన్నట్లయితే కిడ్నీలో రాళ్ళు కరిగిపోతాయి. ఇలా చేయలేనివారు ఎండిన పత్రాల పొడిని రెండు స్పూన్‌ల చొప్పున ఉదయం, సాయంత్రం గ్లాసు నీటిలో కలిపి వారం రోజులు త్రాగాలి. ఎక్కువ నీరు త్రాగవలెను.

**మొక్కపేరు :** నాగ దొండ, పిచ్చి దొండ, వెర్రి దొండ



**శాస్త్రీయనామం :** కొరాల్లొకార్పస్ ఏపిజియస్ (CORALLOCARPUS EPIGIUS)

**కుటుంబం :** కుకుర్బిటేసి (CUCURBITACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది డొంకల వెంబడి ఎక్కువగా పెరుగుతుంది. ఫలాలు చేదుగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలను బాగా ఎండించి పొడి చేసుకోవాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం భోజనం తరువాత అర చెంచాడు గోరువెచ్చని నీటిలో కలిపి త్రాగాలి. దీని మూలంగా మూత్రపిండంలో రాళ్ళు కరిగిపోయి బాధనుంచి ఉపశమనం కలుగుతుంది. ఇలా 15 రోజులు పాటించాలి.

**పథ్యం :** తేలిక ఆహారము తీసుకోవాలి. ఎక్కువ నీరు త్రాగాలి.

**మొక్కపేరు :** అడవి అరటి, ఊబ అరటి, బోంద అరటి.



**శాస్త్రీయనామం :** మ్యూసా బల్బిసియాన (MUSA BULBISIANA)

**కుటుంబం :** మ్యూసేసి (MUSACEAE)

**దొరుకు ప్రదేశం :** మారేడుమిల్లి అడవుల్లో మరియు గూడెం కొత్తవీధి అడవుల్లో మాత్రమే దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** దుంప కాండం

**తయారి/చికిత్సా విధానం :** ఈ అరటి బోదె చాలా లావుగాను, కాయలు గట్టి విత్తనాలతోను ఉంటాయి. కాయలు ఎర్రగా పండుతాయి. ఈ చెట్టు దుంపలు త్రవ్వి ఉడికించి ఆరబెట్టాలి. ఆరిన తరువాత చూర్ణం చేసి రెండు చెంచాల చొప్పున పుల్లటి మజ్జిగలో కలిపి త్రాగాలి. గ్లాసు మజ్జిగలో 2 స్పూన్ల చూర్ణం చొప్పున ఉదయం, సాయంత్రం 45 రోజులు వాడితే మూత్రాశయంలోను, కిడ్నీలోను ఉన్న రాళ్ళు కరిగిపోతాయి.

**వ్యాధి నివారణ చర్యలు :** పాలకూర, బచ్చలికూర, టమాటాతో కలిపి వండినట్లయితే వీటిలో ఉండే కాల్షియం ఆక్సిలేట్ స్పటికాలు కిడ్నీలో, మూత్రాశయంలో చేరి రాళ్ళుగా మారతాయి. కనుక టమాట, పాలకూర కలిపి వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఇవి రెండు కలిపి వండిన సందర్భాలలో ఎక్కువ మొత్తంలో నీరు త్రాగాలి. ప్రతిరోజు కూడా శరీరానికి అవసరం అయిన పరిణామంలో నీటిని త్రాగినట్లయితే మూత్రాశయంలో రాళ్ళు లేకుండా చూసుకోవచ్చు.

## 1.11 కాలేయ సంబంధిత వ్యాధులు

### పచ్చకామెర్లు

**వ్యాధిలక్షణాలు:** పచ్చకామెర్ల వ్యాధి ఎక్కువగా హెపటైటిస్-బి అనే వైరస్ వలన వస్తుంది. కలుషితమైన నీటిని త్రాగటం మూలంగా ఇది వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. కాలేయం సరిగా పని చేయకపోవటం, కాలేయ రసాలు అధికంగా ఉత్పత్తి అయి రక్తంలో కలియుట మూలంగా దేహం అంతా పసుపురంగులోకి మారుతుంది. ముఖ్యంగా కళ్ళు, చేతి గోర్లు పసుపు పచ్చగా మారి పోతాయి. అశ్రద్ధ చేసినట్లయితే మరణం సంభవిస్తుంది. గిరిజన వైద్యంలో కామెర్ల నివారణకు వివిధ రకాల మొక్కలను ఉపయోగిస్తారు. ఇంగ్లీష్ మందులకు కూడా లొంగని ఈ కామెర్ల వ్యాధి గిరిజన వైద్యానికి పూర్తిగా లొంగ వలసిందే.

**మొక్కపేరు :** కలువ



**శాస్త్రీయనామం :** నింఫియ నౌకాలి (NYMPHAEA NOUCHALI)

**కుటుంబం :** నింఫియేసి (NYMPHAEACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా చెరువులు, కుంటల్లో పెరుగుతుంది. పుష్పాలు తెలుపు, ఎరుపు, నీలం వర్ణంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** దుంప కాండం

**తయారి/చికిత్సా విధానం :** దుంపకాండం 200 గ్రాములు తీసుకొని చూర్ణించి దానికి పుట్ట తేనె చేర్చి ఉదయం పరగడుపున తీసుకొన్నట్లయితే వారం రోజుల్లో పచ్చ కామెర్లు తగ్గిపోతాయి.

**పత్యం :** మాంసం, గుడ్డు, చేపలు తినకూడదు.

**మొక్కపేరు :** జీలకర్ర



**శాస్త్రీయనామం :** క్యుమినం సైమినం (CUMINUM CYMINUM)

**కుటుంబం :** ఎపియేసి (APIACEAE)

**దొరుకు ప్రదేశం :** వాణిజ్య పంటగా అన్ని ప్రాంతాల్లో పండిస్తున్నారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**మొక్కపేరు :** నేల ఉసిరి



**శాస్త్రీయనామం :** ఫిల్లాంథస్ అమరస్ (PHYLLANTHUS AMARUS)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని రకాల నేలల్లో ముఖ్యంగా బంజరు భూములు, రోడ్ల వెంబడి పెరుగుతుంది. మొక్క చిన్నగా ఉండి పత్రాల గ్రీవంలో కాయలు ఉసిరికాయల మాదిరిగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు.

**తయారి/చికిత్సా విధానం :** జీలకర్ర, నేల ఉసిరి సమభాగాలు తీసుకొని మెత్తగా నూరి, తేనె కలిపి ప్రతీ రోజు ఉదయం ఒక స్పూను తీసుకొన్నట్లయితే కాలేయం సరిగ్గా పనిచేస్తూ కామెర్ల వ్యాధి త్వరగా తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** పసుపు





**శాస్త్రీయనామం :** కరక్యుమా లాంగా (CURCUMA LONGA)

**కుటుంబం :** జింజిబరేసి (ZINGIBERACEAE)

**దొరుకు ప్రదేశం :** దీనిని వాణిజ్య పంటగా అన్ని ప్రాంతాలలో పండిస్తుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** దుంప కాండం

**తయారి/చికిత్సా విధానం :** ఒక చెంచాడు పసుపు ఆవు పాలల్లో చేర్చి తోడుపెట్టాలి. ఈ విధంగా తయారైన ఆవు పెరుగుని ఉదయాన్నే ఆహారంతో తీసుకున్నట్లయితే వారం రోజులలో పచ్చ కామెర్ల రోగం తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** గలిజేరు, ఎర్ర గలిజేరు



**శాస్త్రీయనామం :** ట్రయాంతిమ పోర్చులకాస్ట్రం (TRIANTHEMA PORTULACASTRUM)

**కుటుంబం :** అయిజోయేసి (AIZOACEAE)

**దొరుకు ప్రదేశం :** వర్షా కాలంలో బంజరు భూముల్లో ఎక్కువగా పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న మొక్కను తీసుకొని బాగా దంచి పెరుగుతో పాటు రోజుకు 3 పూటలు 5 రోజులు తీసుకున్నట్లయితే కామెర్లు తగ్గిపోతాయి.

**పత్యం :** మాంసాహారం తీసుకోకూడదు.

**వ్యాధి నివారణ చర్యలు :** ఇది ఎక్కువగా కలుషిత నీటివలన వస్తుంది కాబట్టి బాగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలి. ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో లభించే టీకాలను తీసుకోవటం మూలంగా కూడా ఈ వ్యాధి రాకుండా నివారించుకోవచ్చు.

**పచ్చ కామెర్ల చూర్ణం :** పచ్చ కామెర్ల రోగానికి ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని గిరిజన ప్రాంతాలవారు పసర్లు చూర్ణాన్ని తయారు చేస్తున్నారు. ఈ చూర్ణం కామెర్ల నివారణలో అద్భుతంగా పని చేస్తుంది. ఈ చూర్ణం తయారీకి క్రింది మొక్కలను ఉపయోగిస్తారు.

| మొక్క పేరు | శాస్త్రీయనామం | కుటుంబం | ఉపయోగపడు భాగం | దొరుకు ప్రదేశం |
|---|---|---|---|---|
| కరక్కాయ | టర్మినేలియ చబులా | కంబ్రిటేసి | ఫలం | అన్ని రకాల అడవులు |
| తానికాయ | టర్మినేలియ బెల్లిరిక | కంబ్రిటేసి | ఫలం | అన్ని రకాల అడవులు |
| ఉసిరికాయ | ఫిల్లాంథస్ ఎంబ్లిక | యుఫర్బి యేస్ | ఫలం | అన్ని రకాల అడవులు |
| తిప్పతీగ | టీనోస్పొరా కార్డిఫోలియ | మెనిస్పర్మేసి | కాండం | బంజరు భూములు |
| అడ్డసరం | జస్టిషియా ఆడతొడ | అకాంథేసి | పత్రాలు | బంజరు భూములు |
| నేలవేము | ఆంద్రొగ్రాఫిస్ పానిక్యులేట | అకాంథేసి | పత్రాలు | బంజరు భూములు |
| వేప | అజాడిరక్టా ఇండిక | మీలియేసి | వేరు | అన్ని ప్రాంతాలు |

పైన పేర్కొన్న అన్ని మొక్కల ఉపయోగపడే భాగాలను సమపాలల్లో తీసుకొని బాగా ఎండబెట్టి చూర్ణం చేయాలి. ఈ చూర్ణాన్ని తేనెతో కలిపి ప్రతీ రోజు ఉదయం ఒక స్పూను తీసుకొన్నట్లయితే కామెర్ల వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది.



కరక్కాయ



ఉసిరికాయ



తానికాయ



తిప్పతీగ



అడ్డసరం



నేలవేము



వేప

# 1.12 చర్మ సంబంధిత వ్యాధులు

## గజ్జి

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి ఎక్కువగా అపరిశుభ్రత మూలంగా వస్తుంది. సరిగ్గా స్నానం చేయకపోవటం, మురికి ఉన్న ప్రాంతంలో తిరగటం, చిన్న పిల్లలు మురుగు, కలుషిత నీటిలో సంచరించటం వల్ల క్రిములు చర్మంపై చేరి విపరీతమైన దురదను కలుగచేస్తాయి. చర్మం గోకటం వల్ల పుండ్లు పడి చీము, రసి కారుతుంటుంది. ఇది ఎక్కువగా వేళ్ళ మధ్య కనిపిస్తుంది. ఒకరినుండి మరొకరికి బట్టలద్వారా, రసిక ద్వారా వ్యాప్తి చెందుతుంది. గిరిజన వైద్యం గజ్జిని తగ్గించడానికి చక్కటి వైద్యాన్ని సూచిస్తుంది. దీనికోసం ఈ క్రింది మొక్కలు ఉపయోగిస్తారు.

**మొక్కపేరు :** అటిక మామిడి



**శాస్త్రీయనామం :** బోయర్‌హవియ డిఫ్యూజ (BOERHAVIA DIFFUSA)

**కుటుంబం :** నిక్టాజినేసి (NYCTAGINACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఆంధ్రప్రదేశ్ అంతటా అన్ని నేలల్లో పెరుగుతుంది. దీని వేరు చాలా లోతుగా పెరిగి దుంపలా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు, దుంపవేరు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలు ఒక గుప్పెడు తీసుకొని 5 సెంటిమీటర్ల వేరుతో కలిపి బాగా మెత్తగా నూరాలి. దీనికి చిటికెడు ఉప్పు కలిపి గజ్జి ఉన్న ప్రదేశంలో లేపనంగా పూయాలి. ఇలా రెండు మూడు రోజులు చేసినట్లయితే గజ్జి తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** బోడతరం



**శాస్త్రీయనామం :** స్ఫెరాంథస్ ఇండికస్ (SPHAERANTHUS INDICUS)

**కుటుంబం :** ఆస్టరేసి (ASTERACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా చలక నేలల్లో కనిపిస్తుంది. వరి కోతలు అయిపోగానే వరిపొలాల్లో ఎక్కువగా పెరుగుతుంది. పత్రాలు ఘాటైన వాసన కలిగి ఉంటాయి. పుష్ప విన్యాసం గుండ్రంగా లేక కొంచెం కోలగా ఉండి వంగపండు రంగులో ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** మొక్కను వేర్లతో సహా సమూలంగా తీసి నీటిలో శుభ్రంగా కడిగి ఉప్పు నీటిలో గంటసేపు నాన బెట్టాలి. తరువాత దానిని బాగా దంచి పసరు తీసి గజ్జి ఉన్న ప్రదేశంలో రాసినట్లయితే గోకుడు తగ్గి పుండ్లు రెండు మూడు రోజులలో తగ్గుముఖం పడతాయి. 1–2 సార్లు వాడవలెను.

**1. మొక్కపేరు :** మురి పిండాకు



**శాస్త్రీయనామం :** అకాలిఫా ఇండిక (ACALYPHA INDICA)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని నేలల్లో రోడ్ల వెంబడి పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు.

**2. మొక్కపేరు :** తగిరస



**శాస్త్రీయనామం :** కేసియ టోర (CASSIA TORA)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా రోడ్ల వెంబడి పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు.

**తయారి/చికిత్సా విధానం :** మురిపిండాకు మరియు తగిరస పత్రాలను గుప్పెడు చొప్పున తీసుకొని గోరువెచ్చని నీటిలో బాగా కడిగి మెత్తగా నూరాలి. ఇలా నూరిన లేపనాన్ని గజ్జి ఉన్న చోట పూసినట్లయితే గజ్జినుండి త్వరిత విముక్తి కలుగుతుంది.

**మొక్కపేరు :** ఇసుకరాసి కూర



**శాస్త్రీయనామం :** మొల్లుగో న్యుడికాలిస్ (MOLLUGO NUDICAULIS)

**కుటుంబం :** మొల్లుజినేసి (MOLLUGINACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని నేలల్లో పెరుగుతుంది. నీటి తేమ ఎక్కువగా ఉన్న చోట విస్తారంగా పెరుగుతుంది. పుష్పాలు తెల్లగా చాలా చిన్నవిగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు.

**తయారి/చికిత్సా విధానం :** మొక్క అన్ని భాగాలను 200 గ్రాములు తీసుకొని అర లీటరు నీటిలో చిటికెడు ఉప్పు వేసి బాగా ఉడకబెట్టాలి. ఈ నీటిని వడపోసి ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేయాలి. ఇలా రెండు మూడు రోజులు చేసినట్లయితే గజ్జి పూర్తిగా తగ్గిపోతుంది.

1. మొక్కపేరు : తులసి



శాస్త్రీయనామం : ఆసిమమ్ టెన్యుయిఫ్లోరం (OCIMUM TENUIFLORUM)

కుటుంబం : లామియేసి (LAMIACEAE)

దొరుకు ప్రదేశం : ఈ మొక్కను హిందువులు చాలా పవిత్రంగా భావిస్తారు. ఇండ్లలోనూ, హైందవ దేవాలయాలలోనూ పెంచుతుంటారు.

ఉపయోగపడు భాగాలు : పత్రాలు

2. మొక్కపేరు : వేప



శాస్త్రీయనామం : అజాడిరక్టా ఇండిక (AZADIRACHTA INDICA)

కుటుంబం : మీలియేసి (MELIACEAE)

దొరుకు ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ అంతటా ఇండ్లలోనూ, రోడ్ల వెంబడి పెరుగుతుంది.

ఉపయోగపడు భాగాలు : పత్రాలు.

**3. మొక్కపేరు :** పసుపు



**శాస్త్రీయనామం :** కర్క్యుమా లాంగా (CURCUMA LONGA)

**కుటుంబం :** జింజిబరేసి (ZINGIBERACEAE)

**దొరుకు ప్రదేశం :** దీనిని ఎక్కువగా నల్లరేగడి నేలల్లో వాణిజ్య పంటగా పండిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** దుంప కాండం.

**తయారి/చికిత్సా విధానం :** తులసి, వేప పత్రాలు రెండు గుప్పెళ్ళు తీసుకొని పచ్చి పసుపు కొమ్మలు మూడింటిని చేర్చి బాగా మెత్తగా నూరాలి. దీనిని గజ్జి ఉన్న ప్రదేశంలో రాసినట్లయితే దురద వెంటనే తగ్గిపోయి పుండ్లు రెండు మూడు రోజులలో మానిపోతాయి. ఈ రెండు మూడు రోజులు తులసి, వేప పత్రాలు నీటిలో కలిపి వేడి చేసి ఒక చెంచా పసుపు, ఒక చెంచా ఉప్పు వేసి స్నానం చేయాలి.

**మొక్కపేరు :** కుందేటి కొమ్ము



**శాస్త్రీయనామం :** కారల్యుమా అడ్సెండెన్స్ (CARALLUMA ADSCENDENS)

**కుటుంబం :** ఆస్క్లెపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** రాతి నేలల్లో పెరుగుతుంది. పత్రాలు లేకుండా కాండాలు మాత్రమే కనిపిస్తుంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** కాండ భాగాలు.

**తయారి/చికిత్సా విధానం :** కుందేటి కొమ్ము కాండ భాగాలను పచ్చివి తీసుకొని సమపాళ్ళలో నల్లరేగడి మట్టితో కలిపి బాగా మెత్తగా నూరి ఆ ముద్దను గజ్జి ఉన్న చోట రాసి అరగంట తరువాత భరించగలిగినంత వేడి నీటితో స్నానం చేయాలి. ఇలా రెండు మూడు రోజులు చేసినట్లయితే మచ్చలు పడకుండా గజ్జి కురుపులు తగ్గిపోతాయి.

**గమనిక :** స్త్రీలకు, చిన్నపిల్లలకు వాడేటప్పుడు నల్లరేగడి మట్టి రెండు పాళ్ళు, కుందేటి కొమ్ము ఒక పాలు తీసుకొని వాడాలి.

**మొక్కపేరు :** పాచిబద్దు



**శాస్త్రీయనామం :** కసిథి ఫిలిఫార్మిస్ (CASSYTHA FILIFORMIS)

**కుటుంబం :** లారేసి (LAURACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది పరాన్నజీవిగా పెరుగుతుంది. వృక్షాలపైన తీగలా అల్లుకొని ఆకులు లేకుండా ఉంటుంది. కాండ భాగాలు పసుపు రంగులో ఉండి, పుష్పాలు తెల్లగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** పాచిబద్దు మొక్కను మెత్తగా నూరి గజ్జి ఉన్న చోట లేపనంగా పూయాలి. రెండు గంటల తరువాత శుభ్రమైన నీటితో కడిగివేసినట్లయితే రెండు మూడు రోజులలో గజ్జి తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** పసుపు పూల మొక్క



**శాస్త్రీయనామం :** బార్లీరియ ప్రియోనైటిస్ (BARLERIA PRIONITIS)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** నీటి తేమ ఉన్న ప్రదేశాలలో బాగా పెరుగుతుంది. అందమైన పూలకొరకు ఈ మొక్కను ఇండ్లలో కూడా పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు, ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చి విత్తనం లోపల ఉన్న పప్పుని దోరగా వేయించి కొద్దగా ఆముదాన్ని చేర్చి మెత్తగా నూరుకోవాలి. దీనిని గజ్జి, తామర ఉన్న ప్రదేశంలో రాసినట్లయితే రెండు మూడు రోజులలో తగ్గిపోతుంది. ఆకులను కూడా చికిత్సకు ఉపయోగించవచ్చు. ఆకులు పచ్చివి గుప్పెడు తీసుకొని కొద్దిగా ఉప్పు చేర్చి మెత్తగా నూరి గజ్జి ఉన్న చోట లేపనంలా రాసి పది నిమిషాల తరువాత భరించగలిగినంత వేడి నీటితో స్నానం చేయాలి.

**మొక్కపేరు :** అడ్డాకు



**శాస్త్రీయనామం :** బాహీనియా వాలై (BAUHINIA VAHLI)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలో సాధారణంగా పెరుగుతుంది. దీని కాండం చేవదేరి ఉన్నప్పటికీ ఎగ్రబ్రాకుతూ పెరుగుతుంది. ఆకులను విస్తరాకుల తయారీలో ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** వేరు, ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న వేర్లను, పత్రాలను తగినన్ని తీసుకొని బకెట్ నీటిలో వేసి బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడపోసి కొద్దిగా చన్నీళ్ళతో కలిపి స్నానం చేసినట్లయితే గజ్జి త్వరగా తగ్గిపోతుంది. ఇలా గజ్జి తగ్గిపోయేంతవరకు చేయవలసి ఉంటుంది. ఒంటి నొప్పులు ఉన్నవారు కూడా ఈ నీటితో స్నానం చేసినట్లయితే తగ్గిపోతాయి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** గజ్జి అంటు వ్యాధి. అపరిశుభ్రంగా ఉండటం, మురికి ప్రదేశాల వల్ల త్వరగా వ్యాపిస్తుంది. కనుక పెద్దవారు, చిన్నపిల్లలు ఉదయం సాయంత్రం పరిశుభ్రమైన నీటితో స్నానం చేయాలి. పరిశుభ్రమైన బట్టలు ధరించాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నట్లయితే గజ్జి రాకుండా ఉంటుంది.

# 1.13 జననేంద్రియ సంబంధిత వ్యాధులు

## గనేరియ

**వ్యాధి లక్షణాలు :** జననాంగాలు అపరిశుభ్రత మూలంగా ఒకరి కంటే ఎక్కువ మందితో సంభోగంలో పాల్గొనటం మూలంగా ఈ సుఖవ్యాధి వస్తుంది. ఆడవారిలో జననాంగం దగ్గర బాక్టీరియా ఎక్కువగా చేరి దుర్వాసన రావటం, చీము కారటం వంటివి జరుగుతాయి. దురద ఎక్కువగా ఉండి పుండ్లు కూడా పడతాయి. మగవారి అంగంపై పొక్కులు వంటివి వచ్చి మూత్ర విసర్జన సమయంలో విపరీతమైన మంట ఉంటుంది. దురద ఎక్కువ కావటం వల్ల అంగం పుండు పడిపోతుంది.

**మొక్కపేరు :** సర్పగంధి, పాతాళ గరుడ



**శాస్త్రీయనామం :** రావుల్ఫియ సర్పెంటైనా (RAUVOLFIA SERPENTINA)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అటవీ భూములలో దట్టమైన అడవులలో పెరుగుతుంది. దీని వేర్లు చేదుగా ఉంటాయి. కాయలు ఎరుపు, నలుపు రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేరుబెరడు

**తయారి/చికిత్సా విధానం :** పాతాళ గరుడ వేరుబెరడు బాగా ఎండించి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడికి కొద్దిగా ఆవనూనె కలిపి బఠాని సైజులో మాత్రలు చేసుకోవాలి. వీటిని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 15 రోజులు వాడినట్లయితే గనేరియా వ్యాధి తగ్గిపోతుంది. ఇవి వాడినన్ని రోజులూ సంభోగానికి దూరంగా ఉంటూ జననాంగాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఈ వేరు రక్తపోటును తగ్గిస్తుంది. రక్తపోటు తక్కువగా ఉన్న వారు దీనిని ఉపయోగించకూడదు.

# 1.13 జననేంద్రియ సంబంధిత వ్యాధులు

## గనేరియ

**వ్యాధి లక్షణాలు :** జననాంగాలు అపరిశుభ్రత మూలంగా ఒకరి కంటే ఎక్కువ మందితో సంభోగంలో పాల్గొనటం మూలంగా ఈ సుఖవ్యాధి వస్తుంది. ఆడవారిలో జననాంగం దగ్గర బాక్టీరియా ఎక్కువగా చేరి దుర్వాసన రావటం, చీము కారటం వంటివి జరుగుతాయి. దురద ఎక్కువగా ఉండి పుండ్లు కూడా పడతాయి. మగవారి అంగంపై పొక్కులు వంటివి వచ్చి మూత్ర విసర్జన సమయంలో విపరీతమైన మంట ఉంటుంది. దురద ఎక్కువ కావటం వల్ల అంగం పుండు పడిపోతుంది.

**మొక్కపేరు :** సర్పగంధి, పాతాళ గరుడ



**శాస్త్రీయనామం :** రావుల్ఫియ సర్పెంటైనా (RAUVOLFIA SERPENTINA)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అటవీ భూములలో దట్టమైన అడవులలో పెరుగుతుంది. దీని వేర్లు చేదుగా ఉంటాయి. కాయలు ఎరుపు, నలుపు రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేరుబెరడు

**తయారి/చికిత్సా విధానం :** పాతాళ గరుడ వేరుబెరడు బాగా ఎండించి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడికి కొద్దిగా ఆవనూనె కలిపి బఠాని సైజులో మాత్రలు చేసుకోవాలి. వీటిని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 15 రోజులు వాడినట్లయితే గనేరియా వ్యాధి తగ్గిపోతుంది. ఇవి వాడినన్ని రోజులూ సంభోగానికి దూరంగా ఉంటూ జననాంగాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఈ వేరు రక్తపోటును తగ్గిస్తుంది. రక్తపోటు తక్కువగా ఉన్న వారు దీనిని ఉపయోగించకూడదు.

**మొక్కపేరు :** పిచ్చికుసుమ



**శాస్త్రీయనామం :** ఆర్జిమోన్ మెక్సికాన (ARGEMONE MEXICANA)

**కుటుంబం :** పపావరేసి (PAPAVERACEAE)

**దొరుకు ప్రదేశం :** డొంకలు, పొలాలగట్లు, బంజరు భూములలో సాధారణంగా పెరుగుతుంది. పత్రాలు ముండ్లను కలిగి ఉండి పుష్పాలు పసుపు పచ్చగా ఉంటాయి. కాయలు సైతం ముండ్లను కలిగి ఉండి లోపల ఆవాల గింజలు మాదిరిగా విత్తనాలు ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్కనుండి కారే ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** మొక్క పత్రాలను, కాండాన్ని త్రుంచితే పసుపు రంగు ద్రవం కారుతుంది. ఈ ద్రవాన్ని గనేరియా పొక్కులపై రెండు రోజులు రాసినట్లయితే దురద, పొక్కులు మానిపోవును. ఒక వేళ మంట ఎక్కువగా ఉన్నట్లయితే పాలు రాసిన తరువాత కొద్దిగా బూడిదను అద్దినట్లయితే మంట తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** చిరునల్లింత



**శాస్త్రీయనామం :** గాంఫ్రిన సెర్రేట (GOMPHRENA SERRATA)

**కుటుంబం :** అమరాంథేసి (AMARANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, పంట పొలాల్లో, బంజరు భూములలో పెరుగుతుంది. ఆకులు ఎదుఎదురుగా ఉండి తెల్లటి పుష్పాలు పొడవుగా వస్తాయి. విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** గుప్పెడు వేర్లను తీసుకొని ఉప్పు నీటిలో గంట సేపు నానబెట్టాలి. ఆ తరువాత వీటిని శుభ్రంగా కడిగి రసం తీసి గనేరియా కురుపులపై రాసినట్లయితే తగ్గిపోతాయి. ఇలా రెండు మూడు రోజులు చేయాలి. వేర్లను సమూలంగా మెత్తగా నూరుకొని లేపనంలా రాసి రెండు మూడు గంటల తరువాత కడిగివేస్తే మంచి ఫలితం ఉంటుంది.

**మొక్కపేరు :** జీరిత మొక్క



**శాస్త్రీయనామం :** కొల్దినియ ప్రొకంబెన్స్ (COLDENIA PROCUMBENS)

**కుటుంబం :** బొరాజినేసి (BORAGINACEAE)

**దొరుకు ప్రదేశం :** రోడ్ల వెంబడి, చలక భూములలో పెరుగుతుంది. కాండం కొద్దిగా రస భరితంగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం

**తయారి/చికిత్సా విధానం :** పురుషాంగంపై ఉన్న పొక్కులు తగ్గిపోవాలంటే జీరిత మొక్క కాండాన్ని తుంచగా వచ్చే రసాన్ని పూయాలి. ఇలా రాసిన గంట తరువాత కొద్దిగా ఉప్పు, పసుపు కలిపిన నీటితో కడిగివేయాలి. ఇలా రెండు మూడు రోజులు చేసినట్లయితే కురుపులు తగ్గిపోతాయి.

**వ్యాధి నివారణ చర్యలు :** గనేరియా వ్యాధి ఎక్కువ మందితో సంభోగంలో పాల్గొనటం మూలంగా వస్తుంది. కావున వివాహం అయ్యేంతవరకు, వివాహం తరువాత కేవలం భార్యాభర్తల మధ్య మాత్రమే వైవాహిక సంబంధం మూలంగా ఈ వ్యాధిని రాకుండా నివారించవచ్చు. వివాహేతర సంబంధాల జోలికిపోకుండా ఉండాలి. జననాంగాల పరిశుభ్రత పాటించాలి.

# 1.14 స్త్రీలకు సంబంధించిన వ్యాధులు

## అధిక రక్తస్రావం

**వ్యాధి లక్షణాలు :** స్త్రీలలో ప్రతీనెల ఋతుస్రావం రావటం సాధారణ విషయం. రజస్వల అయిన దగ్గరనుండి 45 సంవత్సరముల వరకు ప్రతినెలా ఋతుస్రావం క్రమం తప్పకుండా వస్తుంది. కొంతమంది స్త్రీలలో ఋతుస్రావం సమయంలో అధికంగా రక్తస్రావం జరుగుతుంది. దీనివలన స్త్రీలు బలహీనపడిపోయి నీరసంగా ఉంటారు. ఇది ఎక్కువ అయ్యే కొద్దీ రక్తహీనత ఏర్పడుతుంది. ఈ అధిక రక్తస్రావాన్ని నివారించడానికి ఈ క్రింది మొక్కలతో చికిత్స చేస్తారు.

**మొక్కపేరు :** తుత్తురుబెండ



**శాస్త్రీయనామం :** అబుటిలాన్ ఇండికం (ABUTILON INDICUM)

**కుటుంబం :** మాల్వేసి (MALVACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని నేలల్లో ఆంధ్రప్రదేశ్ అంతటా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** 4 సెంటిమీటర్ల తుత్తురుబెండ వేరు తీసుకొని ఎండించి చూర్ణం చేసుకోవాలి. ఒక స్పూను తేనెకు ఒక స్పూను చూర్ణం కలిపి ఋతుస్రావం సమయంలో మూడు రోజులు తీసుకొన్నట్లయితే అధిక రక్తస్రావం జరగకుండా చూసుకోవచ్చు.

**మొక్కపేరు :** బ్రహ్మమేడి



**శాస్త్రీయనామం :** ఫైకస్ హిస్పిడ (FICUS HISPIDA)

**కుటుంబం :** మొరేసి (MORACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా బంజరు భూములలో పెరుగుతుంది. పత్రాలు పెద్దవిగా ఉండి చిన్నపాటి వృక్షంగా పెరుగుతుంది. కాయలు కాండంపైన గుత్తులుగా కాస్తాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఫలం (పుష్ప విన్యాసం)

**తయారి/చికిత్సా విధానం :** ఫలాలు బాగా ఎండించి మెత్తగా చూర్ణం చేసుకోవాలి. అరస్పూను చూర్ణాన్ని పాలల్లో కలిపి ఋతుస్రావం సమయంలో రోజుకు ఒక పూట మూడు రోజులు తీసుకున్నట్లయితే అధిక రక్తస్రావాన్ని నివారించవచ్చు. దీనికి ఒక స్పూను తేనె కలిపి తీసుకున్నట్లయితే రక్తహీనత కూడా దూరం అవుతుంది.

# 1.15 ధూప వైద్యం

హైందవులు తమ ఇంటి పెరటిలో తులసి మొక్కను పెంచుతుంటారు. స్త్రీలు ఉదయాన్నే తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజలు చేస్తుంటారు. ఇంటి ఆవరణలో తులసి మొక్క ఉన్నట్లయితే భూత, ప్రేత, పిశాచి బాధల నుండి తప్పించుకోవచ్చు అని వారి నమ్మకం. ఇక్కడ భూత, ప్రేత, పిశాచాలు అనగా కంటికి కనబడని బాక్టీరియా, వైరస్‌లే. శాస్త్రీయంగా కూడా ఇది నిరూపణ అయ్యింది. పూర్వ కాలంలో చరకుడు అంటు రోగాలకు మరియు ఇతర శస్త్ర చికిత్సల సమయంలో అష్టధూప ద్రవ్యములతో ఇంటిలో పొగ వేసేవారట. దీనివల్ల ఇంటి పరిసరాలలో ఉన్న బాక్టీరియ, వైరస్‌లతో పాటు ఇతర క్రిమి, కీటకాలు కూడా నశిస్తాయని వారి భావన. ఇటువంటి ధూప చికిత్సను ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలలో ఉన్న గిరిజన వెజ్జులు, గిరిజనులతో పాటుగా ఇతరులు కూడా తమ ఇండ్లల్లో ఉపయోగిస్తుంటారు. కొత్త కోడలు ఇంటిలో అడుగు పెడుతున్నప్పుడు, ప్రసవించినప్పుడు ధూపాన్ని వేస్తుంటారు. ఇంటిలో ఎవరికైనా సుస్తి చేసినప్పుడు, నలతగా ఉన్నప్పుడు కూడా దిష్టి పేరుతో రకరకాల ధూపాలను ఉపయోగిస్తుంటారు. వీటన్నిటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణం ఒక్కటే! అది కంటికి కనబడని బాక్టీరియా, వైరస్‌లను నిర్మూలించి ఆరోగ్యాన్ని పొందటం. మరి ధూప చికిత్స విధానానికి ఉపయోగించే మొక్కల గురించి తెలుసుకుందామా!

**మొక్కపేరు :** బవంచాలు



**శాస్త్రీయనామం :** కుల్లెన్ కొరిలిఫోలియం (Cullen Corylifolium)

**కుటుంబం :** ఫాబేసి (FABACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది పంట పొలాలలో కలుపు మొక్కగా పెరుగుతుంది. బంజరు భూములలో సర్వసాధారణంగా పెరుగుతుంది. దీని విత్తనాల నుండి వచ్చే నూనె ఎంతో సుగంధభరితంగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** ఎవరికైనా ఇంటిలో నలతగా ఉండి, దీర్ఘ ఆలోచనలు చేస్తున్నట్లయితే ఈ విత్తనాలను నిప్పులపై వేసి వచ్చిన పొగను ఇంటిలోపల, బయట వేస్తారు. దీని వల్ల ఆ వ్యక్తి ఉత్సాహవంతుడై తిరగగలుగుతాడు.

**గమనిక :** అవసరమైనప్పుడు కొన్ని సార్లు తిరిగి వాడవలెను.

**మొక్కపేరు :** వేప



**శాస్త్రీయనామం :** అజాడిరక్టా ఇండిక (AZADIRACHTA INDICA)

**కుటుంబం :** మిలియేసి (MELIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని ప్రాంతాలలో దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు, ఎండిన బెరడు.

**తయారి/చికిత్సా విధానం :** పచ్చిగా ఉన్న పత్రాలు, ఎండిన బెరడు నిప్పులపై వేస్తే దట్టమైన పొగవస్తుంది. ఈ పొగను ఇంటి లోపల, ఇంటి చుట్టూ వేసినట్లయితే దోమలు, ఈగలతో పాటు బాక్టీరియా, వైరస్‌లు కూడా దూరమవుతాయి. దోమల వల్ల పశువులు కూడా చాలా బాధ పడుతూ ఉంటాయి. రాత్రి వేలల్లో పశువుల కొట్టాల దగ్గర నిప్పులు ఉంచి వేప ఆకుల పొగ రాత్రంతా వేసినట్లయితే దోమల బెడద తీరిపోతుంది. ఇందులో సాంబ్రాణి కూడా కలిపితే ఇంకా మంచిది.

**మొక్కపేరు :** గుగ్గిలము



**శాస్త్రీయనామం :** షొరియ రొబస్టా (SHOREA ROBUSTA)

**కుటుంబం :** డిప్టిరోకార్పేసి (DIPTEROCARPACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ చెట్లు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం అడవులలో పెరుగుతాయి. దీని కలుపతో విలువైన సామాగ్రిని తయారు చేస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**తయారి/చికిత్సా విధానం :** గిరిజనులు ఎక్కువగా గుగ్గిలాన్ని ఉపయోగిస్తుంటారు. తల్లి బిడ్డను ప్రసవించిన రోజునుండి నెల రోజుల పాటు ఈ మొక్క బెరడు ధూపాన్ని ఇంటిలోపల వేస్తుంటారు. దీని మూలంగా భూతాలు పసిబిడ్డకు దరి చేరవని గిరిజనులు భావిస్తుంటారు.

**మొక్కపేరు :** వస



**శాస్త్రీయనామం :** అకోరస్ కలామస్ (ACORUS CALAMUS)

**కుటుంబం :** ఎరేసి (ARACEAE)

**దొరుకు ప్రదేశం :** విశాఖలో కొన్ని గిరిజన గ్రామాలలో పెంచుతారు. వాణిజ్యపంటగా రైతులు కొన్ని జిల్లాలలో పండిస్తున్నారు.

**ఉపయోగపడు భాగాలు :** దుంప

**తయారి/చికిత్సా విధానం :** దుంపను బాగా ఎండించి పొడిచేసుకోవాలి. ఈ పొడిని నిప్పులపై వేయగా వచ్చిన పొగను ఇంటిలో వేసినట్లయితే భూత, ప్రేతాలనుండి విముక్తి కలుగుతుంది. వృద్ధులు ఉన్నటువంటి గదులలో, తీవ్రగాయాలైన వ్యక్తులు ఉన్న గదులలో ఈ పొగను వేసినట్లయితే బాక్టీరియా, వైరస్‌ల బారినుండి తప్పించుకోవచ్చు.

**మొక్కపేరు :** తెల్ల తుమ్మ



**శాస్త్రీయనామం :** అకేసియ ల్యూకొఫ్లోవా (ACACIA LEUCOPHLOEA)

**కుటుంబం :** మైమోసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని అడవి ప్రదేశాలలో దొరుకుతుంది. దీని కాండ భాగాలు తెలుపు రంగులో ఉంటాయి. పుష్పాలు తెల్లగా గుత్తులుగా పూస్తాయి.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** తెల్లతుమ్మ చెట్టు వేర్లు చాలా ఘాటైన వాసనతో కలిగి విపరీతమైన చేదువాసన వస్తుంది. ఇంట్లో గాలి ధూలి పడిన గిరిజనులు ఈ చెట్ల వేర్లను నిప్పుల్లో వేసి పొగ వేస్తారు. ఇందులో సాంబ్రాని పొడి కలిపితే మంచిది. ఇంటిలో పొగవేసిన తరువాత పది నిమిషాలు ఎవరూ ఇంట్లో ఉండకూడదు.

# అధ్యాయం-2 సాధారణ వ్యాధులు - గిరిజన వైద్య చికిత్స

## 2.1 సాధారణ జ్వరం

**1.మొక్కపేరు :** చందనము, శ్రీగంధము



**శాస్త్రీయనామం :** సాంటలం ఆల్బం (SANTALUM ALBUM)

**కుటుంబం :** సాంటలేసి (SANTALACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. బాగా ముదిరి చేవదేరిన కాండం సుగంధభరితంగా ఉంటుంది. వాణిజ్యరీత్యా ఈ కలప ఎంతో విలువైనదిగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** బెరడు

**2. మొక్కపేరు :** తిప్పతీగ



**శాస్త్రీయనామం :** టీనోస్పొరా కార్డిఫోలియ (TINOSPORA CORDIFOLIA)

**కుటుంబం :** మెనిస్పర్మేసి (MENISPERMACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో, బంజరు భూములలో పెరిగే తీగ మొక్క. ఫలాలు పండినప్పుడు ఎరుపు రంగులో గుత్తులుగా ఉండి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. ఆకులు హృదయాకారంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, కాండం

**తయారి/చికిత్సా విధానం :** గంధం చెట్టు బెరడు 100 గ్రాములు, తిప్పతీగ వేర్లు 50 గ్రాములు తీసుకొని ఒక లీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఈ నీరు దాదాపుగా పావు భాగం అయ్యేంత వరకు వేడి చేసి దించుకోవాలి. చల్లారిన తరువాత ఈ కషాయాన్ని రోజుకు అరగ్లాసు చొప్పున ఆరు రోజులు తీసుకొన్నట్లయితే ఎటువంటి విషజ్వరం అయినా పూర్తిగా తగ్గిపోతుంది.

**పథ్యం :** వంకాయ, గోంగూర, మాంసాహారం వంటివి తినకూడదు.

## 2.2 మలేరియా జ్వరం

**వ్యాధి లక్షణాలు :** ఈ జ్వరం ఎక్కువగా దోమకాటువలన వస్తుంది. ఒకరి నుండి మరొకరికి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ జ్వరం సోకిన రోగి రోజు రోజుకు జ్వర తీవ్రత ఎక్కువ అవుతూ కృశించి పోతుంటాడు. విపరీతమైన తలనొప్పి, ఒంటి నొప్పులతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి పూట విపరీతమైన చలి జ్వరంతో రోగి బాధ పడుతూ ఉంటాడు. గిరిజన ప్రాంతాలలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. గిరిజన వైద్యంలో మలేరియా నివారణకు మంచి కషాయ ఔషధాన్ని ఉపయోగిస్తారు. ఈ కషాయాన్ని దాదాపుగా అన్ని గిరిజన ప్రాంతాలలో తయారుచేసుకొని ఉపయోగిస్తారు. ఈ కషాయం తయారీలో ఈ క్రింది మొక్కలను ఉపయోగిస్తారు.

| మొక్క పేరు | శాస్త్రీయనామం | కుటుంబం | ఉపయోగపడు భాగం | దొరుకు ప్రదేశం |
|---|---|---|---|---|
| నేలవేము | ఆండ్రిగ్రాఫిస్ | పానిక్యులేటా | పత్రాలు200గ్రా॥ | రోడ్లవెంట,బంజరు భూములు |
| వేప | అజాడిరక్త | ఇండిక | బెరడు, వేర్లు 300గ్రా॥ | బంజరు భూములు, అడవులు |
| తిప్పతీగ | టీనోస్పోరా | కార్డిఫోలియ | కాండం150గ్రా॥ | బీడు భూములు |
| సోమిచెట్టు | సోమిదా ఫిబ్రిప్యూగా | బెరడు | 100గ్రా॥ | అడవులు |
| తులసి | ఆసిమం | టెన్యుయిఫ్లోరం | పత్రాలు300గ్రా॥ | ఆంధ్రప్రదేశ్ అంతటా |
| మిరియాలు | పైపర్ నైగ్రం | విత్తనాలు | 10 గ్రా॥ | పచారి కొట్లు |
| తుమ్మి | ల్యూకాస్ ఆస్పెరా | వేర్లు | 100గ్రా॥ | బీడు భూములు |
| ఉసిరి | ఫిల్లాంథస్ ఎంబ్లిక | బెరడు | 50 గ్రా॥ | అడవులు |
| వెల్లుల్లి | అలియం సటైవం | పత్ర పీఠాలు | 10 గ్రా॥ | పంట పొలాలు, పచారి కొట్లు |
| సుగంధిపాల | హెమిడిస్మస్ ఇండికస్ | వేర్లు | 200గ్రా॥ | బీడు భూములు |


నేలవేము


వేప


తిప్పతీగ



సోమిచెట్టు



తుమ్మి కూర



ఉసిరి



తులసి



మిరియాలు



వెల్లుల్లి



సుగంధిపాల

**తయారీ/చికిత్సా విధానం :** పైన పేర్కొన్న అన్ని మూలికలు కలిపి దాదాపుగా 1500 గ్రాముల మిశ్రమాన్ని సుమారుగా 5 లీటర్ల నీటిలో వేసి ఒక రాత్రి అంతా బాగా నానబెట్టాలి. తరువాత అరగంటపాటు సన్నటి మంటపై మరిగిస్తూ మిశ్రమాన్ని బాగా కలపాలి. తరువాత పెద్ద మంటపై మిశ్రమాన్ని బాగా మరిగించి ఆవిరిని వేరే కుండలోకి తీసుకొని చల్లార్చినట్లయితే నీటి ఆవిరి నీరుగా మారి కషాయం తయారవుతుంది. కమ్మటి సువాసన కలిగిన ఈ నీరు సీసాలో భద్రపరచుకొని ఉంచుకోవాలి. మలేరియా వ్యాధి లక్షణాలు కనిపించిన రోగికి ఈ కషాయాన్ని రోజుకు మూడుపూటలు ఒక స్పూను చొప్పున వారం రోజులు ఇచ్చినట్లయితే మలేరియా జ్వరం పూర్తిగా తగ్గిపోతుంది. చిన్న పిల్లలకు అర చెంచా మోతాదు సరిపోతుంది.

**1)మొక్కపేరు :** నేలవేము



**శాస్త్రీయనామం :** ఆండ్రోగ్రాఫిస్ పానిక్యులేట (ANDROGRAPHIS PANICULATA)

**కుటుంబం :** అకాంథేసి (ACANTHACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు భూములు, ఎర్ర నేలల్లో ఎక్కువగా పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, ఆకులు

**2)మొక్కపేరు :** తిప్పతీగ, గుడూచి



**శాస్త్రీయనామం :** టీనోస్పోరా కార్డిఫోలియ (TINOSPORA CORDIFOLIA)

**కుటుంబం :** మెనిస్పెర్మేసి (MENISPERMACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులు, బంజరు భూములలో పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** కాండం

**3)మొక్కపేరు :** అల్లం (శొంఠి)



**శాస్త్రీయనామం :** జింజిబర్ అఫిసినేల్ (ZINGIBER OFFICINALE)

**కుటుంబం :** జింజిబరేసి (ZINGIBERACEAE)

**దొరుకు ప్రదేశం :** అల్లం కొమ్మును సున్నం నీళ్ళలో కలిపి ఉడకబెట్టి ఎండించినట్లయితే శొంఠి లభిస్తుంది. ఇది అన్ని పచారీ కొట్లలో దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కొమ్ము

**తయారి/చికిత్సా విధానం :** నేలవేము వేరు, ఆకులు 50 గ్రాములు, తిప్పతీగ కాండం 100 గ్రాములు, శొంఠి 50 గ్రాములు కలిపి బాగా మెత్తగా దంచాలి. ఈ మిశ్రమాన్ని ఒక గుడ్డలో కట్టి అరలీటరు నీటిలో వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని చల్లార్చి రెండు స్పూనులు రోజుకు రెండు సార్లు మూడు - ఐదు రోజులు తీసుకొన్నట్లయితే మలేరియా వంటి జ్వరాలు కూడా తగ్గిపోతాయి.

**వ్యాధి నివారణ చర్యలు :** వర్షాకాలంలో కుంటలు, నీటి గుంతలలో వర్షం నీరు చేరి ఎక్కువ రోజులు నిలువ ఉంటుంది. దోమలు ఈ నీటిలో గ్రుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి. కనుక ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటూ మురికి నీటి గుంతలను పూడ్చి వేయాలి. రాత్రి పడుకునేటప్పుడు దోమ తెరలను ఉపయోగించినట్లయితే దోమకాటు బారినుండి తప్పించుకోవచ్చు.

## 2.3 కుక్కకాటు

**వ్యాధి లక్షణాలు :** కుక్కలు కరిచినప్పుడు వాటి లాలాజలంలో ఉండే వైరస్ మనుషుల శరీరంలో ప్రవేశిస్తుంది. దీని మూలంగా 'రాబిస్' అనే వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారు నీటిని చూసి చాలా భయపడుతూ ఉంటారు. మానసిక ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు వస్తాయి.

**మొక్కపేరు :** తీగ మోదుగ





**శాస్త్రీయనామం :** బ్యుటియ సుపర్బ (Butea Suparba)

**కుటుంబం :** ఫాబేసి (Fabaceae)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని అడవులలో సాధారణంగా పెరిగే తీగజాతి మొక్క.

**ఉపయోగపడు భాగాలు :** పుష్పాలు

**తయారి/చికిత్సా విధానం :** తీగ మోదుగ పూలు వంద గ్రాములు తీసుకొని దంచి రసం తీయాలి. ఈ రసాన్ని ఒక గ్లాసు నీటిలో చేర్చి ఉదయం, సాయంత్రం మూడు రోజులు తీసుకోవాలి.

**పథ్యం :** వంకాయ, గోంగూర, మాంసాహారం వంటివి తినకూడదు.

**మొక్కపేరు :** దక్కి చెట్టు



**శాస్త్రీయనామం :** ఓరోజైలం ఇండికం (OROXYLUM INDICUM)

**కుటుంబం :** బిగ్నోనియేసి (BIGNONIACEAE)

**దొరుకు ప్రదేశం :** మన రాష్ట్రంలోని అన్ని అడవులలో పెరుగుతుంది. దీని కాయలు చాల పొడవుగా ఉండి విత్తనాలు రెక్కలను కల్గి ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** ఈ చెట్టుకు తూర్పువైపు ఉన్న బెరడుతీసి దంచి చూర్ణం చేయాలి. 100 గ్రాముల చూర్ణాన్ని రెండు గ్లాసుల నీటిలో కలిపి కాచి చల్లార్చిన కషాయం గ్లాసుడు నీటిలో కలిపి ఉదయం, సాయంత్రం త్రాగాలి. ఈ విధంగా 5 రోజులు తీసుకొన్నట్లయితే రాబిస్ వ్యాధి రాకుండా గాయం త్వరగా మానిపోతుంది.

**పథ్యం :** ఏ రోజు చూర్ణాన్ని ఆ రోజే తయారు చేసుకోవాలి. మాంసాహారం, గుడ్డు తినకూడదు. అర గ్లాసు పూటకు తీసుకోవాలి.

**మొక్కపేరు :** కుక్కవామిట లేదా పిచ్చివామిట



**శాస్త్రీయనామం :** క్లియోమ్ విస్కోజా (CLEOME VISCOSA)

**కుటుంబం :** కపారిడేసి (CAPPARIDACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్ పంటపొలాల్లో మరియు అన్ని ప్రదేశాలలో పెరుగుతుంది. దీని గింజలు ఆవ గింజలను పోలి ఉంటాయి. ఈ గింజలను ఆవగింజలకు బదులుగా ఉపయోగిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** కుక్కవామిట మొక్క వేర్లు గుప్పెడు మరియు 3 మిరియాలు వేసి దంచిన రసాన్ని రోగికి త్రాగించి, వడగట్టిన పిప్పిని గాయంపై కడితే విషం విరుగుడవుతుంది. ఈ మందుని ఒక పూటకే వాడాలి.

**పథ్యం :** కుమ్మడ, అరిసెలు, ఆవకాయ తినకూడదు. ఇతర తీపి వంటలు వాడవద్దు.

**మొక్కపేరు :** గరిక



**శాస్త్రీయనామం :** సైనోడాన్ డక్టైలాన్ (CYNODON DACTYLON)

**కుటుంబం :** పోయేసి (POACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్ అంతటా అన్ని రకాల నేలల్లో దొరుకుతుంది. వినాయక చవితికి ఈ మొక్కతో ప్రత్యేకంగా పూజలు చేస్తారు. గ్రహణం సమయంలో ఈ మొక్కను అన్ని రకాల ఆహార పదార్థాలపై ఉంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** మొక్క వేర్లు బాగా దంచి కుక్క కరిచిన చోట పట్టుగా వేయాలి. రెండు మూడు రోజుల్లో గాయం పూర్తిగా మానిపోతుంది. మరొకసారి కూడా వాడవచ్చు.

**పథ్యం :** వంకాయ, గోంగూర తినకూడదు.

**మొక్కపేరు :** పెద్ద పూలగడ్డి, పిల్లి మీసాల గడ్డి



**శాస్త్రీయనామం :** క్లోరిస్ బార్‌బేట (CHLORIS BARBATA)

**కుటుంబం :** పోయేసి (POACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఆంధ్రప్రదేశ్ అంతటా రోడ్లవెంట, బంజరు భూములలో పెరుగుతుంది

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** మొక్క మొత్తాన్ని వేర్లతో సహా మెత్తగా నూరాలి. దీనికి కొంచెం నీటిని చేర్చి పసరు తీయాలి. పరిశుభ్రమైన గుడ్డను ఈ పసరులో ముంచి కుక్క కరచిన ప్రదేశంలో కట్టినట్లయితే రాబిస్ వ్యాధి రాకుండా గాయం త్వరగా నయమౌతుంది.

**పథ్యం:** వంకాయ, పొట్లకాయ, చేదు బీరకాయ, తీపి వంటలు తినకూడదు.

**మొక్కపేరు :** తెల్ల తుమ్మ



**శాస్త్రీయనామం :** అకేషియ ల్యూకోఫ్లోవా (ACACIA LEUCOPHLOEA)

**కుటుంబం :** మైమోసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో, అడవులలో పెరుగుతుంది. కాండం తెల్లగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు, వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** విత్తనంలోపల ఉన్న పప్పును 20 గ్రాములు తీసుకొని 5 సెంటీమీటర్ల వేరుతో కలిపి బాగా మెత్తగా దంచాలి. ఈ మిశ్రమాన్ని కుక్క గాటుపై పెట్టి పరిశుభ్రమైన గుడ్డతో కట్టాలి. రెండురోజులలో గాయం మానిపోతుంది.

**పథ్యం :** పెరుగు, మజ్జిగ, వంకాయ, తీపి వంటలు తినకూడదు.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** పెంపుడు కుక్కలు, పిల్లులకు టీకాలు ఇప్పించాలి. ఊరకుక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే పశువుల డాక్టర్ సహాయంతో వాటికి టీకాలు ఇప్పించినట్లయితే కుక్కలు కరచినా కూడా రాబిస్ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు.

## 2.4 పాముకాటు

**మొక్కపేరు :** తేలుకొండి చెట్టు



**శాస్త్రీయనామం :** మార్టీనియ ఆన్యువ (MARTINIA ANNUA)

**కుటుంబం :** పెడాలియేసి (PEDALIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఎక్కువగా బంజరు భూములు, రోడ్ల వెంబడి పెరుగుతుంది. విత్తనాలు నల్లగా తేలు కొండి ఆకారంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** 5 సెంటిమీటర్ల వేరు మరియు ఒక విత్తనాన్ని కలిపి బాగా మెత్తగా నూరి మూడు భాగాలు చేసుకోవాలి. పాము కరిచిన రోగికి ఈ మూడు భాగాల్లోంచి ఒక భాగాన్ని వెంటనే ఒక గ్లాసు మంచినీటిలో కలిపి త్రాగించాలి. మిగిలిన రెండు భాగాలను నాలుగు గంటలకు ఒకసారి త్రాగించాలి. ఇలా చేసినట్లయితే పాముకాటు ద్వారా సోకిన విషం హరించిపోతుంది.

**పథ్యం :** వంకాయ, పొట్లకాయ, చేదు బీరకాయ తినకూడదు.

**మొక్కపేరు :** నల్ల ఈశ్వరి



**శాస్త్రీయనామం :** అరిస్టొలోఖియ ఇండిక (ARISTOLOCHIA INDICA)

**కుటుంబం :** అరిస్టోలోఖియేసి (ARISTOLOCHIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది తీగ మొక్క. పంట పొలాల వెంబడి, డొంకలలోనూ ఎత్తుగా ఉన్న చెట్లకు అల్లుకొని పెరుగుతుంది. కాయలు చిన్న చిన్న బుట్టల్లా వేలాడుతుంటాయి. విత్తనాలు త్రికోణం ఆకారంలో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పాము కరచిన వ్యక్తికి వెంటనే నల్లఈశ్వరి ఆకుల రసాన్ని రెండు లేదా మూడు చుక్కలు ముక్కులో పిండాలి. తరువాత పది గ్రాముల వేర్లు తీసుకొని ఒక ఆకుతో కలిపి మెత్తగా నూరి ఒక గ్లాసు మంచినీటిలో కలిపి త్రాగించాలి. విష ప్రభావం పూర్తిగా తొలగనట్లయితే మూడు గంటల తరువాత మరొక గ్లాసు మందు రోగిచేత త్రాగించాలి.

**మొక్కపేరు :** ప్రత్తి



**శాస్త్రీయనామం :** గాసిపియం హెర్బేసియం (GOSSIPIUM HERBACIUM)

**కుటుంబం :** మాల్వేసి (MALVACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్కను ఎక్కువగా నల్లరేగడి నేలల్లో వాణిజ్య పంటగా పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పాము కాటుకు గురైన వ్యక్తికి వెంటనే ప్రత్తి మొక్క వేర్లను కొన్ని బాగా నమిలించి రసం మింగించినట్లయితే విష ప్రభావంనుండి బయట పడతాడు. పాము కరచిన చోట పత్రాలను మెత్తగా నూరి కట్టు కట్టినట్లయితే విష ప్రభావం త్వరగా తగ్గుతుంది.

**మొక్కపేరు :** తెల్ల జిల్లేడు



**శాస్త్రీయనామం :** కెలొట్రొపిస్ జైగాంటియా (CALOTROPIS GIGANTEA)

**కుటుంబం :** ఆస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఎక్కువగా నీటి ఎద్దడి ఉన్న ప్రదేశాలలో పెరుగుతుంది. దీని వేరు భూమిలోపల చాలా లోతు వరకు చొచ్చుకొనిపోతుంది. పూలు తెల్లగాగాని, వంగపండు రంగులోగాని ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు (తెల్ల పూల రకం)

**తయారి/చికిత్సా విధానం :** పది సెంటిమీటర్ల తెల్ల జిల్లేడు వేర్లు తీసుకొని చిటికెడు ఉప్పు చేర్చి మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాసు పరిశుభ్రమైన నీటిలో కలిపి పాము కరచిన వ్యక్తికి త్రాగించినట్లయితే పాము కాటు వలన కలిగిన విషం తగ్గుతుంది.

**మొక్కపేరు :** అడవిబాదం



**శాస్త్రీయనామం :** స్టెర్క్యులియ ఫిటిడా (STERCULIA FOETIDA)

**కుటుంబం :** స్టెర్క్యులియేసి (STERCULIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. ఖమ్మం, తూర్పు గోదావరి, శ్రీకాకుళం ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతుంది. దీని పూలు నక్షత్రాలవలె ఉండి విపరీతమైన వాసనను కలిగి ఉంటాయి. కాయలు ఎర్రగా ఉండి పగిలినప్పుడు లోపల నల్లటి విత్తనాలు బయటకు కనిపిస్తూ ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** విత్తనాలు 50 గ్రాములు తీసుకొని మెత్తగా పొడి చేయాలి. ఈ పొడిని పాము కరిచిన వ్యక్తి నోటిలో వేసుకొని చప్పరిస్తూ రసం మింగినట్లయితే విష ప్రభావం తొలిగిపోతుంది. పచ్చిగా ఉన్న విత్తనాలను సగానికి కోసి పాము కరిచిన ప్రదేశంలో 'X' ఆకారంలో గాటుపెట్టి అతికించాలి. ఇవి రక్తంలో కలిసిన పాము విషాన్ని లాగివేయగానే ఊడి క్రింద పడిపోతాయి.

**మొక్కపేరు :** చిరుబొద్ది, కుస్తుర్ తొాండ, బొద్దుతీగ, గామ్‌పడ్, అకన్‌బిందు



**శాస్త్రీయనామం :** సింసాపలస్ పరీరా (CISSAMPELOS PAREIRA)

**కుటుంబం :** మినిస్పర్మేసి (MENISPERMACEAE)

**దొరుకు ప్రదేశం :** అటవీ ప్రాంతాలు, బంజరు భూములలో సాధారణంగా పెరుగుతుంది. దీని వేరు దుంపలా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** చిరుబొద్ది వేరు రసాన్ని రెండు చెంచాలు పాము కరచిన వ్యక్తికి త్రాగించినట్లయితే విషవిరుగుడు జరిగి నోటి వెంట నురుగు రావటం తగ్గిపోతుంది. ఇదే సమయంలో ఆకులను ముద్దగా దంచి పాము కరచిన ప్రదేశంలో వేసి కట్టుకట్టాలి. ఈ మొక్క వేరు రసాన్ని ఎటువంటి పాము కరచినా ఉపయోగించవచ్చు.

**మొక్కపేరు :** పాముతోలు మొక్క, పాము జీడుగు, పాము జెముడు



**శాస్త్రీయనామం :** సన్సివేరియా రాక్స్‌బర్గియాన (SANSEVIERIA ROXBURGHIANA)

**కుటుంబం :** అగావేసి (AGAVACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలో, రాతినేలల్లో ఎక్కువగా పెరుగుతుంది. ఆకులు ఆకుపచ్చ, పసుపుచారలను కలిగి ఎంతో అందంగా ఉండటం మూలంగా దీనిని ఉద్యానవనాలలో కూడా పెంచుతున్నారు.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** పాము కరిచిన వ్యక్తికి ఈ మొక్క వేర్ల నుండి తీసిన రసాన్ని రెండు మూడు చెంచాలు త్రాగించినట్లయితే వెంటనే విషవిరుగుడు జరిగిపోతుంది. ఒక వేళ స్పృహ కోల్పోయినట్లయితే ముక్కులో పది చుక్కల వరకు పిండినట్లయితే కొద్ది సేపటిలోనే లేచి కూర్చుంటారు.

**మొక్కపేరు :** తెల్ల ఈశ్వరి, పాముకాయ, తెల్ల ఉసిరి



**శాస్త్రీయనామం :** క్రొటలేరియ వెర్రుకోజ (CROTALARIA VERRUCOSA)

**కుటుంబం :** ఫాబేసి (FABACEAE)

**దొరుకు ప్రదేశం :** పంట పొలాలు, బంజరు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. పుష్పాలు తెలుపు, ఉదా రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** కాండము, వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** పాము కరిచిన వ్యక్తికి పచ్చి వేర్లనుండి తీసిన రసాన్ని నాలుగు చెంచాలు త్రాగించినట్లయితే విష విరుగుడు జరిగిపోతుంది. పాము కరిచిన ప్రదేశంలో ఈ చెట్టు వేర్లను మెత్తగా దంచి కట్టుకట్టినట్లయితే ఇంకా త్వరగా విషవిరుగుడు జరుగుతుంది. తూర్పుగోదావరి, ఖమ్మం, నల్గొండ జిల్లాలలో ఉన్న కొంతమంది గిరిజనులు చెట్టు కాండం భాగాలను మెడలోకాని, మొలకుకానీ కట్టుకుంటారు. దీని మూలంగా పాములు దగ్గరకు రావని వీరి నమ్మకం.

# 2.5 మొలలు

**వ్యాధి లక్షణాలు :** మల విసర్జన సాఫీగా లేకపోవటం వలన కొందరు. బలవంతంగా మల విసర్జన చేస్తుంటారు. దీని వలన మలద్వారం దగ్గర ఉన్న రక్త నాళాలు తీవ్ర ఒత్తిడికి లోనై సాగిపోతాయి. ఇవి క్రమేణా పెద్దవి అయి రక్తం, చీముతో నిండి మల విసర్జన చేసే సమయంలో విపరీతమైన నొప్పి కలుగుతుంటుంది. మలంతోపాటుగా రక్తం కూడా వస్తుంటుంది. వ్యాధి ముదిరిన దశలో రోగి నడవటం కూడా కష్టం అవుతుంది. మొలల వ్యాధిని తగ్గించటానికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ గిరిజనులు వివిధ రకాల చికిత్సలు చేస్తున్నారు. వీరు చేసే చికిత్సా విధానంలో ఈ క్రింది మొక్కలను ఉపయోగిస్తారు.

**మొక్కపేరు :** నేలవిమ్మి



**శాస్త్రీయనామం :** యుఫర్బియా ప్రొస్ట్రేటా (EUPHORBIA PROSTRATA)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** తేమగా ఉన్న అన్ని నేలల్లో ఇది పెరుగుతుంది. నేలపై పాకుతూ పెరిగే ఈ మొక్క పత్రాలు చాలా చిన్నవిగా ఉండి ఎరుపు, ఆకుపచ్చరంగులో ఉంటాయి. కాయలు ఉసిరికాయలు మాదిరిగా పత్రాల క్రింద చిన్నగా కాస్తుంటాయి. మొక్క నుండి పాల వంటి ద్రవం కారుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** నేలవిమ్మి మొక్క సమూలం తీసుకొని మెత్తగా దంచి చిటికెడు ఉప్పు చేర్చి మొలలపై పూతగా రాయాలి. ఇలా ఒక వారం రోజులు చేసినట్లయితే మొలలు పూర్తిగా తగ్గిపోతాయి. అన్ని రకాల మొలల వ్యాధికి ఈ మొక్క అమోఘంగా పని చేస్తుంది. దీని మాదిరే సముద్ర పాల ఆకులు కట్టి వాడవచ్చు.

## 2.6 ఎముకలు విరుగుట

**మొక్కపేరు :** నల్లేరు



**శాస్త్రీయనామం :** సిస్సస్ క్వాడ్రాంగ్యులారిస్ (CISSUS QUADRANGULARIS)

**కుటుంబం :** వైటేసి (VITACEAE)

**దొరుకు ప్రదేశం :** దీని కాండం నాలుగు పలుకలుగా ఉండి కణువులు అన్నీ అతుకులుగా ఉంటాయి. కాయలు పండినప్పుడు ఎరుపు, నలుపు రంగులో గుత్తులు గుత్తులుగా ఉంటాయి. ఇది ఎక్కువగా డొంకల వెంబడి, శుష్క ప్రాంతాలలో దట్టంగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు, కాండం, ఫలాలు

**తయారి/చికిత్సా విధానం :** వేర్లు, కాండం, ఫలాలు అన్నీ కలిపి బాగా మెత్తగా దంచి పసరు తీయాలి. ఒక పరిశుభ్రమైన గుడ్డను తీసుకొని ఈ పసరులో పది నిమిషాలు నానబెట్టాలి. తరువాత ఈ గుడ్డతో ఎముకలు విరిగిన ప్రదేశంలో గట్టిగా కట్టినట్లయితే విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. అయితే ఈ గుడ్డముక్కను రోజు మార్చి రోజు పసరులో ముంచి కట్టినట్లయితే సమస్య త్వరగా పరిష్కారం అవుతుంది.

**మొక్కపేరు :** కాకిదొండ, చేదు దొండ



**శాస్త్రీయనామం :** కాక్సీనియ గ్రాండిస్ (COCCINIA GRANDIS)

**కుటుంబం :** కుకుర్బిటేసి (CUCURBITACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది బీడు భూములలో ఇతర చెట్లకు అల్లుకొని పెరిగే తీగ. కాయలు మామూలు దొండకాయల వలె ఉంటాయి. అయితే పచ్చిగా ఉన్నప్పుడు కొంచెం చేదుగాను, పండినప్పుడు తియ్యగాను ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** కాకిదొండ పత్రాలను మెత్తగా దంచి పసరు తీయాలి. ఈ పసరుకి రెండు కోడిగుడ్ల సొనను కలిపి బాగా గిలకొట్టాలి. గుడ్డుసొన, పసరు బాగా కలిసిపోయిన తరువాత ఈ మిశ్రమాన్ని పొడవాటి శుభ్రమైన గుడ్డకు బాగా పట్టించాలి. ఈ మిశ్రమంలో తడిసిన గుడ్డను ఎముక విరిగిన ప్రదేశంలో గట్టిగా కట్టినట్లయితే వారం రోజులలో విరిగిన ఎముకలు అతుక్కుంటాయి. విరిగినప్పుడు చేతులు లేక కాళ్ళ భాగాలు వంకర పోయినట్లయితే వెదురు దబ్బలను పెట్టి బాగా గట్టిగా ఈ గుడ్డతో కట్టినట్లయితే వంపుపోయి విరిగిన ఎముకలు సరిగ్గా అయ్యి అతుక్కుపోతాయి. అవసరానికి తగినట్టు రెండు నుంచి మూడు కట్లు కట్టాలి.

**మొక్కపేరు :** సన్నతీగ మొక్క, పరితి మొక్క



**శాస్త్రీయనామం :** సిసాంపలస్ పరీర (CISSAMPELOS PAREIRA)

**కుటుంబం :** మినిస్పర్మేసి (MENISPERMACEAE)

**దొరుకు ప్రదేశం :** నీడ ప్రదేశాలు, తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చి ఆకులనుండి పసరు తీసి శుభ్రమైన గుడ్డకు బాగా పట్టించాలి. ఆకులు తక్కువగా ఉన్నట్లయితే ఆకుల రసంతోపాటు కోడిగుడ్డు తెల్ల సొనను కూడా గుడ్డకు బాగా పట్టించి ఎముక విరిగిన ప్రదేశంలో కట్టుకట్టాలి. 9 రోజులకు ఒకసారి మూడు కట్లు కట్టినట్లయితే విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి.

**మొక్కపేరు :** తీగ ముళ్లపాది, నక్కనాదికాయ



**శాస్త్రీయనామం :** పాసిఫ్లోరా ఫోయిటిడ (PASSIFLORA FOETIDA)

**కుటుంబం :** పాసిఫ్లోరేసి (PASSIFLORACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు భూములు, కొండవాలు ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతుంది. దీని ఆకులు ఒక రకమైన వాసనను కలిగి ఉంటాయి. కాయల చుట్టూ ముండ్ల మాదిరిగా ఉంటుంది.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు

**తయారి/చికిత్సా విధానం :** మొక్కను సమూలంగా తీసుకొని శుభ్రంగా కడిగి పసరు తీయాలి. ఈ పసరులో నాటు కోడిగుడ్డు తెల్లసొన, కొద్దిగా తుమ్మబంక వేసి బాగా గిలకొట్టాలి. ఈ రసంలో పొడవైన గుడ్డను ముంచి పదినిమిషాల తరువాత ఈ గుడ్డతో కట్టుకట్టాలి. నాలుగు రోజులకు ఒక కట్టుచొప్పున మొత్తం ఆరు కట్లు వేయాలి.

## 2.7 జ్ఞాపకశక్తి పెంపొందిచుటకు

గిరిజన వైద్యంలో జ్ఞాపకశక్తిని పెంపొందింపచేయటానికి కొన్ని మొక్కలను ఉపయోగిస్తారు. అవి.

**మొక్కపేరు :** సరస్వతి



**శాస్త్రీయనామం :** సెంటెల్లా ఏసియాటిక (CENTELLA ASIATICA)

**కుటుంబం :** ఎపియేసి (APIACEAE)

**దొరుకు ప్రదేశం :** నీటిపారుదుల ఎక్కువగా ఉన్న భూముల్లో బాగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు.

**తయారి/చికిత్సా విధానం :** రోజూ రెండు మూడు పత్రాలు తిన్నట్లయితే జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది.

**పథ్యం :** ఈ పత్రాలు తిన్నన్ని రోజులు మద్యం, మాంసాహారానికి దూరంగా ఉండాలి. చిన్నపిల్లలకు దొండకాయ, వంకాయ తినిపించకూడదు.

**మొక్కపేరు :** జలబ్రహ్మి



**శాస్త్రీయనామం :** బకోపా మొనిరి (BACOPA MONNIERI)

**కుటుంబం :** స్క్రోఫులారియేసి (SCROPHULARIACEAE)

**దొరుకు ప్రదేశం :** చల్లని నీరు ప్రవహించే ఊట నేలల్లో ఎక్కువగా పెరుగుతుంది. చెరువులు, నదుల ఒడ్డున కూడా బాగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం, ఆకులు, పూలు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క కాండం, ఆకులు, పూలు సేకరించి నీడలో ఎండించి చూర్ణం చేసుకొని పాలల్లో కలుపుకొని త్రాగాలి. గ్లాసు పాలకు 2 స్పూన్ల చొప్పున 45 రోజులు వాడాలి.

**మొక్కపేరు :** జ్యోతిష్మతి, ఎర్ర పల్లేరు తీగ



**శాస్త్రీయనామం :** సెలాస్ట్రస్ పానిక్యులేట (CELASTRUS PANICULATA)

**కుటుంబం :** సెలాస్ట్రేసి (CELASTRACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిరకాల అడవుల్లో దొరుకుతుంది. ఇది తీగబారు మొక్క.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు.

**తయారి/చికిత్సా విధానం :** ఎర్రపల్లేరు విత్తనాలు సేకరించి ఎండిన తరువాత నూనె తీయాలి. ఈ నూనెను పన్నెండు సంవత్సరాలు పైబడిన పిల్లలకు రాత్రి పడుకునేటప్పుడు 3 చుక్కలు తేనెతో కలిపి త్రాగించాలి. ఇలా 45 రోజులు వాడిన మంచి జ్ఞానం పెరుగుతుంది.

## 2.8 అతిసార వ్యాధి

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి ఎక్కువగా కలుషిత ఆహారం, నీరు తీసుకోవటం మూలంగా వస్తుంది. వ్యాధి సోకిన వారికి నీళ్ళ విరేచనాలు, వాంతులు ఎక్కువగా అవుతుంటాయి. శరీరంలో ఉన్న నీరంతా పోయి చివరకు ప్రాణాపాయం కూడా కలుగవచ్చు. ఈ వ్యాధి నివారణకు క్రింది మొక్కలను గిరిజన వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అవి

**మొక్కపేరు :** నల్ల దుచ్చరి, విష్ణుక్రాంత



**శాస్త్రీయనామం :** ఇవాల్వులస్ అల్సినాయిడిస్ (EVOLVULUS ALSINOIDES)

**కుటుంబం :** కన్వాల్వులేసి (CONVOLVULACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో పెరిగే చిన్నపాటి గుల్మము. పుష్పాలు నీలం రంగులో ఎంతో అందంగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క పత్రాలను 10 గ్రాములు తీసుకొని మెత్తగా నూరి ఒక గ్లాసు నీటిలో కలిపి రసం తయారుచేసుకోవాలి. దీనిని ఉదయం ఒకసారి సాయంత్రం ఒకసారి రెండు పూటలా త్రాగించాలి.

**పథ్యం :** కారం, ఉప్పు లేకుండా మజ్జిగ అన్నం తినాలి. చిటికెడు ఉప్పు, రెండు చెంచాల పంచదార గ్లాసు మజ్జిగ లేక కాచి చల్లార్చిన నీటిలో కలిపి గంట గంటకూ త్రాగాలి.

**మొక్కపేరు :** పెద్ద తుంగ



**శాస్త్రీయనామం :** సైపరస్ రొటండస్ (CYPERUS ROTUNDUS)

**కుటుంబం :** సైపరేసి (CYPERACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది నీరు ఎక్కువగా ఉన్న అన్ని ప్రదేశాలలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** దుంప

**తయారి/చికిత్సా విధానం :** బాగా ఏపుగా పెరిగిన తుంగ మొక్క దుంపను 10 గ్రాములు తీసుకొని మెత్తగా దంచి, 1 లీటరు నీటిలో బాగా మరగబెట్టాలి. చల్లారిన తరువాత వీలైనన్ని ఎక్కువసార్లు ఈ కషాయాన్ని రోగికి త్రాగించాలి.

**పథ్యం :** కారం, ఉప్పు తీసుకోకూడదు. కేవలం మజ్జిగ అన్నం మాత్రమే తినాలి. కాచి చల్లార్చిన నీళ్ళు ఎక్కువగా త్రాగాలి.

**మొక్కపేరు :** దానిమ్మ





**శాస్త్రీయనామం :** ప్యూనికా గ్రనేటమ్ (PUNICA GRANATUM)

**కుటుంబం :** ప్యూనికేసి (PUNICACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఆంధ్రప్రదేశ్ అంతటా ఇండ్లలోనూ, తోటల్లోనూ పెంచుతూ ఉంటారు.

**ఉపయోగపడు భాగాలు :** లేత చిగుళ్ళు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క లేత చిగుళ్ళు పిడికెడు తీసుకొని మెత్తగా నూరి గ్లాసు మజ్జిగలో కలిపి రోజుకు రెండు సార్లు త్రాగించాలి.

**పథ్యం :** కారం, ఉప్పు, పులుపు లేకుండా మజ్జిగ అన్నం లేక రాగి జావ త్రాగించాలి.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ఈ వ్యాధి ఎక్కువగా కలుషిత ఆహారం, నీరు మూలంగా వస్తుంది. గిరిజన ప్రాంతాలలో నీటి కొరత ఎక్కువగా ఉండటం, బహిరంగ మల, మూత్ర విసర్జన కూడా ఈ వ్యాధి ప్రబలటానికి ముఖ్య కారణం. కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు రోజుకు రెండు సార్లు స్నానం చేస్తూ, మల, మూత్ర విసర్జన చెయ్యగానే చేతులు, కాళ్ళు శుభ్రంగా సబ్బుతో కడుగుకోవాలి. బహిరంగ మలమూత్ర విసర్జన మానుకొని ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఉండేలా చూసుకోవాలి. బాగా మరిగించి చల్లార్చిన నీటిని పరిశుభ్రమైన కుండలో పోసి త్రాగాలి.

## 2.9 అధిక ఉష్ణం

**వ్యాధి లక్షణాలు :** శరీరంలో అధిక ఉష్ణం ఉన్నవారు కొంచెం నీరసంగా కనిపిస్తూ ఉంటారు. మూత్రం పసుపు లేక ఎరుపు రంగులో వస్తుంది. వీరు సన్నగా పీలగా కూడా ఉంటుంటారు.

**మొక్కపేరు :** సుగంధిపాల



**శాస్త్రీయనామం :** హెమిడెస్మస్ ఇండికస్ (HEMIDESMUS INDICUS)

**కుటుంబం :** ఆస్క్లిపియడేసి (ASCLIPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** కొంచెం తేమగా ఉన్న అన్ని ప్రాంతాలలో పెరుగుతుంది. ఎక్కువగా బంజరు భూముల్లో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** దుంపవేరు

**తయారి/చికిత్సా విధానం :** దుంప వేరు తీసుకొని బాగా ఎండబెట్టి చూర్ణం చేసి ప్రతిరోజూ ఒక గ్లాసు పాలలో రెండు చెంచాల పొడి వేసుకోవాలి. దీనిని రోజుకు రెండు పూటలా 10 రోజులు వాడినట్లయితే శరీరంలో ఉన్న అధిక ఉష్ణాన్ని ఇట్టే లాగేస్తుంది.

**పథ్యం :** వేడి చేసే పదార్థాలైన, క్రొవ్వు పదార్థాలు బాగా తగ్గించి మజ్జిగ ఎక్కువగా త్రాగుతూ ఉండాలి.

**మొక్కపేరు :** అడవి దొండ



**శాస్త్రీయనామం :** కాక్సీనియ గ్రాండిస్ (COCCINIA GRANDIS)

**కుటుంబం :** కుకుర్బిటేసి (CUCURBITACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలోనూ, ముండ్ల కంచెలలోనూ పెరిగే తీగమొక్క. కాయలు మామూలు దొండకాయలు మాదిరే ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** దుంప

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క మొదట్లో త్రవ్వితే దుంప ఉంటుంది. దీన్ని ఉడకబెట్టి తరువాత నీడలో ఆరబెట్టాలి. బాగా ఆరిన తరువాత చూర్ణం చేసి రోజుకు మూడు పూటలు ఒక చెంచా చూర్ణాన్ని గ్లాసు మంచినీటిలో కలిపి తీసుకోవాలి. ఈ విధంగా ఒక పది రోజులు వాడినట్లయితే మంచి గుణం కనిపిస్తుంది.

**పథ్యం :** ఈ చూర్ణం తీసుకొనే పదిరోజులు కూడా ఉదయాన్నే పరగడుపున ఒక గ్లాసు మంచి నీళ్ళు త్రాగాలి. మాంసాహారాన్ని తినకూడదు.

**మొక్కపేరు :** తపసి చెట్టు



**శాస్త్రీయనామం :** స్టెర్క్యులియా అరెన్స్ (STERCULIA URENS)

**కుటుంబం :** స్టెర్క్యులియేసి (STERCULIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని అడవులలో కనిపించే సహజ వృక్షం

**ఉపయోగపడు భాగాలు :** చెట్లు నుండి కారే జిగురు

**తయారి/చికిత్సా విధానం :** తపసి చెట్టు నుండి కారే బంకకు ఒక విశిష్ట గుణం ఉంది. జిగురు నీటిలో వేసిన ఒక గంటకు స్పాంజివలె ఉబ్బుతుంది. 50 గ్రాముల జిగురు తీసుకొని ఒక పాత్రలో గ్లాసు నీరు పోసి అందులో ఈ జిగురు వేసి రాత్రంతా నాననివ్వాలి. స్పాంజివలె తయారైన జిగురుకు కొంచెం పటికబెల్లం చేర్చి ప్రతిరోజు పరగడపునే తినాలి. ఇలా 15 రోజులు చేసినట్లయితే అధిక ఉష్ణం మటుమాయం అవుతుంది.

**పథ్యం :** ఈ జిగురు తింటున్నన్ని రోజులు ఎక్కువగా చలువ చేసే రాగి జావ, పెరుగు, మజ్జిగ అన్నం తినాలి.

**మొక్కపేరు :** దూసరి, షిబ్బి, చలువతీగ



**శాస్త్రీయనామం :** కాక్యులస్ హిర్స్యూటస్ (COCCULUS HIRSUTUS)

**కుటుంబం :** మినిస్పర్మేసి (MENISPERMACEAE)

**దొరుకు ప్రదేశం :** బంజరు భూములు, బీడు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. కాయలు నల్లగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** అధిక ఉష్ణం ఉన్నవారు పచ్చిగా ఉన్న దూసరి తీగ ఆకులను గుప్పెడు తీసుకొని శుభ్రంగా కడిగి పసరు తీయాలి. ఈ పసరును గ్లాసు మంచినీళ్ళలో వేసినట్లయితే గడ్డలా తయారవుతుంది. దీనిని రోజుకు ఒకసారి ఉదయం పూట తీసుకున్నట్లయితే శరీరంలోని అధిక ఉష్ణాన్ని తగ్గించవచ్చు.

**మొక్కపేరు :** సబ్జ ఆకు



**శాస్త్రీయనామం :** ఆసిమం బసిలకం (OCIMUM BASILICUM)

**కుటుంబం :** లామియేసి (LAMIACEAE)

**దొరుకు ప్రదేశం :** తేమ ప్రదేశాలలో పెరుగుతుంది. సువాసనభరితమైన ఆకుల దృష్ట్యా ఇండ్లల్లో కూడా పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** పది గ్రాముల విత్తనాలను గ్లాసు మంచినీటిలో వేసి పది నిమిషాలు ఉంచినట్లయితే తెల్లగా మారిపోతాయి. ఈ విత్తనాలను నీటితో పాటు త్రాగినట్లయితే శరీరంలోని అధిక ఉష్ణం తొలగిపోతుంది. వేసవిలో ప్రతీ రోజు ఈ నీటిని త్రాగవచ్చు. చిన్న పిల్లలకు మూడు రోజులకు ఒకసారి త్రాగించవచ్చు.

**మొక్కపేరు :** భూచక్ర గడ్డ



**శాస్త్రీయనామం :** మెరువ అబ్లాంగిఫోలియ (MAERUA OBLANGIFOLIA)

**కుటుంబం :** కప్పారిడేసి (CAPPARIDACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలో ఎక్కువగా పెరుగుతుంది. దీని దుంప 3 నుంచి 4 మీటర్లు లోతులో లభ్యమౌతుంది.

**ఉపయోగపడు భాగాలు :** దుంప వేరు

**తయారి/చికిత్సా విధానం :** అధిక ఉష్ణం ఉన్నవారు పచ్చిగా ఉన్న దుంప వేరును తీసుకొని శుభ్రంగా కడిగి రెండు నుంచి మూడు గ్రాములు ఉదయం, సాయంత్రం తినాలి. ఈ విధంగా ఒక వారం పాటు తీసుకున్నట్లయితే శరీరంలోని అధిక ఉష్ణాన్ని తగ్గించవచ్చు.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** శరీరంలో జీవక్రియా విధానంలో ఉష్ణం వెలువడుతుంది. అధికంగా క్రొవ్వు పదార్థాలైన నెయ్యి, వెన్న, నూనె మరియు మాంసము తినుట మూలంగా ఈ సమస్య ఎక్కువ అవుతుంది. ఇవి ఎక్కువగా ఇష్టపడే వారు చలువ చేసే పదార్థాలైన పెరుగు, మజ్జిగ, రాగిజావ మరియు ఎక్కువగా నీటిని తీసుకోవటం మూలంగా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

## 2.10 కీళ్ళ నొప్పులు

**వ్యాధి లక్షణాలు :** కీళ్ళ భాగంలో విపరీతమైన నొప్పులు ఉంటాయి. ఎక్కువసేపు నిలుచున్నా, నడిచినా ఈ నొప్పి ఎక్కువ అవుతుంది.

**మొక్కపేరు :** బొమ్మల మఱ్ఱి



**శాస్త్రీయనామం :** క్లెరొడెన్డ్రం సెర్రేటం (CLERODENDRUM SERRATUM)

**కుటుంబం :** వర్బినేసి (VERBENACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో, బంజరు భూములలో మరీ ముఖ్యంగా నల్ల నేలల్లో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** మొక్క వేర్లను 200 గ్రాములు తీసుకొని మెత్తగా నూరి బఠాని గింజ సైజులో మాత్రలు చేసుకోవాలి. వీటిని రోజుకు రెండు పూటలా 5 రోజులు తీసుకోవాలి.

**పథ్యం :** నీరు ఎక్కువగా త్రాగాలి. వెన్న, నెయ్యి పదార్థాలు తినకూడదు.

**1.మొక్కపేరు :** బిల్లగచ్చ



**శాస్త్రీయనామం :** సిసాల్పినియ బొండక్ (CAESALPINIA BONDUC)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్ అంతటా దొరుకుతుంది

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**2.మొక్కపేరు :** వెల్లుల్లి



**శాస్త్రీయనామం :** అలియం సటైవం (ALIUM SATIVUM)

**కుటుంబం :** లిలియేసి (LILIACEAE)

**ఉపయోగపడు భాగాలు :** పత్ర పీఠాలు

**తయారి/చికిత్సా విధానం :** బిల్లగచ్చ వేరు, వెల్లుల్లి బాగా దంచి, రసం తీసి కీళ్ళపైన రోజూ మర్ధన చేసినట్లయితే మంచి ఉపశమనం లభిస్తుంది. ఒక నెల రోజుల పాటు ఈ విధంగా చేసినట్లయితే కీళ్ళ నొప్పుల నుండి శాశ్వతంగా విముక్తి పొందవచ్చు.

**మొక్కపేరు :** ముళ్ళ బంతి, ముళ్ళ గొరిటి



**శాస్త్రీయనామం :** ఎఖినాప్స్ ఎఛైనేటస్ (ECHINOPS ECHINATUS)

**కుటుంబం :** ఆస్టరేసి (ASTERACEAE)

**దొరుకు ప్రదేశం :** బీడు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. మొక్క అన్ని భాగాలు ముండ్లను కలిగి ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** పచ్చివిగా ఉన్న వేర్లను గుప్పెడు తీసుకొని దంచి రసం తీయాలి. ఈ రసాన్ని నొప్పిగా ఉన్న కీళ్ళపైన రాసి మెల్లగా మర్ధన చేయాలి. తరువాత బంకమట్టితో పట్టువేయాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగివేయాలి. ఇలా మూడు వారాలపాటు చేసినట్లయితే కీళ్ళ బాధ నుండి మంచి ఉమశమనం లభిస్తుంది.

**మొక్కపేరు :** పుల్లకాడ



**శాస్త్రీయనామం :** యుఫర్బియ తిరుకలై (EUPHORBIA TIRUCALI)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** నీరు తక్కువగా ఉన్న ప్రదేశాలు, రాతి నేలలలో బాగా పెరుగుతుంది. దీనిని పొలాల వెంబడి కంచె మాదిరిగా కూడా ఉపయోగిస్తారు. కాండం ఆకులు లేకుండా ఉంటుంది. కాండ భాగాలను త్రుంచినట్లయితే పాలవంటి ద్రవం వస్తుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాండం నుండి కారే పాలవంటి ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** కాండాన్ని తుంచగా వచ్చే పాలను కీళ్ళపైన రాసి అరగంట తరువాత కడిగివేయాలి. ఇలా రోజు మార్చి రోజు వారం రోజులు చేసినట్లయితే కీళ్ళ నొప్పులు తగ్గిపోతాయి. సున్నితమైన చర్మం ఉన్నవారు ఈ పాలను కోడిగ్రుడ్డు తెల్లసొనలో కలిపి ఉపయోగించాలి.

# 2.11 నారి కురుపులు

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి సోకిన వారికి కాళ్ళలో సన్నటి క్రిములు చర్మం క్రింద నివాసం ఏర్పరచుకొని పుండు ఏర్పడుతుంది. చర్మం క్రింద సన్నగా పొడవైన క్రిములు కనిపిస్తూ ఉంటాయి.

**మొక్కపేరు :** ఆరి చెట్టు



**శాస్త్రీయనామం :** బాహీనియా రెసిమోజ (BAUHINIA RACEMOSA)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని రకాల అడవుల్లో ఆంధ్రప్రదేశ్ అంతటా దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** ఈ చెట్టు బెరడు తీసి మెత్తగా దంచి కుంకుడు గింజ సైజు మాత్రలు చేసుకోవాలి. నారి కురుపులపై దంచిన ముద్దను పట్టుగా వేయాలి. రోజుకు ఒక మాత్ర చొప్పున 5 రోజులు వాడాలి.

**మొక్కపేరు :** విషముష్టి



**శాస్త్రీయనామం :** స్ట్రిక్‌నాస్ నక్స్-వొమిక (STRYCHNOS NUX-VOMICA)

**కుటుంబం :** లొగానియేసి (LOGANIACEAE)

**దొరుకు ప్రదేశం :** అన్ని అడవులలో పెరుగుతుంది. పండ్లు ఎర్రగా నిగనిగలాడుతుంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** చెట్టు బెరడు

**తయారి/చికిత్సా విధానం :** చెట్టు బెరడు తీసి నీటితో శుభ్రం చేసి మెత్తగా దంచాలి. దీనిని ఎండబెట్టి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని మిరియాల పొడితో కలిపి నారి పుండుపై వ్రాస్తూ ఉండాలి. ఇలా 5 రోజులు చేసినట్లయితే గాయం లోపల ఉన్న నారి పురుగులు చనిపోయి గాయం పూర్తిగా మానిపోతుంది.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** ఈ వ్యాధి ఎక్కువగా కలుషితమైన నీరు వల్ల వస్తుంది. చెరువులు, కుంటలలో నీటిని వాడుకునే ముందు బాగా మరిగించి చల్లార్చి తాగినట్లయితే ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు. దిగుడు బావులు, చెరువులలో నీటిని త్రాగకుండా ఉండటం వల్ల కూడా ఈ వ్యాధి భారిన పడకుండా చూసుకోవచ్చు.

## 2.12 గోరుజెట్ట

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి ఎక్కువగా ఫంగస్ వల్ల వస్తుంది. సరైన శుభ్రత పాటించక పోవటం వల్ల గోర్లలో మురికి చేరి, ఫంగస్ వల్ల బాగా చీము పట్టి వాచిపోతుంది. దీని వల్ల గోరుచుట్టూ విపరీతమైన నొప్పి వస్తుంది. గిరిజన వైద్యంలో గోరుజెట్టకు మెరుగైన చికిత్స ఉంది.

**మొక్కపేరు :** నేయి బొడ్డి, చీపురు పండ్ల చెట్టు





**శాస్త్రీయనామం :** గ్రివియ హిర్సూట (GREWIA HIRSUTA)

**కుటుంబం :** టీలియేసి (TILIACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలో సర్వ సాధారణంగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** వేర్లు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క వేరు దంచి ముద్దగా చేసి గోరుజెట్టపై వేసి పరిశుభ్రమైన గుడ్డతో కట్టాలి. దీనిని తగ్గేంత వరకు రోజూ మారుస్తూ చేసినట్లయితే మూడు నాలుగు రోజులలో తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** రామ ములగ, చిత్రవంగ, పిచ్చి వంకాయ



**శాస్త్రీయనామం :** సొలానమ్ ఇండికం (SOLANUM INDICUM)

**కుటుంబం :** సొలనేసి (SOLANACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా చవుడు, బంజరు భూములు, రోడ్ల వెంబడి పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కాయలు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క కాయలను తీసుకొని నిప్పులపై పెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. చల్లారిన తరువాత గోరుచుట్టపై పెట్టి కాయలోని రసాన్ని గోరు చుట్టూ పడేలా చేయాలి. దీని వల్ల నొప్పినుండి వెంటనే ఉపశమనం కలిగి రెండు మూడు రోజులలో గోరుజెట్ట తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** నిమ్మ



**శాస్త్రీయనామం :** సిట్రస్ అరంటిఫోలియ (CITRUS AURANTIFOLIA)

**కుటుంబం :** రూటేసి (RUTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్కను ఎక్కువగా ఇంటి పెరటిలోనూ, ఎర్ర నేలల్లో, తోటల్లోనూ పెంచుతుంటారు.

**ఉపయోగపడు భాగాలు :** కాయలు

**తయారి/చికిత్సా విధానం :** నిమ్మ కాయకు రంధ్రం చేసి గోరుజెట్ట ఉన్న వేలును అందులో పెట్టి శుభ్రమైన గుడ్డతో కట్టినట్లయితే బాధనుండి ఉపశమనం పొంది రెండుమూడు రోజులలో గోరుజెట్ట తగ్గిపోతుంది.

**వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు :** గోర్లను పెరగకుండా కత్తిరించుకోవటం, మలవిసర్జన చేసిన తరువాత సబ్బుతో శుభ్రంగా కడుగుకోవటం, రోజుకు రెండు మూడు సార్లు చేతులను ముఖ్యంగా గోర్ల చుట్టూ శుభ్రం చేసుకోవటం మూలంగా ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు.

## 2.13 సెప్టిక్ గాయాలు

**వ్యాధి లక్షణాలు :** ఏదైనా తుప్పుపట్టిన ఇనుప వస్తువులు కానీ, బాగా మట్టి కొట్టుకొనిపోయిన గాజుముక్కలు, రాళ్ళు వంటి వాటివల్ల శరీరానికి గాయం అయినట్లయితే వాటిపై ఉండే బాక్టీరియ శరీరంలో ప్రవేశించి గాయం సెప్టిక్ అయ్యే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం చేసినట్లయితే గాయం పెద్దది అయి కాళ్ళు లేక చేతులు కోల్పోవటం లేక మొత్తం శరీరం విషతుల్యం అయిపోయి చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. గిరిజన వైద్యంలో దీనికి చక్కటి చికిత్సను సూచించడం జరిగింది.

**మొక్కపేరు :** గాజుకూర, కామాక్షి, కత్తికూర



**శాస్త్రీయనామం :** సొలానమ్ నైగ్రం (SOLANUM NIGRUM)

**కుటుంబం :** సొలనేసి (SOLANACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. సాధారణంగా పంట పొలాల్లో కలుపు మొక్కగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** గాజుకూర మొక్క ఆకులను గుప్పెడు తీసుకొని బాగా దంచి రసం తీసి సెప్టిక్ అయిన గాయంపై పోయాలి. ఈ విధంగా రెండు మూడు రోజులు చేసినట్లయితే గాయం తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** రుక్కిబుడుమడి



**శాస్త్రీయనామం :** ఫైసాలిస్ మినిమ (PHYSALIS MINIMA)

**కుటుంబం :** సొలనేసి (SOLANACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని జిల్లాల్లో కలుపు మొక్కగా పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ఈ మొక్క ఆకుల రసం తీసి గాయాలపై పూసినట్లయితే వెంటనే సెప్టిక్ గాయాలు తగ్గుముఖం పడతాయి. ఒక వారం పది రోజులలో గాయం పూర్తిగా నయం అయిపోతుంది.

**మొక్కపేరు :** కలిమి



**శాస్త్రీయనామం :** కారిస్సా కారండాస్ (CARISSA CARANDAS)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** అటవీ ప్రాంతాల చుట్టు ప్రక్కల మరియు శుష్క, బంజరు భూములలో ఎక్కువగా పెరుగుతుంది. పుష్పాలు తెల్లగా ఉంటాయి. కాయలు ఎరుపు నలుపు రంగులో ఉండి రుచికి పుల్లగా, తియ్యగా ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** ఏవైనా తుప్పు పట్టిన ఇనుప వస్తువుల వల్ల గాయం అయినట్లయితే కలిమి చెట్టు ఆకులు పచ్చివి మెత్తగా నూరి గాయంపై లేపనంగా పూయాలి. ఇలా గాయం తగ్గే వరకు రాసినట్లయితే సెప్టిక్ కాకుండా ఉంటుంది.

**వ్యాధి నివారణ చర్యలు :** తుప్పు వస్తువులు, గాజుపెంకులు, రాళ్ళవల్ల లోతైన గాయం అయిన వెంటనే టి.టి. ఇంజక్షన్ తీసుకోవాలి. దీని ద్వారా గాయం సెప్టిక్ కాకుండా చూసుకోవచ్చు.

## 2.14 నులిపురుగులు

**వ్యాధి లక్షణాలు :** అపరిశుభ్ర వాతావరణం, బహిరంగ మల విసర్జన, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవటం వల్ల ఈ నులిపురుగులు కడుపులో ప్రవేశించి చిన్న, పెద్ద ప్రేగులలో ఆవాసాన్ని ఏర్పరచుకుంటాయి. ఇవి లోపల విపరీతంగా పెరిగిపోయి అధిక ఆహారాన్ని తీసుకోవటం వల్ల ఇవి ఉన్న వ్యక్తులు నీరసించిపోతుంటారు. అప్పుడప్పుడు కడుపులో నొప్పి రావటం, ఆకలి మందగించటం, మలబద్ధకం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మలద్వారం దగ్గర విపరీతమైన దురద ఉంటుంది. గిరిజన వైద్యంలో ఈ వ్యాధి దిగువ సూచించిన మొక్కలను ఉపయోగిస్తున్నారు.

**మొక్కపేరు :** బిల్లగచ్చతీగ, గచ్చగాయ



**శాస్త్రీయనామం :** సిసాల్పినియ బొండక్ (CAESALPINIA BONDUC)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని జిల్లాల్లో దొరుకుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** విత్తనం లోపల ఉన్న పప్పును బయటకు తీసి ఎండబెట్టి పొడిచేసుకోవాలి. ఒక చెంచా పొడికి చిటికెడు ఉప్పు చేర్చి గ్లాసు నీటిలో కలిపి తీసుకొన్నట్లయితే రెండు మూడు రోజుల్లో నులిపురుగుల బాధ వదిలిపోతుంది.

**మొక్కపేరు :** కీకతి తీగ



**శాస్త్రీయనామం :** అర్గీరియ నెర్వోజ (ARGYREIA NERVOSA)

**కుటుంబం :** కన్వాల్వులేసి (CONVOLUVULACEAE)

**దొరుకు ప్రదేశం :** అడవులలో ఎక్కువగా పెరుగుతుంది. దీని పుష్పాలు నీలం రంగులో గొట్టాల మాదిరిగా ఉంటాయి. ఆకులు దీర్ఘ హృదయాకాంతో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేరు

**తయారి/చికిత్సా విధానం :** 5 గ్రాముల వేరు తీసుకొని మెత్తగా నూరి గ్లాసు నీళ్ళలో కలిపి త్రాగినట్లయితే నులిపురుగులు చచ్చిపోయి కడుపు నొప్పి, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి.

**మొక్కపేరు :** అత్తపత్తి







**శాస్త్రీయనామం :** మైమొసా ప్యుడిక (MIMOSA PUDICA)

**కుటుంబం :** మైమొసేసి (MIMOSACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో అన్ని ప్రాంతాలలో దొరుకుతుంది. దీని పత్రాలను తాకగానే అన్నీ ముడుచుకొని పోతాయి.

**ఉపయోగపడు భాగాలు :** వేరు

**తయారి/చికిత్సా విధానం :** 2 గ్రాముల వేరు తీసుకొని గ్లాసు నీళ్ళలో బాగా మరిగించి త్రాగినట్లయితే కడుపులో నులిపురుగులు చచ్చిపోతాయి.

**మొక్కపేరు :** కొడిశ పాల చెట్టు



**శాస్త్రీయనామం :** హోలరీనా యాంటిడిసెంటిరికా (HOLARRHENA ANTIDYSENTERICA)

**కుటుంబం :** అపోసైనేసి (APOCYNACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది కూడా అన్ని నేలల్లో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పత్రాలు

**తయారి/చికిత్సా విధానం :** పత్రాలను బాగా ఎండించి పొడి చేసుకోవాలి. ఒక చెంచా చూర్ణాన్ని తీసుకొని చిటికెడు ఉప్పు కలిపిన నీటికి కలిపి పరగడపున త్రాగాలి. ఇలా రెండు రోజులు చేసినట్లయితే నులిపురుగులు పూర్తిగా తొలిగి పోతాయి.

**వ్యాధి నివారణ చర్యలు :** అపరిశుభ్ర వాతావరణం, సరిగ్గా శుభ్రం చేయని కాయలు, ఆకు కూరలు తిన్నప్పుడు నులిపురుగులు కడుపులో ప్రవేశిస్తాయి. కనుక ఆహారం వండేముందు కాయగూరలు, ఆకు కూరలు శుభ్రంగా కడిగి తీసుకోవాలి. బహిరంగ మల విసర్జన చేయటం మానుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే ఈ నులిపురుగుల సమస్య రాకుండా చూసుకోవచ్చు.

# 2.15 మధుమేహం

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి ఎక్కువగా రక్తంలో ఇన్సులిన్ లోపం మూలంగా వస్తుంది. ఇన్సులిన్ అనే హార్మన్ స్థాయి రక్తంలో సక్రమంగా లేనప్పుడు రక్తంలో చక్కెర శాతం బాగా పెరిగిపోతుంది. దీని మూలంగా అనేకమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ముఖ్యంగా కాళ్ళు, కీళ్ళ నొప్పులు, అరికాళ్ళలో పుండ్లు ఏర్పడటం, గాయాలు మానకపోవటం, కంటి నాడులపై ప్రభావం మూలంగా కంటిచూపు కూడా తగ్గిపోయే ప్రమాదం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**వ్యాధి నివారణ చర్యలు/ముందు జాగ్రత్త చర్యలు :** మధుమేహ వ్యాధి రాకుండా చూసుకోవాలంటే ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలి.

- సరైన మోతాదులో కార్బోహైడ్రేట్‌లు (జొన్న, రాగులు, వరి, గోదుమ) వంటివి తీసుకుంటూ వీటికి సరిపడా ప్రోటీనులు (కంది, పెసర, అలసందలు, మినుములు) వంటివి కూడా తీసుకోవాలి.
- తీపి పదార్థాలు ఎక్కువగా తినకుండా ఉండాలి.
- రోజూ క్రమం తప్పకుండా శరీర వ్యాయామం పాటించాలి.
- ఎక్కువ మోతాదులో మంచినీరు త్రాగుతూ ఉండాలి.
- మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, రక్తంలో చక్కెరస్థాయి సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.

గిరిజన వైద్యం మధుమేహ వ్యాధికి ఈ క్రింది మొక్కలతో చక్కటి పరిష్కారం చూపిస్తుంది.

**మొక్కపేరు :** పొడపత్రి, మధునాశిని, పుట్టభద్ర



**శాస్త్రీయనామం :** జిమ్నిమా సిల్వెస్టర్ (GYMNEMA SYLVESTRE)

**కుటుంబం :** అస్క్లిపియడేసి (ASCLEPIADACEAE)

**దొరుకు ప్రదేశం :** పొడపత్రి సహజంగా అటవీ పరిసర ప్రాంతాలలో, బంజరు భూములలో పెరిగే తీగ మొక్క. పత్రాలు ప్రతి కణుపు వద్ద జతలు జతలుగా ఉంటాయి. ఈ మొక్క పత్రాలను నమిలి మింగిన తరువాత తీపి పదార్థాలు తిన్నట్లయితే చప్పగా ఉంటాయి. మధుమేహ రోగులకు ఈ మొక్క సంజీవని అని చెప్పవచ్చు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు

**తయారి/చికిత్సా విధానం :** మొక్కలు పుష్పించే సమయంలో పత్రాలను సేకరించుకొని నీడలో బాగా ఆరబెట్టాలి. ఒక్క తీగనుండి సుమారుగా 1-2 కేజీల పత్రాలు లభ్యమౌతాయి. బాగా ఎండిన ఆకులను పొడి చేసుకొని పరిశుభ్రమైన పాత్రలో నిల్వచేసుకోవచ్చు. ఈ పొడిని రోజూ రెండు చెంచాలు ఉదయం భోజనానికి ముందు గ్లాసు మంచినీటితో తీసుకొన్నట్లయితే మధుమేహ వ్యాధి క్రమంగా తగ్గుముఖం పడుతుంది.

**మొక్కపేరు :** తురక వేప



**శాస్త్రీయనామం :** మీలియా అజాడిరాక్ (MELIA AZADIRACH)

**కుటుంబం :** మీలియేసి (MELIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. కొన్ని గ్రామాలలో రోడ్ల వెంబడి కూడా పెరుగుతుంటాయి. ఆకులు, ఫలాలు మామూలు వేప మాదిరిగానే ఉంటాయి. పుష్పాలు మాత్రం కొంచెం తెలుపు, ఊదా రంగులలో ఉంటాయి. ఫలాలు గుండ్రంగా పసుపు రంగులో ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** ఫలాలు, విత్తనాలు

**తయారి/చికిత్సా విధానం :** ఫలాలను గింజలతో పాటుగా బాగా ఎండించాలి. తరువాత ఈ ఎండిన ఫలాలను మెత్తగా దంచి పొడి చేసుకోవాలి. ప్రతిరోజూ పరగడపున ఒక స్పూను తురకవేప గింజల పొడిని కొద్దిగా పుట్ట తేనెలో చేర్చి తీసుకొన్నట్లయితే చాలాకాలం నుండి ఉన్న మధుమేహ వ్యాధి సైతం పూర్తిగా తగ్గుముఖం పడుతుంది.

**మొక్కపేరు :** నేల ఉసిరి



**శాస్త్రీయనామం :** ఫిల్లాంథస్ అమరస్ (PHILLANTHUS AMARUS)

**కుటుంబం :** యుఫర్బియేసి (EUPHORBIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని రకాల నేలల్లో పెరిగే చిన్నపాటి గుల్మం. ఆకులు ఫలాలు పెద్ద ఉసిరి చెట్టు మాదిరిగానే ఉంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్క అన్ని భాగాలు.

**తయారి/చికిత్సా విధానం :** నేల ఉసిరి మొక్కను సమూలంగా తీసుకొని శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. పూర్తిగా ఎండిన తరువాత ఈ మొక్కను బాగా దంచి పొడిచేసుకోవాలి. 100 గ్రాముల నేల ఉసిరి పొడికి 10 గ్రాముల మిరియాల పొడిని చేర్చి ప్రతిరోజూ ఉదయం భోజనం చేసే ముందు తీసుకోవాలి. రోజు మార్చి రోజు ఈ మిశ్రమాన్ని కొద్దిగా తేనెతో కలిపి తీసుకోవటం మూలంగా ఎంతటి మధుమేహ వ్యాధి అయినా లొంగి రావలసిందే.

**మొక్కపేరు :** చిల్లగింజ



**శాస్త్రీయనామం :** స్ట్రిక్‌నాస్ పొటాటొరం (STRYCHNOS POTATORUM)

**కుటుంబం :** లొగానియేసి (LOGANIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవులలో పెరుగుతుంది. మన రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాంతాల అడవులలో పెరుగుతుంది. దీని విత్తనాలను నీటిలో వేసినట్లయితే నీటిలో ఉన్న మడ్డి కణాలు అన్నీ క్రిందకు చేరి నీరు శుభ్రపడుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు.

**తయారి/చికిత్సా విధానం :** చిల్ల గింజలను బాగా ఎండించిన తరువాత దోరగా వేయించాలి. ఈ విధంగా వేయించిన గింజలను మెత్తగా పొడిచేసుకోవాలి. ఒక స్పూను పొడికి చిటికెడు మిరియాల పొడిని కలిపి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా తీసుకొన్నట్లయితే మధుమేహ వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** చింత



**శాస్త్రీయనామం :** టామరిండస్ ఇండిక (TAMARINDUS INDICA)

**కుటుంబం :** సిసాల్పినియేసి (CAESALPINIACEAE)

**దొరుకు ప్రదేశం :** ఈ మొక్క అన్ని రకాల అడవులలో, గ్రామాలలో పెంచుతున్నారు. చింతపండు కోసం కొంతమంది ప్రత్యేకంగా తమ పంట పొలాలలో సాగు చేస్తున్నారు.

**ఉపయోగపడు భాగాలు :** విత్తనాలు, పూలు.

**తయారి/చికిత్సా విధానం :** బాగా ఎండిన విత్తనాలను దోరగా వేయించి పొడి చేసుకోవాలి. పూలను కూడా బాగా ఎండించి పొడి చేసుకోవాలి. ఈ రెండింటిని కలిపి మిశ్రమం చేసుకొని రోజుకు మూడు సార్లు రెండు స్పూనుల చొప్పున తీసుకోవాలి. ఇలా ఒక నెలరోజులపాటు చేసినట్లయితే మధుమేహ వ్యాధి తగ్గుదలలో గుణం కనిపిస్తుంది.

## 2.16 గవడ బిళ్ళలు

**వ్యాధి లక్షణాలు :** ఇది ఎక్కువగా వైరస్ వలన వస్తుంది. దవడకు వెనుకవైపు మెడ క్రింద ఉన్న గ్రంధులు వాచిపోయి భరింప లేని బాధ కలుగుతుంది. అన్నం తినేటప్పుడు, మింగేటప్పుడు కూడా బాధ ఉంటుంది. ఇది ఎక్కువగా చిన్న పిల్లలలో వస్తుంది. గవదబిళ్ళలకు క్రింద పేర్కొన్న మొక్కలతో చికిత్స చేసినట్లయితే మంచి గుణం కనిపిస్తుంది.

**మొక్కపేరు :** బర్రింక



**శాస్త్రీయనామం :** స్ట్రెబ్లస్ ఆస్పర్ (STREBLUS ASPER)

**కుటుంబం :** మొరేసి (MORACEAE)

**దొరుకు ప్రదేశం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని అటవీ ప్రాంతాలలో విరివిగా లభ్యమవుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పాల వంటి ద్రవం.

**తయారీ/చికిత్సా విధానం :** ఈ చెట్టు బెరడు కత్తితో గాటు పెడితే పాలవంటి ద్రవం కారుతుంది. ఈ పాలను శుభ్రమైన బట్టకు పట్టించి గవద బిళ్ళపై అతికించాలి. ఇలా మూడు రోజులు చేసినట్లయితే గవద బిళ్ళలు తగ్గిపోతాయి.

**మొక్కపేరు :** పనస



**శాస్త్రీయనామం :** ఆర్టోకార్పస్ హెటిరోఫిల్లస్

(ARTOCARPUS HETEROPHYLLUS)

**కుటుంబం :** మొరేసి (MORACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అందరికీ తెలిసిన వృక్షమే. ఇది అన్ని అడవులలో పెరుగుతుంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరంలో ఎక్కువగా లభ్యమవుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పాల వంటి ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** చెట్టు కాండంపై కత్తితో గాటు పెడితే పాలవంటి ద్రవం కారుతుంది. ఈ పాలను గవదబిళ్ళలపై పట్టుగా వేసినట్లయితే రెండు మూడు రోజులలో బాధ తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** మేడి చెట్టు



**శాస్త్రీయనామం :** ఫైకస్ రెసిమోజ (FICUS RACEMOSA)

**కుటుంబం :** మోరేసి (MORACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది అన్ని ప్రాంతాలలో పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** పాలవంటి ద్రవం.

**తయారి/చికిత్సా విధానం :** మేడి చెట్టు కాండంపై గాటుపెడితే పాలవంటి ద్రవం కారుతుంది. ఈ పాలకు బియ్యం పిండి కొద్దిగా కలిపి గవదబిళ్ళపై పట్టుగా పూయాలి. ఇలా చేస్తే రెండు మూడు రోజులలో గవద బిళ్ళల సమస్య తగ్గిపోతుంది.

**మొక్కపేరు :** గాటు మందు



**శాస్త్రీయనామం :** అడియాంటం లున్యులేటం (ADIANTUM LUNULATUM)

**కుటుంబం :** అడియాంటేసి (ADIANTACEAE)

**దొరుకు ప్రదేశం :** ఇది ఎక్కువగా అడవుల్లో తేమ ఉన్న చోట పెరుగుతుంది.

**ఉపయోగపడు భాగాలు :** కొమ్ము (దుంప కాండం)

**తయారి/చికిత్సా విధానం :** 50 గ్రాముల దుంప తీసుకొని మెత్తగా నూరి దానిని గవద బిళ్ళలపై పట్టు వేయాలి. పూర్తిగా ఆరిన తరువాత దానిపై కొంచెం పసుపు పూసినట్లయితే ఒకటి రెండు రోజులలో సమస్యనుండి బయటపడవచ్చు.

**వ్యాధి నివారణ చర్యలు :** ఇది ఎక్కువగా వైరస్ వలన వచ్చే అంటువ్యాధి. ఈ వ్యాధి వచ్చిన వారు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేస్తారు. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో పుక్కిలిస్తే మంచి ఉపశమనం పొందవచ్చు. కూరగాయలు శుభ్రంగా కడిగి తినాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

# 2.17 బోదకాలు

**వ్యాధి లక్షణాలు :** ఇది ఎక్కువగా ఎనాఫిలిస్ దోమ కుట్టటం మూలంగా వస్తుంది. ఈ దోమలు కుట్టినప్పుడు రోగకారక క్రిములు మనిషి శరీరంలోకి ప్రవేశించి లింఫ్ గ్రంధులలో చేరుతాయి. అక్కడ స్రావాలను అడ్డుకోవటం మూలంగా కాళ్ళల్లో బాగా నీరు చేరి లావుగా తయారవుతాయి. ఈ వ్యాధిని ఏనుగుపాదం అని కూడా అంటారు. బోదకాలుని తగ్గించటానికి గిరిజనులు వివిధ రకాల మొక్కలతో చికిత్స చేస్తున్నారు.

